ISSN 2766-0168
అంతర్జాల త్రైమాస పత్రిక
వ్యవస్థాపక సంపాదకులు
కీ.శే. గురజాడ వేంకట అప్పారావు
www.prakasika.org

# ప్రకాశిక

సమగ్ర సాహిత్య, సామాజిక పత్రిక

సంపుటి 3 | సంచిక 4 అక్టోబర్-డిసెంబర్ 2023

మమత-సమత-మానవత
www.gurajada.org

3వ వార్షిక సంచిక

## నిత్య చైతన్య స్ఫూర్తి
# గురజాడ



ISSN 2766-0168
అంతర్జాల త్రైమాస పత్రిక
వ్యవస్థాపక సంపాదకులు
కీ.శే. గురజాడ వేంకట అప్పారావు
www.prakasika.org

# ప్రకాశిక

సమగ్ర సాహిత్య, సామాజిక పత్రిక
సంపుటి 3 | సంచిక 4 అక్టోబర్-డిసెంబర్ 2023

మమత-సమత-మానవత
www.gurajada.org

## సంపాదక వర్గం

**ఆచార్య కొవ్వలి గోపాలకృష్ణ**
ప్రధాన సంపాదకులు

**ఆచార్య దార్ల వేంకటేశ్వర రావు**
వరిష్ఠ సంపాదకులు

**ఆచార్య నల్లపరెడ్డి ఈశ్వర రెడ్డి**
సంపాదకులు

**డా. సుంకర గోపాలయ్య**
సంపాదకులు

**శ్రీ మండలి బుద్ధప్రసాద్**
ప్రధాన సలహాదారు

**శ్రీ మా శర్మ**
గౌరవ సంపాదకులు

## సంపాదక సలహాదారులు

శ్రీ గురజాడ రవీంద్రుడు
డా. రేవూరి అనంత పద్మనాభరావు
డా.వి.ఆర్.రాసాని
డా. నాగసూరి వేణుగోపాల్
శ్రీ విహారి
డా. సి. భవానీదేవి

# సార్వ కాలీన శక్తి గురజాడ




గురజాడ భౌతికంగా నిష్క్రమించి 107 సంవత్సరాలు అయినా, ఈ నాటికీ ఆయన రచనల ప్రభావం, ఆయనకి ఉన్న గుర్తింపు సుస్థిరంగా ఉందని ఇటీవల దేశవ్యాప్తంగా జరిగిన గురజాడ పుట్టిన రోజు పండగల విస్తృతిని గమనిస్తే తెలుస్తుంది. గురజాడ అన్ని తరాలకీ సమకాలీనుడే; ఎందుకంటే, ప్రతీ తరం గురజాడ వారి మధ్యనే ఉన్నాడన్న తీరుగా ఆయన రచనలకి ఉన్న సమకాలీనత. ప్రకాశిక "అక్టోబర్-డిసెంబర్ 2023" సంచికలో "గురజాడ రచనలు సమకాలీనత" అన్న పేరుతో ఒక ప్రత్యేక విభాగంలో కొన్ని వ్యాసాలు ప్రచురిస్తున్నాము. పురిపండా అప్పలస్వామి గారి "నవతరానికి వెలుగుబాట గురజాడ" అనే వ్యాసం 'ఈనాడు' లో వచ్చినది; దాన్ని ప్రకాశిక పాఠకుల కోసం ప్రచురిస్తున్నాము. "ఈనాడు"కి కృతజ్ఞతలు.

గురజాడ 161వ జయంతి సందర్భంగా హైదరాబాదు విశ్వవిద్యాలయంలో జరిగిన సదస్సులో ఎంతోమంది యువ సాహితీవేత్తలు పాల్గొనడం ఆనందదాయకం. సదస్సు నిర్వహించిన ఆచార్య దార్ల వేంకటేశ్వర రావు గారికి వారి సహచరులకీ అభినందనపూర్వక ధన్యవాదాలు.

గురజాడ సాహిత్యాన్ని, సాహిత్యేతర రచనలని వెలికితీసి ప్రపంచానికి అందించిన ఎందరో మహానుభావులు ఉన్నారు. అందరికీ కృతజ్ఞతాపూర్వక అభినందనలు. సంస్థాగతంగా కృషి చేసిన విశాలాంధ్ర పబ్లికేషన్స్ వారికి, గురజాడ రచనలను సమగ్రంగా సేకరించి, దొరికినవాటిని సుమారు 1500 పేజీల పుస్తకంగా తీసుకువచ్చిన మనసు ఫౌండేషన్ వారికి, సేకరణలో పాలు పంచుకుని గురజాడ చేతిరాతని ట్రాన్స్ స్క్రైబ్ చేసి అచ్చువేయడంలో పాలు పంచుకున్న కీ.శే. పెన్నేపల్లి గోపాలకృష్ణ గారికి, డాక్టర్ కాళిదాసు పురుషోత్తం గారికి ధన్యవాదాలు.

గురజాడ మహోన్నత వ్యక్తిత్వాన్ని, ఆయన సాహిత్యాన్ని వివరిస్తూ ఎన్నో రచనలు చేసిన శ్రీ శ్రీ, ఆరుద్ర, అవసరాల సూర్యారావు గారు, కె.వి. రమణారెడ్డి గారు, శెట్టి ఈశ్వరరావు గారు, కొడవటిగంటి కుటుంబరావు గారు తొలి వరుసలో ఉంటారని చెప్పవచ్చు. వీరు కాక గురజాడ సాహిత్యం మీద విస్తృతంగా పరిశోధనలు చేసి, ఎన్నో వ్యాసాలు రాసి, గురజాడని ముందుతరాలకి అందించే ప్రయత్నం చేసిన, చేస్తున్న ప్రముఖులు ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డి గారు ఒక ప్రత్యేక కోవకి చెందినవారు. వారికి ధన్యవాదాలు.

ఒక్కసారి ఆగి ఆలోచిస్తే గురజాడ మీద వచ్చిన వేలాది పేజీల వ్యాసాలు, పుస్తకాలు ఎక్కడ ఉన్నాయి ! నిష్ఠూరంగా అనిపించినా, నిజం చెప్పాలంటే మనకి వారసత్వ సంపదని దాచుకోవడం తెలియదు. ఎంత మంది గొప్ప రచయితల రచనలు గాలిలో కలిసిపోతున్నాయి, కలిసి పోయాయి! గురజాడ మీద వచ్చిన వ్యాసాలు, పుస్తకాలు సేకరించి పునర్ముద్రణ చేసి భావితరాలకి అందించాలని ఉంది. ఈ ఆశయంలో పాలు పంచుకోమని గురజాడ అభిమానులను కోరుతున్నాను.

యేటేటా గురజాడని స్మరించుకోవడంతోపాటు ఆయన మాటలకి మనం కార్యరూపాన్ని ఇస్తే బాగుంటుంది. ముఖ్యంగా యువకులు కలిసి పని చేసే తత్వం అలవరచుకోవాలి. ఇది ఎంత అవసరమో చట్టసభలలో జరిగే చర్చలను, పనితీరును చూస్తే తెలుస్తుంది. అంతేగాకుండా గురజాడ రచనల స్ఫూర్తి ఆధారంగా వర్క్‌షాప్స్ జరగాలి. కలిసి చేద్దాం.

**డాక్టర్ కొవ్వలి గోపాలకృష్ణ**
ప్రధాన సంపాదకులు, ప్రకాశిక



వొట్టి మాటలు కట్టిపెట్టోయ్
గట్టి మేల్ తలపెట్టవోయ్

- గురజాడ

# ముఖచిత్రం

## నిత్య చైతన్య స్ఫూర్తి గురజాడ



# లోపల


| | |
|---|---|
| వేట | 6 |
| కథల వినువీధిలో ధ్రువతార 'రాసాని' వేటకథ | 25 |
| కంచిమేకలు | 32 |
| మతోన్మాదం మీద ఎక్కుపెట్టిన బాణం శిరంశెట్టి "కంచి మేకలు" కథ | 42 |
| తడి భుజాలు | 48 |
| నవతరానికి వెలుగుబాట గురజాడ | 51 |
| కన్య, శుల్కం | 56 |
| గురజాడ 'కన్యాశుల్కం' – ఆరుద్ర దృక్పథం | 60 |
| పాప చేతుల్లో ఉన్నప్పుడు | 78 |
| ఆధునిక తెలుగుపై గిరీశం భాషా ప్రభావం | 80 |
| గురజాడ సాహిత్యం అత్యంత ప్రాసంగికం | 87 |
| మధురవాణి, మిసెస్ వారెన్: ఒక తులనాత్మక అధ్యయనం | 95 |
| సంధ్యామేని | 107 |
| తెలుగు సాహిత్య సౌరభం–పద్య పరిమళం | 108 |
| వైద్యవిభాగంలో 2015 సంవత్సరపు నోబెల్ ని అందుకొన్న మహిళ – తు యోయో | 113 |

## మేటి కథలు-లోతు వ్యాఖ్యలు

# వేట



డా.వి.ఆర్.రాసాని
98484 43610

వీధి వైపున తెల్లటిగోడకు దీగూడు... ముత్తయిదువ నొసటన పెట్టుకున్న చుక్కబొట్టులా కనిపిస్తోంది. ఆ దీగూటికి పైన ఒక పెద్ద బల్లి. దానికి కొంత దూరంలో వాలి వున్న ఈగ దాపుకు మెల్లగా జరిగి, చటుక్కున ఆ ఈగను నోట కరచుకుని చూరు కిందికి పరిగెత్తింది.

ఉదయాన, గుడిసె ముందర కూర్చొని ఆ దృశ్యాన్నే చూస్తున్న వెంకటస్వామి మనసులో ఏదో ఆటవిక న్యాయం తళుక్కుమంది.

ఇంతలో తిరుపతి – మదనపల్లె అన్న బోర్డును ముఖానికంటించుకొని, కంకర తేలిన రోడ్డుమీద దడదడ శబ్దం చేసుకుంటూ స్పీడుగా పీలేరు వైపుకు వెళ్లిపోయింది ఒక ఆర్టీసీ బస్సు. అది పోయినప్పుడు లేచిన దుమ్ముకు క్షణకాలం కళ్ళు మూసుకొని తెరిచాడు వెంకటస్వామి.

కంకరరాళ్ళతో.. బొచ్చు ఊడిపోయిన గజ్జికుక్క చర్మంలా వికారంగా కనిపించింది రోడ్డు.

చాలా సేపట్నుంచి అతను అక్కడే కూర్చునున్నాడు. చూస్తుండగానే తూర్పున పొద్దు బారెడెక్కింది. వచ్చిపోయే వాహనాలతో రోడ్డు సందడిగా మారిపోయింది, ఆ ఊరికి రోడ్డూ అదే, వీధీ అదే.

"వొగబ్బుడు ఆ రోడ్లో గంటకో, రెండు గంట్లకో... ఒకటి లెక్కన బస్సులూ లారీలు పోతా వుండె, వస్తా వుండె. యిప్పుడు దీని కతే మారిపాయ", ఆ రోడ్డును చూస్తూ అనుకున్నాడతను.

ఆ రోడ్డుకానుకొని ఒక వైపున యాభై దాకా గుడిసెలున్నాయి. వాటన్నిటికీ కలిపి 'బాటకాడపల్లె' అని పేరు. గత గవర్నమెంటు ఆ పల్లెలో సగం

మందికి రోడ్డుకవతల ఎడంగా, కాలనీ యిండ్లు కట్టించింది. మిగిలిన సగం మందికి రెండో విడతలో కట్టిస్తామని హామీ యిచ్చింది. ఇంతలో ఆ గవర్నమెంటు ఎన్నికల్లో ఓడిపోయి గద్దె దిగడం, కొత్త ప్రభుత్వం పరిపాలనలోకి రావడం, ఆ విషయాన్ని అధికారులు మరచిపోవడం కూడా ఎప్పుడో జరిగిపోయింది. ఇదేమి న్యాయం అని అడిగితే మాత్రం తప్పకుండా కట్టిస్తాం అంటున్నారేగానీ కట్టించింది లేదు. కట్టిచ్చిన ఆ యిండ్లకయినా సరయిన గాలిగానీ, వెలుతురుగానీ లేవు. నాసిరకం కట్టడాలు. అవి ఎప్పుడు కూలిపోయి నెత్తిన బడతాయోనన్నట్లున్నాయి. అందువల్ల ఒకరిద్దరు తప్ప ఆ యిండ్లలోకి పోలేదు. తమ గుడిసెల్లో ఉన్నంత స్వేచ్ఛ ఆ పక్కా యిండ్లల్లో లేకపోయింది. 'అక్కడ ఒక యిల్లయినా సంపాదించలేక పోయాను గదా.' అని రోజుకొకసారయినా అనుకుంటుంటాడు వెంకటస్వామి.

> చుట్టింట్లో.. చిరిగిన గుడ్డకు మాసికలేసి కుట్టుకుంటూ కూర్చోనుంది వెంకటస్వామి భార్య పెద్దగంగి.

అతనికి యాభైయుండవచ్చు. అక్కడక్కడా నెరిసిన జుట్టుతో, బక్కచిక్కిన శరీరంతో, నల్లగా.. చూస్తూనే కష్టాల్లో పుట్టి, కష్టాలతో కాపురం చేస్తున్నట్లుంటాడు.

అతనికి నలుగురు సంతానం.

అతని పెద్దకొడుకు పన్నెండేండ్ల కిట్టప్ప, ఎనిమిదేండ్ల తమ్ముడితో కలిసి వీధిలో కూర్చొని ఆడుకుంటున్నాడు.

చుట్టింట్లో.. చిరిగిన గుడ్డకు మాసికలేసి కుట్టుకుంటూ కూర్చోనుంది వెంకటస్వామి భార్య పెద్దగంగి. ఆమె వడిలో కూర్చొని రొమ్ము చప్పరిస్తోంది చిన్న బిడ్డ. దానికయిదేండ్లొచ్చినా అమ్మ రొమ్ము చప్పరించడం మాత్రం పోలేదు.

తల్లి చించి యిచ్చిన పాత చీరగుడ్డను పైటగా వేసుకుని పెరట్లో ముఖం కడుక్కుని, పైటతో తుడుచుకుంటూ వచ్చి, వీధి పక్కనున్న గూట్లో నుంచి చాదుచిప్ప తీసుకుని, అందులో రెండు నీళ్ళ చుక్కల్ని వేసి వేల్తో సాది, అద్దం

ముక్కలో ముఖం చూసుకుంటూ నొసటన బొట్టు పెట్టుకొని మళ్ళీ యింట్లోకి వెళ్లిపోయింది పదమూడేళ్ళ శాంతమ్మ. శాంతమ్మ ఆ యింటికి మొదటి సంతానం.

శాంతమ్మ బాకరాపేటలో ఒక టీచర్ యింట్లో పాచిపనులు చేస్తూ వుండేది. అన్ని పనులు చేస్తే... నెలకు వంద రూపాయలిచ్చేవాళ్ళు. రాత్రిల్లో మిగిలిపోయిన అన్నం యిచ్చేవాళ్ళు. వాళ్ళిచ్చే ఆ అన్నంలోనే అన్ని నీళ్ళుపోసి ఉప్పేసి కలిపి తలా గ్లాసుడిచ్చింది పెద్ద గంగి. అయితే శాంతమ్మ ఆ పని మానేసి రెండు నెలలు కావస్తోంది. దానికి కారణం... ఒకరోజు ఆ టీచరింటికి చుట్టపుచూపుగా ఒక బంధువులామె దిగింది. దిగీ దిగానే శాంతమ్మను, ఆ బిడ్డ చేస్తున్న పనిని ఎంతో మెచ్చుకుంది. బిడ్డ బుద్ధిమంతురాలు అని పొగిడింది. ఎంతో కలుపుగోలుగా అదీ యిదీ మాట్లాడుతూ శాంతమ్మను, 'మీరేమిటోళ్ళు', అని అడిగింది.

> 'మేం యానాదోళ్ళం' . తటపటాయిస్తూనే చెప్పింది శాంతమ్మ. ఆ మాట వినగానే ఆ యమ్మ "యానాదోళ్ళు కక్కసులెత్తే వోళ్ళు. వాళ్లను యింట్లోకి రానియ్యం.

'మేం యానాదోళ్ళం' . తటపటాయిస్తూనే చెప్పింది శాంతమ్మ. ఆ మాట వినగానే ఆ యమ్మ "యానాదోళ్ళు కక్కసులెత్తే వోళ్ళు. వాళ్లను యింట్లోకి రానియ్యం. అట్లాంటిది యానాది పిల్ల చేత పని చేయించుకొని, అది ముట్టుకున్న బోకుల్లో యెట్లా అన్నం వండతా వుండారు? కంచాల్లో యెట్లా తింటా వుండారు? తుః.. తుః.. వాక్" అనిందంట. అంతే, దెబ్బతో శాంతమ్మను యింటికి పంపించేశారు.

ఆ విషయాన్నే ఆలోచిస్తూ వీధిలోకి అలాగే చూస్తుండిపోయాడు వెంకటస్వామి. వీధిలో దూరంగా కొందరు పిలకాయలు కోలకట్టెల్ని వంచి, తాళ్ళు కట్టి 'విల్లంబులు' తయారు చేసి, మూరెడు పొడవున్న సన్నని జొన్న కర్రల్ని అంబులుగా చేసి ఆకాశంలోకి వదుల్తూ ఆనందిస్తున్నారు. వాళ్ళల్లో చాలా మందికి బాగా మురికిపట్టిపోయి నల్లబడిన కాకి నిక్కర్లు తప్ప చొక్కాలసలే లేవు.

"యేమయ్యా, నీకు సెవుల్లో సెట్లేమన్నా మొల్సినాయా? అబ్బుట్నుంచీ పిలస్తావుంటే వినబడలే" గుడిసెలో నుంచే కేకేసింది పెద్ద గంగి.

చిన్న గొట్టిగల్లు నుంచి వస్తున్న ఒక స్కూటర్ స్పీడుగా, ఆ పిల్లల్ని తప్పించుకుంటూ బాకరాపేట వైపుకు వెళ్ళిపోయింది. దూరంగా వున్న కాలనీ యిండ్లల్లో నుంచి ఒక వ్యక్తి ఆ రాళ్ళ దారెంట సైకిల్ తొక్కుకుంటూ రోడ్లోకి దిగబడ్డాడు. ఆ యిండ్ల సందులో నుంచీ పై గుడ్డతో మూతి తుడుచుకుంటూ, ఆ సైకిల్ కి దారిచ్చి నడుచుకుంటూ వచ్చాడు బీరిగాడు.

"ఏమ్మామా, తీరుబాటుగా కూసోనుండావు?" వెంకటస్వామికి సమీపంగా వస్తూనే అడిగాడు బీరిగాడు.

"చేసేదానికేం పనులుండాయిరా." నిర్లిప్తంగా సమాధానం చెప్పి, "నువ్వేడికి యెలబారినావు?" అంటూ ప్రశ్నించాడు వెంకటస్వామి.

"ఇంట్లో బొత్తిగా దాన్నెమైపోయిండాది మామా. అట్ల పేటకన్నా పోతే కూలిపనన్న దొరుకుతుందేమో నని పోతాండా" అంటూ రోడ్డు పైనబడి నడుచుకుంటూ వెళ్ళిపోయాడు బీరిగాడు.

"యేమయ్యా, నీకు సెవుల్లో సెట్లేమన్నా మొల్సినాయా? అబ్బుట్నుంచీ పిలస్తావుంటే వినబడలే" గుడిసెలో నుంచే కేకేసింది పెద్ద గంగి.

"ఆc..ఆc.. యింటా వుండా సెప్పు" అన్నాడు వెంకటస్వామి.

"సెట్టంత మొగోడివి. ఊరికే కూసోకపోతే అట్లబొయ్యి ఏదో వొగపని చేసుకొని రాగూడదా. రేత్తిరి నించీ పిల్లోళ్ళకు సద్దినీళ్ళు గుడా లేవు. యెట్లయ్యా ఈ సంసారం యేగేది?" నిష్ఠూరంగా ముక్కు చీదుకుంటూ అంది.

"నువ్వేమీ దిగులుపడొద్దుండే. మొన్న చిన్నకుంట కట్ట మింద వొగ నాలుగు కోమల పుట్ట జూసినా. ఆ పుట్టనిండా పుట్టకూడే. ఆ పుట్టమీద గెడ్డి గేద చెక్కేసి శుభ్రంచేసి, అన్ని నీళ్ళు దిమ్మరించి వచ్చినా, తాను చేసి వచ్చిన పనిని గురించి

చెప్పాడు.

"ఆ యిసుళ్లన్నా పట్టుకోనిరా పో. వాటిని యేంచి, ఉప్పు కారం బెట్టి అమ్ముకొస్తే అంత దుడ్డొస్తాది."

"ముందు కాలంలో అంటే వాటికి మసాలాబెట్టి అటుకుల్లోనో, శనగపప్పుల్లోనో, కలిపిస్తే లొట్టలేసుకుంటా తింటావుండ్రి. యిప్పుడు పల్లెల్లో గూడా నాగరీకం ముదిరి పోయిండాది. యిసుళ్ళంటే ముఖం చిట్లించుకుంటా వుండారు."

"సరే, ముందు పోయి పట్టకరాపో. పిల్లోళ్లయినా తింటారు."

"అప్పుడే యెట్ల పట్టకొచ్చేది. యింకా రెండు దినాలుగ్గానీ లెయ్యవు."

"సరే, ఊరికే కూసోక అంతలోపల ఏదో వొక పనిజెయ్యి," గట్టిగా అరిచినట్లు మాట్లాడింది పెద్దగంగి.

"సరేలేయే, అరసొద్దు గానీ.." అంటూ లేచి గుడిసెలోకి వెళ్ళాడు. ఇంతలో కిట్టప్ప వీధిలో నుంచి యింట్లోకి అడుగుపెట్టి, తినడానికేమైనా వుందేమోనని బోకుల్ని వెదక సాగాడు.

వెంకటస్వామి చెక్కస్టాండులో ఉన్న ఒక రేకుడబ్బా మూత తీసి అందులో నుంచి ఒక పామేరు ముక్కనొకదాన్ని తీసుకుని బొడ్లో దోపుకున్నాడు.

"వొరే కిట్టప్పా. యింటెనక పాత బక్కిటుంటుంది గదా. దాన్నెత్తుకోని రారా. యిసుళ్ళ పుట్టకు నీళ్ళు పోసొద్దాం," గోడకు వ్రేలాడుతున్న చెక్కస్టాండు వైపు చూస్తూ అన్నాడు వెంకటస్వామి.

ఇసుళ్ళ మాట వినగానే సంతోషంగా బకెట్ కోసం పెరటివైపుకు పరిగెత్తాడు కిట్టప్ప.

వెంకటస్వామి చెక్కస్టాండులో ఉన్న ఒక రేకుడబ్బా మూత తీసి అందులో నుంచి ఒక పామేరు ముక్కనొకదాన్ని తీసుకుని బొడ్లో దోపుకున్నాడు. తలుపు సందున నిలబెట్టి వున్న కోల కట్టె, గోడపైనున్న సలాకీని, సలంకపారను చేతుల్లోకి తీసుకున్నాడు. "కటవకల్లా బొయ్యి రెండు ఉడతలన్నా యీసకొస్తాంగానీ..

కారం నూరుకుని రెడీగా వుండు," అంటూ రోడ్లోకొచ్చాడు.

పెరట్లో నుంచీ బకెట్ ను చేతబట్టుకొని వచ్చిన కిట్టప్ప తండ్రి ననుసరించాడు. పడమటి నుంచి వీస్తున్న సన్నగాలి రవరవా తోలుతోంది. తొలేటి వానలు పడి వుండడంతో రైతులు చేన్లన్నీ దుక్కిదున్ని పెట్టుకోనున్నారు. భూములు ఇరసాలు కూడా అయిపోయి వున్నాయి. ఏమాత్రం చినుకులు పడినా విత్తనాలేసేయడమే మిగిలింది. ఆరుద్ర దాటిపోతున్నా చినుకు పడడం లేదు. రైతులు ఆకాశం వైపు ఎగచూసుకోనున్నారు.

> ఆ చేల దుమ్ములో వెంకటస్వామి, కిట్టప్ప కటవవైపు నడుస్తుంటే వాళ్ళ పాదాల కింద పడిన తువ్వనేల్లోని దుమ్ము పిసపిసా పితికిపోయి పక్కలకొస్తోంది.

ఆ చేల దుమ్ములో వెంకటస్వామి, కిట్టప్ప కటవవైపు నడుస్తుంటే వాళ్ళ పాదాల కింద పడిన తువ్వనేల్లోని దుమ్ము పిసపిసా పితికిపోయి పక్కలకొస్తోంది. అన్ని ఆయుధాలతో యుద్ధానికి బయలుదేరిన వీర సైనికుల్లా వాళ్ళు కటవలోకి అడుగుపెట్టారు. ఆ కటవలో వుండే కానగ చెట్లల్లో నుంచి మధ్యవయసులో ఉన్న ఒక పిచ్చకుంట్లోళ్ళ ఆడది, చట్టిలో అన్ని మెతుకులేసుకొని కావ్ కావ్ మంటూ అక్కడక్కడా విదిలిస్తూ కాకుల్ని పిలుస్తూ వెళుతోంది. ఆమె మెతుకులు వేసిన చోట్లల్లోకి ఒక్కొక్క కాకే చేరి గుంపు కడుతున్నాయి. మెట్ట చేన్లో వలవడ్డి, అది కనిపించకుండా దుమ్ములో పూడ్చేసి, దానికి కొంత దూరంలో చింతచెట్టు కింద, బిసతాడు చేతపట్టుకొని కూర్చోనున్నాడు పిచ్చిగుంట్లోడు.

'పిచ్చగుంట్లాడది యాస్తా వుండే మెతుకులకాశపడి, కాకులన్నీ ఎగురుకుంటా పోయి వల మధ్యలో చేరిపోతాయి. పిచ్చిగుంట్లోడు సమయం చూసి చేత నుండే దారంతో బిస లాగేస్తాడు. పాపం, కాకులన్నీ వలలో చిక్కుకుపోతాయి. ఇంక ఈ రోజుకి వాళ్ళకు పండగే. వాళ్ళ పనే మేలు. వాళ్ళకు కాకుల్ని పట్టే విద్దెన్నా తెలుసు.' అనుకుంటూ కటవలో వున్న కానగ చెట్లవైపు దృష్టి సారించాడు వెంకటస్వామి.

అతని కళ్ళు చెట్టుచెట్టుని, కొమ్మకొమ్మను నిశితంగా పరిశీలిస్తున్నాయి. ఒక్కచోట అతని చూపు ఆగిపోయింది.

అక్కడ... ఒక చిన్న కోతిపిల్ల మాదిరి ఒక చెట్లో నుంచీ మరో చెట్లోకి దూకుతోంది ఉడత.

చేతిలో ఉన్న కొరముట్లను కొడుకు చేతికిచ్చి, "నువ్వు యీడనే నిలబడి దానికల్లా చూస్తావుండు. అది నీ కల్లానే చూస్తా వుంటుంది. నేను ఎనక్కిపోతా," అంటూ స్వరం తగ్గించి చెప్పి, కోలకట్టెను తీసుకుని, శబ్దం చేయకుండా మెల్లగా ఆ చెట్ల వెనక్కి వెళ్ళాడు. గాలికి కదులుతున్న ఆకుల చప్పుడూ, దూరంగా కాకుల్ని ఆకర్షిస్తూ కా.. కా.. అంటున్న పిచ్చుగుంట్లదాని అరుపులు తప్ప మరే అలికిడీ లేదు.

ఉడత తోకను పైకెత్తి గొంతును టకటకలాడిస్తూ కిట్టప్పవైపే చూస్తోంది. వెనక్కి వెళ్ళిన వెంకటస్వామి చెట్టును సమీపించి వడుపుగా కోలకట్టెతో ఒక దెబ్బ వేశాడు.

ఉడత తోకను పైకెత్తి గొంతును టకటకలాడిస్తూ కిట్టప్పవైపే చూస్తోంది. వెనక్కి వెళ్ళిన వెంకటస్వామి చెట్టును సమీపించి వడుపుగా కోలకట్టెతో ఒక దెబ్బ వేశాడు. అంతే, అది కీచుమని అరుస్తూ నేలపైన పడి గింజుకోసాగింది. కిట్టప్ప గబగబా వెళ్ళి దాన్ని పట్టుకొని, చేతిసంచిలో వేసుకున్నాడు. అలా కటవలో నాలుగు ఉడుతల్ని కొట్టింతర్వాత బండ కొండ దిగువనున్న చిన్న కుంటలోకి దిగారిద్దరు. కుంటలో సగం వరకూ నీళ్ళున్నాయి. దాని చుట్టూ అక్కడక్కడా తుప్ప చెట్లున్నాయి. దానికొకవైపున కట్ట...

కిట్టప్ప దగ్గరున్న బకెట్ ను చేతిలోకి తీసుకొని కుంటలోకి దిగి, దాని నిండా నీళ్ళు ముంచుకొని కుంటకట్టవైపు నడిచాడు వెంకటస్వామి.

ఇద్దరూ సగం కట్టపైనున్న పుట్ట దగ్గరికి చేరుకున్నారు.

ఆ పుట్ట అయిదారు కోమలతో నడుములెత్తువరకు పెరిగి.. ఎక్కడో నిర్జరారణ్యంలో ఏ రాజో ఏకాంతంగా కట్టించుకున్న రహస్యస్థావరపు కోటకు చిన్న నమూనాలా కనిపిస్తోంది.

నీళ్ళ బకెట్ ను ప్రక్కనపెట్టి, ఒక కోమలో నుంచీ పుట్టలోకి తొంగి చూశాడు

> వాళ్ళని చూసి.. కట్టపైన ఉన్న ఒక కానగచెట్టు లోనుంచి ఒక కాకి కావ్ కావ్ అంటూ అదేపనిగా అరవసాగింది.

వెంటకస్వామి. కాగులో మగ్గిన దంపుడు బియ్యంలా పుట్టనిండా పుట్టకూడు కనిపించింది. 'ఇదంతా యిడిగితే ఎన్ని ఇసుళ్ళో,' అనుకున్నాడు.

"నాయనా.. యివి యిట్ల నీళ్ళు పోస్తా వుంటే ఎన్ని దినాలకు పుడతాయి." అడిగాడు కిట్టప్ప.

"మూడు నాలుగు దినాలు పుట్టపైన నీళ్ళు పొయ్యాల. అట్ల పోస్తే పుట్టమన్ను నీళ్ళను పీల్చుకుంటుంది. నీళ్ళు చుక్కలుచుక్కలుగా పుట్టకూటి పైన బడతాయి. అప్పుడు పుట్టకూట్లో నుంచి పురుగులు యిడిగి, వాటికి రెక్కలొస్తాయి.

అవే యిసుళ్ళు," వివరించాడు. వెంకటస్వామి.

వాళ్ళని చూసి.. కట్టపైన ఉన్న ఒక కానగచెట్టులోనుంచి ఒక కాకి కావ్ కావ్ అంటూ అదేపనిగా అరవసాగింది. కట్టకవతల బీటిలో ఓ గొర్రెల కాపరి గొర్రెల్ని మేపుకుంటూ కుంటవైపుకు దిగబడుతున్నాడు. వెంకటస్వామి సలాకీని తీసుకుని పుట్టపక్కన మట్టిని తవ్వసాగాడు.

అది చూసి, "ఎందుకు ఆడ గుంత తొగతా వుండావు" విచిత్రంగా చూస్తూ అడిగాడు కిట్టప్ప.

"పుట్టలోకి ఇంకా బాగా నీళ్ళు దిగి బిరీనా యిసుళ్ళు పుట్టేదానికి," తవ్వుతూనే సమాధానం చెప్పాడు వెంకటస్వామి.

గజం పొడవు వెడల్పుతో గుంత తవ్వి మట్టి పక్కలకు ఎగదీశాడు. ఆ తర్వాత బకెట్లో ఉన్న నీళ్లను ఆ గుంతలో పోశాడు. కిట్టప్ప చేత కుంటలో నుంచి బకెట్ తో అయిదారుసార్లు నీళ్ళు తెప్పించి పోయించాడు. చివరన మరో బకెట్ నీళ్లను పుట్టపైన చల్లాడు.

"ఇసుళ్ళు యిడిగినాంకా అవి బయటికొస్తాయి గదా. వాటిని ఎట్ల

పట్టుకునేది?” ఉడతల సంచిని ఎత్తుకుంటూ అడిగాడు కిట్టప్ప.

“ఇసుళ్ళు పట్టేది రేతిర్లో వొగ తీరుగాను, పొగులు వొగ తీరుగానూ వుంటుంది” అన్నాడు కొరముట్లు చేత బట్టుకుంటూ వెంకటస్వామి.

“అదే యెట్లా?”

“పద చెప్తా” అంటూ అక్కడి నుంచీ బయలుదేరుతూ చెప్పసాగాడు వెంకటస్వామి.

“పుట్టపైన సీతాఫలం కొమ్మల్తో గూడు చేసి, ఆ గూట్లో దీపం పెడతాం. ఆ దీపం కింద ఒక దబిరో, తగారో యేదో వగటి పెట్టి దీపం ముట్టిస్తాం. అంతే, ఆ ఎల్తురుకు పుట్టలో ఇసుళ్ళు బయటికొచ్చి దీపం చుట్టూ, తిరిగి, రెక్కలు విరిగి అన్నీ ఆ దబిర్లో పడిపోతాయి. ఇది రేత్తిర్లో పట్టే మార్గం.”

> ఊరివైపు నడుస్తూ చెప్తుంటే కిట్టప్ప అతని వెనక నడుస్తున్నాడు. అప్పుడే ఆకాశంలో లేచిన అరచేయంత కర్రిమేఘం వాళ్ళను చూసి వెర్రిగా నవ్వుకోసాగింది.

ఊరివైపు నడుస్తూ చెప్తుంటే కిట్టప్ప అతని వెనక నడుస్తున్నాడు. అప్పుడే ఆకాశంలో లేచిన అరచేయంత కర్రిమేఘం వాళ్ళను చూసి వెర్రిగా నవ్వుకోసాగింది. దారిపక్కనున్న ఓ కంపచెట్టు పైన రెండు ముక్కలై వ్రేలాడుతూ గాలికి కదులుతున్న పాముపొర వైపు చూస్తూ “మరి పొగులు?” అనుమానం వ్యక్తం చేశాడు కిట్టప్ప.

“పొగులయితే దీపంతో అవసరంలే.”

అలా మాట్లాడుకుంటూ వాళ్ళు ఇల్లు చేరేసరికి వీధి రోడ్లో గవర్నమెంటు జీపొకటి.. రాత్రివేళ గొర్రెలమందపైన దాడి చేయడానికి పొదచాటున గుమ్మనంగా దాగి, పొంచి ఉన్న కొర్నంపోతులా చింతచెట్టు కింద ఆగి వుంది. దాని చుట్టూ జనం చేరి ఉన్నారు.

“వొగబ్బుడు ఆడ యాడనో ఉన్న యిండ్లు ఖాళీ చేయించి ఇట్లనే జెప్పియాడికి తరిమితిరి. ఇప్పుడు యింకేడికో తరిమేయాలని చూస్తా వుండారు.

మండలాఫీసు నుంచి వచ్చిన ఉద్యోగస్తులు కొందరు ఏదో చెబుతున్నారు.

“వారే కిట్టా, నువ్వు యింటికి పద,” అంటూ కొరముట్లన్నీ అతని చేతికిచ్చి పంపేసి వాళ్ళను సమీపించాడు వెంకటస్వామి.

“య్యోవ్, మీకిదివరకే చాలాసార్లు చెప్పినాము, నోటీసులిచ్చినాము. పట్టించుకోలే. రేపు మద్దేనేళకు మీ యిండ్లు ఖాళీచేసి యింకేడన్నా కట్టుకోండి. ఇది సర్కారార్డరు. ఇంక చెప్పేదేముండదు.” ఒక ప్యాంటు షర్టు గట్టిగా అరిచి చెబుతోంది.

“కాలనీ యిండ్లున్నోళ్ళు ఆడికి పోతారు. లేనోళ్ళు యాడికి పోవల్ల?” ఒక చొక్కాలేని బక్క శరీరం అడుగుతోంది.

“ఆ పక్కనుండే కటవ పోరంబోకు. ఆడికి బొయ్యి కట్టుకోండి,” మరో టై బిగించిన మెడ చెబుతోంది.

“వొగబ్బుడు ఆడ యాడనో ఉన్న యిండ్లు ఖాళీ చేయించి ఇట్లనే జెప్పియాడికి తరిమితిరి. ఇప్పుడు యింకేడికో తరిమేయాలని చూస్తా వుండారు. మమ్మల్నిట్ట బతక నియ్యరా యేంది?” ఓ ముసలి ఆకారం ఎగిరెగిరి పడుతోంది.

“కూటికే కానా కష్టంగా వుండాది. వున్నట్టుండి పొమ్మంటే ఎట్లా?”

“మాకూ యాడన్నా యిండ్లు కట్టించండి. పోతాం”.

పీక్కుపోయిన మొహాలు ఒకటి తర్వాత ఒకటిగా అడుగుతున్నాయి.

“అయ్యా, యిండ్లు లేనోళ్ళకు త్వరగా యిండ్లు కట్టిస్తాం. బాకరాపేట నుంచి మీ వూరి ముందరి వరకూ పనైపోయి వుంది. మిగిలింది మీ వల్లనే ఆలస్యం. మాకు పై నుంచి ఆర్డర్లొచ్చినాయి. వత్తిడి ఎక్కువగా ఉంది.”

"ఆ కాలనీ యిండ్లల్లోనే ఎట్లనో వొగట్ల కొన్ని దినాలు సర్దుకుంటే, కొత్త గవర్నమెంటు అందరికీ యిండ్లు కట్టిస్తుంది." ప్యాంటూ షర్టులు మార్చిమార్చి చెబుతున్నాయి.

అదంతా విన్న వెంకటస్వామి, 'యింకెట్లరా భగమంతుడా,' అనుకుంటూ తన గుడిసె వైపుకు నడిచాడు.

ఆఫీసర్లతో నిండిన జీపు తిరుపతి వైపుకు బయలుదేరింది. సంవత్సరం నుంచి వీళ్ళు ఇట్లనే చెబుతున్నార్లే అనుకుంటూ జనం ఎవరిండ్లకు వాళ్ళు వెళ్లిపోయారు.

"వారొరే, మూడు దినాల నుంచీ కుంట కట్టన, పుట్టమీద నీళ్ళు పోస్తా వుండానే. ఈ వేళకు పురుగులకు రెక్క లొస్తావుంటాయి.

ఆ మరునాడు మళ్లీ వెళ్లి పుట్టపైన నీళ్ళు చల్లి తవ్విన గుంతలో నీళ్ళు పోసి వచ్చాడు వెంకటస్వామి. ఆ తేమకు పుట్టకూటిలో కదలిక రాసాగింది.

★★★★

మూడో రోజు.. ఉదయమంతా నిమ్మళంగా ఉన్న ఆకాశంలో మేఘాలు ప్రారంభమయ్యాయి. అవి ఒకదానికొకటి దడిగట్టి, ఆ దడి మధ్యాహ్న సమయానికి ఆకాశాన్ని కప్పేసింది.

"వొరొరే, మూడు దినాల నుంచీ కుంట కట్టన, పుట్టమీద నీళ్ళు పోస్తా వుండానే. ఈ వేళకు పురుగులకు రెక్కలొస్తావుంటాయి. రేత్తిరికి బొయ్యి పట్టుకుందామనుకున్నా, ఇప్పుడు గనక వానబడిందా, అంతే. అన్నీ బయటికొచ్చేస్తాయి. వానకంటే ముందే... మనమే బొయ్యి యిసుళ్లు పట్టుకోవాల.."

గుడిసె లోపల నుంచి వెలుపలికొచ్చిన వెంకటస్వామి ఆకాశంవైపు ఒక్కసారి చూసి, వీధిలో ఆడుకుంటున్న కొడుకును పిలిచాడు. తండ్రి కేక విని పరిగెత్తుకుంటూ వచ్చి, 'ఏమి నాయనా' అన్నాడు కిట్టప్ప.

తలుపు సందులో సంచుంది తీసుకో.." పురమాయించాడు వెంకటస్వామి. కిట్టప్ప సంతోషంగా గుండీలు లేని చొక్కాని ముందుకు లాక్కుంటూ వెళ్ళి

తలుపు సందున.. యూరియా గోతంతో కుట్టిన చేతి సంచిని తీసుకున్నాడు.

వెంకటస్వామి మళ్ళీ లోపలికి వెళ్ళి డబ్బాలో ఉన్న పామేరునొకదాన్ని తీసుకుని బోడ్లో దోపుకున్నాడు. గోడపైనున్న సలాకీని, సలంక పారను తీసి చేతబట్టుకుని పెరట్లోకి నడిచాడు. అక్కడున్న బకెట్ ను తీసుకొచ్చి కొడుకు చేతికిచ్చి"యింక రారా", అంటూ కుంట వైపుకు బయలుదేరాడు.

కుంట మొగదలకు పోగానే, అక్కడే ఒక చోట ఉన్న సీతాఫలం చెట్టు కొమ్మల్ని సందెడు నరికి వాదె చేసుకుని, అన్నీ పుట్ట దగ్గరికి చేర్చాడు.

సీతాఫలం ఆకుల వాసన మెల్లగా గాలిలో వ్యాపిస్తోంది. నీళ్ళతో మెత్తగా తడిసిన పుట్టమన్నులో నుంచి నీళ్ళు పుట్టలోకి జారసాగాయి.

“వొరే కిట్టా, నువ్వు కుంటలోకి పోయి బకెట్టుతో నీళ్ళు తీసుకరాపో” బకెట్టును అతని చేతికిచ్చి పంపి, వంగి ఒక పుట్టకోమలో నుంచి పుట్టలోకి తొంగి చూశాడు.

పుట్టలో కుప్పతెప్పలుగా కదులుతున్న ఇసుళ్ళు.

‘అన్నీ యిడిగిపోయింటాయి. పుట్టకోమలన్నీ మూసేస్తే. ఊపిరాడక పైకొచ్చేస్తాయి.’ అనుకుని, పైకి లేచి, పక్కనున్న గుంతవైపు చూశాడు. గుంతలో నిన్న పోసిన నీళ్ళు ఇంకిపోయి ఉన్నాయి. సలంకపార తీసుకుని వెళ్ళి ఆ గుంతలో నుంచి పారమన్ను తీసుకుని, ఆ మట్టితో పుట్టకోమల్ని మూసేశాడు. ఆ వేరకు కిట్టప్ప బకెట్తో నీళ్ళు తెచ్చి పెట్టగానే, ఆ నీళ్లను పుట్టపైన చల్లాడు. ఆ తర్వాత సీతాఫలం ఆకులు పుట్టపైన పరచి, పారతో ఆకులపైన మట్టి చల్లి, పుట్టను పూర్తిగా కప్పేశాడు.

సీతాఫలం ఆకుల వాసన మెల్లగా గాలిలో వ్యాపిస్తోంది. నీళ్ళతో మెత్తగా తడిసిన పుట్టమన్నులో నుంచి నీళ్ళు పుట్టలోకి జారసాగాయి. సీతాఫలం ఆకుల ఘాటుకి, పుట్టలోకి జారుతున్న నీటికి ఇసుళ్ళు ఉక్కిరిబిక్కిర కాసాగాయి.

వెంకటస్వామి బొడ్డులో దోపుకోనున్న ఒక బీడీని, అగ్గిపెట్టెను తీసి, బీడీని నోట్లో పెట్టుకున్నాడు. అగ్గిపుల్ల గీసి బీడీని వెలిగించుకుని అగ్గిపెట్టెను కొడుకు చేతికిచ్చి, బీడీ పొగను గుండెల వరకూ పీల్చి వదుల్తూ... ఆకాశంవైపు చూశాడు.

పడమటి దిక్కున... ఆకాశంలో వానమబ్బు నల్లగా కనిపిస్తోంది. ఆ నల్లదనం ఆకాశం నుంచి చారలు చారలుగా నేలపైకి జారుతున్నట్లు కనిపించసాగింది. అది గమనించిన వెంకటస్వామి గబగబా రెండు దమ్ములు పీకి, బీడీ ఆర్పి, ఆ ముక్కను చెవిలో యిరికించుకుని, 'వాన దిగబడింది. బిరీనా పట్టేయాల.' అనుకుంటూ

తన రెండు చేతులతో పుట్టను తాకాడు.

అతనికి ఆ వేళ అది వెలలేని నిధిని దాచుకున్న స్వర్ణపేటికలా అనిపించింది. బొడ్లో దోపుకోనున్న పామేరు ముక్కను తీసి నోట్లో వేసుకుని నములుతూ. దాని రసాన్ని మింగుతూ...

అతనికి ఆ వేళ అది వెలలేని నిధిని దాచుకున్న స్వర్ణపేటికలా అనిపించింది. బొడ్లో దోపుకోనున్న పామేరు ముక్కను తీసి నోట్లో వేసుకుని నములుతూ. దాని రసాన్ని మింగుతూ, సలాకీని తీసుకుని పుట్ట అడుగుభాగాన చేయి పట్టేంత రంధ్రం చేశాడు. తవ్వగా వచ్చిన మట్టిని పక్కకు లాగి, చేతిని పుట్టలోకి దోపాడు.

పుట్టలో పురుగుల సంచలనం.. బుసబుస అన్న శబ్దం...

"పుట్టలో నుంచి బుస వినిపిస్తా వుండాది నాయనా. పురుగుల్ని మింగేదానికి పాము చేరుకున్నట్టుండాది. భద్రం," హెచ్చరించాడు కిట్టప్ప.

"పామేం చేస్తుందిరా. పాముల కెరుసుకుంటే యానాదోడు సచ్చినట్టే. అయినా పామేరు నోట్లో వుండాది గదా. పాము కరిసినా యిసమెక్కదులే" అంటూ చేతిని అటూ ఇటూ కదిలించాడు.

"చేయికి తగిలి ఇసుళ్ళు యాడంటే ఆడ బోతాయిగానీ, సంచి రెడీగా

పట్టుకోరా. చేత్తో తీసితీసి యాస్తా." అన్నాడు వెంకటస్వామి.

కిట్టప్ప తన రెండు చేతులతో సంచి అంచుకున్న నాడాలు పట్టుకుని పుట్ట దగ్గరికి వెళ్ళి నిలబడ్డాడు.

వెంకటస్వామి పిడికెటితో ఇసుళ్ళను పట్టుకున్నాడు. ఇసుళ్ళతోబాటు ఏదో మెత్తగా తగిలింది.

అతనికి అనుమానమే. చేతిని అలాగే పైకి లాగాడు. అంతే, బుసలు కొడుతూ చేతిలావు పాము పైకొచ్చి అతని చేతి బొటనవేలిపైన కొరికింది. "వోయమ్మో" అంటూ కిట్టప్ప దూరంగా పరిగెత్తాడు.

"దీనెమ్మా' అంటూ పామును దూరంగా విసిరేశాడు వెంకటస్వామి. అది ప్రాణ భయంతో చెట్లల్లో దూరి, కట్ట కిందికి దిగి పరిగెత్తింది.

"దీనెమ్మా' అంటూ పామును దూరంగా విసిరేశాడు వెంకటస్వామి. అది ప్రాణ భయంతో చెట్లల్లో దూరి, కట్ట కిందికి దిగి పరిగెత్తింది.

"జెర్రిపోతుముండ" పామును అశ్లీలంగా తిట్టుకుంటూ, అది కొరికిన వేలిపైన రుద్ది, వేలిని ఒక్కసారి చూసుకున్నాడు. వేలిపైన రెండు బలమైన గాట్లు... ఆ గాట్ల నుంచీ రక్తం కమ్మింది.

"నాయనా.. ఏంగాదు గదా" దగ్గరికి వచ్చి చూస్తూ ఆందోళనగా అన్నాడు కిట్టప్ప.

"అది మామూలు జెర్రిపోతు. ఏంగాదులే. అదే పెంజిరయింటే ఈ వేరకు కైలాసమే..." గాట్లపైన వేళ్ళతో నొక్కి, రక్తం చుక్కల్ని తుడిచేస్తూ అన్నాడు వెంకటస్వామి.

"నాగుబాము మాదిరుండాదే". సందేహం వెలిబుచ్చాడు కిట్టప్ప.

"పైకి రెండూ వొగటిగానే వుంటాయి. కానీ నాగుబాము యిట్టా పరిస్థితిలో మనిషిని చూస్తానే పడగెత్తతాది. దాని గొంతు కింద తెలుపు నలుపు మచ్చలుంటాయి. పడగెత్తితే అవి ఎంకటేస్సుని నామాలు మాదిరి కనిపిస్తాయి.

ఇది పడగెత్తలేంది. పైగా దీని తల కొంచెం ఎరుపుగాను, పెద్దదిగానూ వుంటుంది. సరే, సంచి పట్టకురా," వివరంగా చెప్పాడు.

కిట్టప్ప సంచి పట్టుకొని యింకా దగ్గరికి వెళ్ళాడు.

పాము కొరికిన వేలు మంటతో నొప్పి పెట్టసాగింది. నోట్లోని పామేరు రసాన్ని కడుపులోకి మింగాడు. అప్పటికే ఊపిరాడక ఉక్కిరిబిక్కిరైపోయిన ఇసుళ్ళు బయటికొస్తున్నాయి.

ఎదురుగా... మకరందాన్నంతా పీల్చేసిన పొగరుబోతు తుమ్మెద ధాటికి నలిగి పోయిన పువ్వులా..

వెంకటస్వామి పుట్టలోకి చేయి పెట్టి పిడికిలితో పట్టిపట్టి ఇసుళ్ళను సంచిలో వేస్తున్నాడు.

"యేం నాయనా, పాముని వూరికే యిడిసిపెట్టేస్తివే. పట్టుకొని శరమ్ము దీసింటే.. అమ్ముకోనుండచ్చుగదా", అన్నాడు కిట్టప్ప.

"అడవుల్లో జంతువుల్ని, పాముల్ని పట్టినా, శరమ్ము దీసి అమ్మినా సర్కారోళ్ళు జైల్లో పెడతారంట్రా. అందునా యిప్పుడు పాము శరమ్మాలు దీసుకునే వోడే లేకపాయ. ఎందుకొచ్చిన గొడవనీ వదిలేస్తి..." చెప్పాడు వెంకటస్వామి.

అలా మాట్లాడుకుంటూ ఇసుళ్ళను తోడితోడి సంచిలో పోశాడతను. చివరన సలాకీతో పుట్టను తవ్వితవ్వి మిగిలిన ఇసుళ్ళను వెదికి వెదికి సంచిలో వేసేసుకుని ఏదో సాధించినట్లు విజయగర్వంతో పైకి లేచాడు.

ఎదురుగా... మకరందాన్నంతా పీల్చేసిన పొగరుబోతు తుమ్మెద ధాటికి నలిగి పోయిన పువ్వులా.. శత్రువుల దాడిలో పూర్తిగా నాశనమైపోయిన కోటలా... శిథిలమైన పుట్ట...

దూరంగా... నల్లటి మేఘాన్ని కప్పుకొని గుంభనంగా పడుకున్న పెద్ద రాకాసిలా బండకొండ...

పాము కరిచిన వేలు నిప్పు మండినట్టు మండుతూనే వుంది. అయినా

అప్పుడే సరిగ్గా పడమటి దిక్కున మేఘాల్లో తళుక్కున ఒక్క మెరుపు మెరిసింది. ఎక్కడో దూరంగా ఉరిమిన శబ్దం స్పష్టాస్పష్టంగా వినిపించింది.

అతను లెక్కచేయడం లేదు. నోట్లో ఉన్న పామేరు కూడా నమిలినమిలి ఎప్పుడో కరిగిపోయింది.

అంతవరకూ పడిన శ్రమ నుంచి ఉపశమనం పొందుతూ ఒక్కసారి గుండెలనిండా గాలి పీల్చుకొని వదిలి, కొరముట్లను కిట్టప్ప చేతికిచ్చాడు. ఇసుళ్ళ సంచి మూతి బిగించి కట్టి భుజాన వేసుకుని, 'రారా' అంటూ కొడుకుని వెంటబెట్టుకొని ఊరివైపుకు బయలుదేరాడు.

అప్పుడే సరిగ్గా పడమటి దిక్కున మేఘాల్లో తళుక్కున ఒక్క మెరుపు మెరిసింది. ఎక్కడో దూరంగా ఉరిమిన శబ్దం స్పష్టాస్పష్టంగా వినిపించింది. మెల్లగా చినుకులు ప్రారంభమయ్యాయి.

★★★

వెంకటస్వామి ఊరు చేరేటప్పటికి అక్కడ వాతావరణం చాలా బీభత్సంగా వుంది.

"అయ్యో, మేమెట్లా బతికేదిరా దేముడా!" గుండెలు బాదుకుని ఏడుస్తున్నారు కొందరు.

"బతికేదానికి దోవ సూపెట్టరు గానీ, వుండే తావును కూల్చేస్తారా?" మొలవస్త్రంతో నిలబడ్డ ముసలతనొకడంటున్నాడు.

"కాపాడాల్సిన వోళ్ళే కాల్చుక తింటే, యింక సెప్పుకునే దానికేముండాది?" ఓ చింపిరిజుట్టు ఆక్రోశిస్తోంది.

అక్కడ జనం గుంపు.

అందులో కొందరు పిల్లలు భయంభయంగా చూస్తూ నిలబడి ఉన్నారు. వృద్ధులు రోధిస్తున్నారు. ఆడవాళ్ళు జుట్లు పీక్కుని, రొమ్ములు బాదుకుంటూ

శాపనార్థాలు పెడుతున్నారు.

కొందరు తమ బోకీ, బోలె రోడ్డుపైనే పెట్టుకున్నారు. ఇంకొందరు అక్కడే ఉన్న చింతచెట్టు కిందికి చేరుకుని తమ వస్తువుల్ని భద్రపరచుకుంటున్నారు. మరికొందరు తమ పెట్టేబేడా కాలనీ యిండ్లల్లోకి మోసుకు వెళుతున్నారు.

> "రోడ్లు పెద్దవి జేస్తే ఎవురికి లాభం. అసలు చాలామందికి కాలనీలో యిండ్లులేవే. ఇప్పుడు వాళ్లంతా ఎక్కడికి పోతారు.

ఒక ప్రొక్లెయినర్, రెండు జేసీబీలు గుడిసెల్ని తోసి తోసి నేలమట్టం చేస్తున్నాయి. ఒక పోలీసు జీపు, మరో రెండు కార్లు రోడ్డుకు వారగా పార్క్ చేయబడి ఉన్నాయి. వాటి ముఖాల మీద 'ప్రభుత్వ వాహనం' అన్న అక్షరాలు దయ్యపు కండ్లల్లా కనిపిస్తున్నాయి. కొందరు పోలీసులు జనాలను కంట్రోల్ చేస్తుంటే, మరికొందరు అధికారులు దగ్గరుండి గుడిసెల్ని తోయించేస్తున్నారు.

గుడిసెవాసుల ఏడుపులు, అధికారుల అదలింపులతో అక్కడొక యుద్ధ వాతావరణం అలుముకొని ఉంది.

"ఈ రోడ్డును హైరోడ్డు చేసినారు. డబుల్ రోడ్డు బాకరాపేట దాకా వచ్చేసింది. ఈ ఇండ్లే అడ్డు. సంవత్సరంగా చెబుతూనే ఉన్నారు. నోటీసులు యిస్తూనే ఉన్నారు. వీళ్ళు వింటే కదా" ఓ వ్యక్తి ఎవరికో చెబుతున్నాడు.

"రోడ్డు వెడల్పు చేస్తే ప్రజలకే గదా మేలు," ఖరీదయిన ప్యాంటూ షర్టుతో తన దేహాన్ని సింగారించుకున్న మరో వ్యక్తి అంటున్నాడు.

"రోడ్లు పెద్దవి జేస్తే ఎవురికి లాభం. అసలు చాలామందికి కాలనీలో యిండ్లులేవే. ఇప్పుడు వాళ్లంతా ఎక్కడికి పోతారు. యాడ తలదాచుకుంటారు?" ఆ దృశ్యం చూస్తూ ఆలోచనల్లో పడిపోయాడు వెంకటస్వామి. వేలు కత్తితో కోసినట్టు జివ్వున లాగుతోంది. మాటిమాటికీ వేలిని రుద్దుకుంటూనే ఉన్నాడు. వేలు కాస్తా వాచి కూడా ఉంది.

ఒక లారీ రొద చేసుకుంటూ అక్కడి సంఘటనతో తనకేమీ సంబంధం

ఆ ప్రదేశమంతా కూలిన గోడలతో, చిందరవందరైన బోదకప్పులతో బీభత్సంగా కనిపిస్తోంది.

లేనట్లు మనుషుల్ని దాటుకుని వెళ్లిపోయింది. అప్పటికే అక్కడి పరిస్థితితో పాటు వాతావరణమూ మారిపోయింది. ఉరుములు, మెరుపుల్తో బాటు గాలి ఎక్కువైంది.

కిట్టప్ప తండ్రి చేయిని గట్టిగా పట్టుకున్నాడు.

తుంపర జోరు కాస్తా పెరిగింది.

పల్లె ప్రజలు పిల్లాజల్లల్తో అలాగే నిలబడి తడుస్తుంటే... అధికారులు నెత్తిన మాత్రం గొడుగులు మొలుచుకొచ్చాయి.

వెంటకస్వామి గుడిసె ఎప్పుడో నేలమట్టమైపోయి ఉంది. అతని కళ్ళు గుడిసె కోసం వెదకసాగాయి.

ఆ ప్రదేశమంతా కూలిన గోడలతో, చిందరవందరైన బోదకప్పులతో బీభత్సంగా కనిపిస్తోంది. ఆ సంఘటన కలిగించిన అయోమయస్థితి నుంచి మామూలుగా రావడానికి అతనికి కొన్ని క్షణాలు పట్టింది.

"ముందెప్పట్నుంచో పేట కానుకోనున్న గుడిసెలు, పేట పెరిగే కొద్దీ కాలనీ యిండ్లు కాడికొచ్చినాయి. ఇప్పుడు ఈ గుడిసెల్ని తోసేసిరి. ఈ కాంక్రీటు మిద్దెలు, తారురోడ్లు రానురాను మమ్మల్ని యింకా దూరంగా తోసేస్తా వుండాయి. కడాకు మీరు అడవుల్లో వుండేవోళ్ళు, మళ్ళా అడవుల్లోకి పోండి.. అంటారేమో? ఆ అడవిలోనైనా మమ్మల్ని బతకనిస్తారా? అడవుల్లో తిరిగే జీవాలకు సంరక్షణ కలిగించే ఈ గవురుమెంటు, అడవుల పైనబడి బతికే మమ్మల్ని మాత్రం పట్టించుకోదు. ఆపాటి యిలువ కూడా మాకు లేదా?" ఆలోచిస్తూ తన గుడిసె శిథిలాలవైపు రెండడుగులు వేశాడు.

"నాయనా.. నాయనా.. యీడికి రా.." అన్న పిలుపుతో అలాగే నిలబడిపోయి, ఆ పిలుపు వినిపించినవైపు చూశాడు. దూరంగా వున్న చింత చెట్టు కింద వస్తువుల మధ్య పెద్దగంగి కూర్చొని వుంది.

ఆమె పక్కనే నిలబడి వున్న శాంతమ్మ తననే పిలుస్తోంది.

నిప్పుతో కాల్చినట్టు వేలి సలపరం యింకా ఎక్కువ కాసాగింది. అయినా అక్కడ జరిగిన ఆ సంఘటన వల్ల కలిగిన బాధ వేలి బాధ కంటే ఎక్కువగా ఉంది. అప్రయత్నంగానే అతని కాళ్ళు చింతచెట్టువైపు కదిలాయి. ఆ సమయంలోనే ఆకాశంలో ఒక తీగ మెరుపు... అంతటి వెలుగును భరించలేక ఒక్కక్షణం కళ్ళు మూసుకుని తెరిచాడతను.

ఎదురుగా.. కూలిపోయిన తన గుడిసె గోడల పెళ్ళల కుప్ప కనిపించింది. అదే సమయంలో..

ఎదురుగా.. కూలిపోయిన తన గుడిసె గోడల పెళ్ళల కుప్ప కనిపించింది. అదే సమయంలో.. కొంతసేపటి క్రితం తాను ఇసుళ్ళు పట్టేసి, తవ్వేసి వచ్చిన పుట్ట శిథిలాలు గుర్తుకు వచ్చి, వెక్కిరిస్తున్నట్లనిపించింది.

మళ్ళీ ఆకాశంలో మెరుపుల కొరడా..

ఆ వెంటనే భూనభోంతరాలు దద్దరిల్లేటట్లు దూరంగా పిడుగు పడింది. భయంతో వణికిపోతూ అలాగే నిలబడిపోయాడు వెంకటస్వామి.

ఈ కథ 13.08.2006, ఆంధ్రజ్యోతి, ఆదివారం లో ప్రచురించబడినది.

"---అలా అడగవోయి, యేం? డబ్బుచ్చుకుంటేనే కన్యాశుల్కమయిందేం? యిన్ని తులాలు బంగారం పెట్టాలి, యింత వెండిపెట్టాలి అని రూపాయిలకి బదులుగా వెండిబంగారాల కింద ధనం లాగితే, కన్యాశుల్కం అయిందికాదేం?"

- కన్యాశుల్కం నాటకంలో గిరీశం

మేటి కథలు-లోతు వ్యాఖ్యలు

# కథల వినువీధిలో ధ్రువతార 'రాసాని' వేటకథ



డా. గుమ్మా సాంబశివరావు
✆ 98492 65025

తెలుగు కథా ప్రపంచంలో తనదైన రచనల కాంతిలో ప్రకాశించే కథల చంద్రుడు డా. రాసాని వెంకట్రామయ్య. వి.ఆర్. రాసానిగా ప్రసిద్ధి పొంది కథలు, నవలలు, నాటకాలు, కవిత్వం – ఇలా అనేక సాహిత్య ప్రక్రియల్లో రచనలు చేస్తూ పలు పురస్కారాలు పొందిన ప్రతిభావంతుడు రాసాని. సాహిత్యంలో అంతకుముందు ఎవరి దృష్టి పడని అంశాలమీద కథలు, నవలలు రచించి విశిష్ట రచయితగా ప్రస్తుతి పొందారు. ఏ రచన చేసినా రాసానివారు ముందుగా తమ రచనకు కావలసిన సామగ్రిని సేకరించుకొని, దాన్ని విశ్లేషణ చేసి అది ఏ ప్రక్రియకు అనుకూలంగా ఉంటుందో నిర్ణయించుకొని రచన సాగించటం ఆయనకు అలవాటు. తెలుగు నవల, కథాసాహిత్యాల్లో ఒక విలక్షణ రచయిత రాసాని అని చెప్పటం సముచితం.

రాసాని వారు రచించిన 'వేట' అనే కథ ముందుగా 13.8.2006 ఆంధ్రజ్యోతి ఆదివారం సంచికల్లో ప్రచురితమైంది. ఈ కథను చదివి నేను రాసాని వారికి ఫోన్చేసి అభినందనలు తెలిపాను. అంతే కాదు అలాంటి కథను రాయటానికి కావలసిన సమాచారాన్ని ఎలా సేకరించగలిగారని అడిగాను. ఒక మిత్రుడి సహాయంతో యానాదుల దగ్గరకు రెండు పర్యాయాలు వెళ్లి, వాళ్లు 'ఇసుళ్లు' పట్టే తీరును తెలుసుకొని ఆ తర్వాత కథ రాసానని నాతో చెప్పారు. 'ఇసుళ్ల'ను కోస్తా ప్రాంతంలో ఉసుళ్లా' అంటారు. రాసాని వారు రచించిన ఈ కథ 2006 లో ప్రచురితమైంది. ఇంకా కొన్ని సంకలనాల్లో చేరింది. రాసాని వారి కథా సంపుటి 'విషప్పురుగు'లో ప్రస్తుతం 'వేట' కథ కనిపిస్తున్నది.

యానాదులు తమ జీవనాన్ని సాగించటానికి ఆహారపు వేటను సాగించే తీరు ఈ కథానికలో ఉంది. ముఖ్యంగా 'ఇసుళ్ల'ను పట్టటానికి ముందు వాటి పెరుగుదలకు అందించవలసిన సౌకర్యాలను ఎలా కలిగించిందీ విశ్లేషణాత్మంగా తెలియజేశారు. యానాది వెంకటస్వామి ఇంటి యజమాని "రాత్రినుంచి పిల్లలకు సద్దినీళ్లు కూడా లేవు కాబట్టి ఏదో ఒకపని చేసుకొని పిల్లలకు తిండి తీసుకురావచ్చు కదా!" అని భార్య చెప్పిన మాటలకు బదులిస్తూ

> "రాత్రినుంచి పిల్లలకు సద్దినీళ్లు కూడా లేవు కాబట్టి ఏదో ఒకపని చేసుకొని పిల్లలకు తిండి తీసుకురావచ్చు కదా!" అని భార్య చెప్పిన మాటలకు బదులిస్తూ...

"నువ్వేమీ దిగులు పడొద్దుండే. మొన్న చిన్నకుంట కట్ట మింద వొగనాలుగు కోమల పుట్ట జూసినా. ఆ పుట్టనిండా పుట్ట కూడే. ఆ పుట్టమీద గెడ్డిగేద చెక్కేసి, శుభ్రం చేసి అన్ని నీళ్లు దిమ్మరించి వచ్చినా" అని తానుచేసి వచ్చిన పనిని గురించి చెప్పాడు. అప్పుడామె "ఆయిసుళ్లన్నా పట్టుకొని రా పో. వాటినియేంచి ఉప్పుకారంబెట్టి అమ్ముకొస్తే అంత దుడ్డొస్తాది" అని చెప్పింది. అంతేకాదు మారిన కాలంలో "ఇసుళ్లంటే ముఖం చిట్లించుకుంటూ ఉండారని" వెంకటస్వామి అసలు పరిస్థితిని బయటపెట్టాడు. తప్పనిసరి పరిస్థితుల్లో ఇసుళ్ల వేటకు బయలుదేరతాడు. కొడుకు కిట్టప్పను కూడా తోడు తీసుకుపోతాడు. నీళ్లు పోస్తే ఎన్నిరోజులకు 'ఇసుళ్లు' పుడతాయని కొడుకు అడిగినప్పుడు "మూడు నాలుగు దినాలు పుట్టపైన నీళ్లు పొయ్యాల. అట్లపోస్తే పుట్టమన్ను నీళ్లను పీల్చుకుంటుంది. నీళ్లు చుక్కలు చుక్కలుగా పుట్టి కూటిపైన బడతాయి. అప్పుడు పుట్ట కూట్లోనుంచి పురుగులు యిడిగి వాటికి రెక్కలొస్తాయి. అవే యిసుళ్లు" అని వెంకటస్వామి వివరిస్తాడు. ఈ మాటల్ని గమనించినప్పుడు రాసానివారి పరిశీలనాత్మక శక్తి ఎంత గాఢమైందో, అవగాహన ప్రతిభ ఎంత స్పష్టమైందో తెలుస్తుంది. అందరికీ అన్ని విషయాలు తెలియవు. తెలిసినవారి దగ్గరనుంచి తెలుసుకొని వాటిని పదిమందికీ తెలియజేసే ప్రతిభ కొంతమందికి మాత్రమే ఉంటుంది. ఆ కొంతమందిలో

ముందువరుసలో ఉంటారు రాసానివారు. ఇంకా ఇసుళ్లను పగలు ఏవిధంగా పడతారో రాత్రిపూట ఎలా పడతారో వెంకటస్వామి తన కొడుకు కిట్టప్పకు వివరంగా తెలియజేశాడు. ఇసుళ్లు పట్టే ప్రయత్నాలు ముగించుకొని వెంకటస్వామి తిరిగి ఇంటికి చేరుకొనేటప్పటికి బాధాకరమైన వాతావరణం. ప్రభుత్వం వారు వెంకట స్వామి నివసించే ప్రాంతంలో ఉన్న ప్రజలకు అంతకుముందే నోటీసుకు ఇచ్చామని, ఆ ప్రాంతాన్ని ఖాళీ చెయ్యాల్సిందేనని చెప్పటంతో దిగులుతో ఇంటికి చేరిన వెంకటస్వామి తర్వాతి రోజు కూడా పుట్టమీద నీళ్లు చల్లి వచ్చాడు.

**మూడోరోజు ఇసుళ్లు పట్టటానికి అనువైన వాతావరణం ఉండటంతో వెంకటస్వామి తన కొడుకు కిట్టప్పతో కలిసి ఇసుళ్ల వేటకు బయలుదేరాడు.**

మూడోరోజు ఇసుళ్లు పట్టటానికి అనువైన వాతావరణం ఉండటంతో వెంకటస్వామి తన కొడుకు కిట్టప్పతో కలిసి ఇసుళ్ల వేటకు బయలుదేరాడు. వేగంగా ఇసుళ్లను పట్టాలనే ప్రయత్నంలో రెండు చేతులతో పుట్టను తాకాడు. బొడ్లో దోపుకొన్న 'పామేరు' ముక్కను తీసి నోట్లో వేసుకొని నములుతూ, దాని రసాన్ని మింగుతూ ఇసుళ్లు పట్టే ప్రయత్నం చేశాడు. పుట్టలో నుంచి బుసబుస శబ్దం వస్తూ ఉంటే పాము ఉందేమోనని కొడుకు కిట్టప్ప హెచ్చరించాడు. అప్పుడు వెంకటస్వామి "పామేం చేస్తుందిరా. పాములు కెరుసుకుంటే యీనాదోడు సచ్చినట్టే. అయినా పామేరు నోట్లో వుండాదిగదా. పాము కరిసినా యిసమెక్కదులే" అంటూ ఇసుళ్లు పట్టాడు. వాటితోపాటు పైకి వచ్చిన పాము అతని చేతి బొటనవేలును కొరికింది. అది జెర్రిపోతు కాబట్టి దానివల్ల ప్రమాదం లేదని కొడుక్కి చెప్పాడు. పుట్టను తవ్వి ఇసుళ్లను వెదకి వెదకి సంచిలో వేసుకొని ఏదో సాధించినట్లు విజయగర్వంతో పైకి లేచాడు.

"వెంకటస్వామి ఊరుచేరేటప్పటికి అక్కడి వాతావరణం బీభత్సంగా ఉంది" అంటూ రాసానివారు.

"అయ్యో! మేమెట్లా బతికేదిరాదేముడా!" గుండెలు బాదుకొని ఏడుస్తున్నారు కొందరు.

"బతికే దానికి దోవ సూపెట్టరుగానీ, వుండే తావును కూల్చేస్తారా?" మొలవస్త్రంతో నిలబడ్డ ముసలతనొకడంటున్నాడు.

"కాపాడాల్సినవోళ్లే కాల్చుకతింటే, యింక సెప్పుకునే దాని కేముండాది?" ఓ చింపిరిజుట్టు ఆక్రోశిస్తోంది.

అక్కడ జనం గుంపు – ఇలా ప్రజలగోడును వివరిస్తూ గుడిసెలు నేలమట్టమైన తీరును వివరించి "ఎదురుగా కూలిపోయిన తన గుడిసె గోడల పెళ్లకుప్ప కనిపించింది. అదే సమయంలో – కొంతసేపటి క్రితం తాను ఇసుళ్ల పట్టేసి, తవ్వేసి వచ్చిన పుట్ట శిధిలాలు గుర్తుకువచ్చి వెక్కిరిస్తున్నట్లనిపించింది. మళ్లీ ఆకాశంలో మెరుపులకొరడా.... ఆవెంటనే భూనంభోంతరాలు దద్దరిల్లేటట్లు దూరంగా పిడుగు పడింది. భయంతో వణికిపోతూ అలాగే నిలబడిపోయాడు వెంకటస్వామి" అని ఒళ్ళు గగుర్పొడిచే రీతిలో కథను ముగించారు.

అక్కడ జనం గుంపు – ఇలా ప్రజలగోడును వివరిస్తూ గుడిసెలు నేలమట్టమైన తీరును వివరించి "ఎదురుగా కూలిపోయిన తన గుడిసె గోడల పెళ్లకుప్ప కనిపించింది.

రాసాని వారి రచనాశిల్పం అనితర సాధ్యం. ఆయన రచనారీతి ప్రత్యేకంగా ఉంటుంది. ఆయన భావాలు అంతకుపూర్వం సాహిత్యంలో ఎవరూ చెప్పని రీతిలో ఉంటాయి. కథాశిల్పం సమగ్రంగా అవగాహన చేసుకొన్న రాసానివారు 'వేట' అనే కథను పాఠకులకు పదికాలాలపాటు గుర్తుండే రీతిలో రచించారు. వెంకటస్వామి తన జీవిక కోసం 'ఇసుళ్ల' పుట్టను తవ్వాడు. అంటేవాటికి గూడు లేకుండా చేశాడు. ప్రకృతిని విధ్వంసం చేశాడు. కేవలం బయటకు వచ్చిన ఇసుళ్లను మాత్రమే పట్టుకోకుండా వాటి గూడును కూడా తవ్వటంతో దానికి తగిన ప్రతిఫలాన్ని అనుభవించాడని కథారచయిత పరోక్షంగా తెలియజేశాడు. ప్రకృతిని నాశనం చేస్తే అది మనల్ని నాశనం చేస్తుందనే సూత్రాన్ని ధ్వనింపచేశారు.

ఇసుళ్ల గూడును పడగొట్టిన వెంకటస్వామి గూడు శిథిలమైంది. పిల్లాపాపలతో రోడ్డున పడ్డాడు. రాసానివారు ఈ కథ ద్వారా ప్రకృతి విధ్వంసాన్ని నిరసించారని చెప్పవచ్చు. ప్రకృతిని ధ్వంసం చేశాడు కాబట్టి ఆకాశం మెరుపుల కొరడా ఝుళిపించింది. పిడుగుపాటుతో వెంకటస్వామిని వణికింపచేసిందని అద్భుతమైన ముగింపునిచ్చారు.

'వేట' కథను ప్రారంభించటంలో కూడా రాసాని వారు అద్భుత ప్రతిభను ప్రదర్శించారు.

> తెల్లటిగోడకు ఉన్న 'దీగూడు' ముత్తయిదువ నొసటన పెట్టుకున్న చుక్కబొట్టులా కనిపిస్తుందని చెప్పటం కూడా రాసానివారి ప్రత్యేక భావుకతను ప్రదర్శిస్తున్నది.

తెల్లటిగోడకు ఉన్న 'దీగూడు' ముత్తయిదువ నొసటన పెట్టుకున్న చుక్కబొట్టులా కనిపిస్తుందని చెప్పటం కూడా రాసానివారి ప్రత్యేక భావుకతను ప్రదర్శిస్తున్నది. ఆవాక్యం తర్వాత "ఆ, దీ గూటికి పైన ఒక పెద్దబల్లి, దానికి కొంతదూరంలో వాలివున్న ఈగ దాపుకు మెల్లగా జరిగి, చటుక్కున ఆ ఈగను నోట కరచుకుని చూరుకిందకి పరిగెత్తింది." ఉదయాన గుడిసె ముందర కూర్చొని ఆ దృశ్యాన్నే చూస్తున్న వెంకటస్వామి మనసులో ఏదో ఆటవిక న్యాయం తళుక్కుమంది." అని రచించటం ద్వారా భవిష్యత్ కథా సూచన గావించారు. అధికారగణం వెంకటస్వామి గుడిసెను కూల్చబోయే దృశ్యాన్ని స్ఫురింపచేశారు. రాసానివారి వర్ణనను గమనించినప్పుడు వారిమీద శ్రీశ్రీ మహాప్రస్థాన ప్రభావం స్ఫురించకమానదు.

రాసానివారు మాత్రమే రచించగల వాక్యాలు ఈ కథలో చాలచోట్ల కనిపిస్తాయి. "కంకరరాళ్లతో - బొచ్చు ఊడిపోయిన గజ్జికుక్క చర్మంలా వికారంగా కనిపించింది రోడ్డు" ఇది నాకు అపూర్వమైన పోలిక. ఒక రోడ్డును ఈ విధంగా పోల్చిన రచయిత నాకు తెలిసి రాసానివారు కాకుండా మరొకరు లేరు. అలాగే "అక్కడ..... ఒక చిన్న కోతిపిల్ల మాదిరి ఒక చెట్లో నుంచీ మరో చెట్లోకి దూకుతోంది ఉడత" అని చెప్పారు. ఇంకొకచోట "....ఇల్లుచేరేసరికి

వీధి రోడ్లో గవర్నమెంటు జీపొకటి. రాత్రివేళ గొర్రెలమందపైన దాడిచేయడానికి పొదచాటున గుమ్మనంగా దాగి, పొంచి ఉన్న కొర్నం పోతులా చింతచెట్టు కింద ఆగివుంది. దానిచుట్టూ జనం చేరి ఉన్నారు" అని పేదవారికి రాబోయే ప్రమాదాన్ని సూచించారు.

"ఇళ్లు ఖాళీచేసి ఇంకా ఎక్కడైనా కట్టుకోండి. ఇది సర్కారార్డరు. ఇకచెప్పేదేముండదు." ఒక ప్యాంటు షర్టు గట్టిగా అరిచి చెబుతోంది.

"కాలనీ యిండ్లున్నోళ్లు ఆడికిపోతారు. లేనోళ్లు యాడికిపోవల్ల?" ఒక చొక్కాలేని బక్క శరీరం అడుగుతోంది.

"ఆపక్కనుండే కటవ పోరంబోకు. ఆడికి బొయ్యికట్టుకోండి." మరో 'టై' బిగించిన మెడ చెబుతోంది. – ఈ వాక్యాల ద్వారా రాసాని వారు తమ శిల్ప నైపుణ్యాన్ని ప్రదర్శిస్తున్నారు. ఆయా వ్యక్తుల పేర్లు చెప్పకుండా వారి వేషధారణను బట్టి వారి స్వభావాల్ని అద్భుతంగా ప్రకటించారు.

> చుట్టింట్లో చిరిగిన గుడ్డకు మాసికలేసి కుట్టుకుంటూ కూర్చోనుంది వెంకటస్వామి భార్య పెద్దగంగి.

రాసాని వారు మాటలతో బొమ్మలు కడతారని చెప్పటానికి వెంకటస్వామి కుటుంబాన్ని పరిచయం చేసిన తీరు సాక్ష్యంగా ఉంది.

"అతనికి యాభై యుండవచ్చు. అక్కడక్కడా నెరిసిన జుట్టుతో బక్కచిక్కిన శరీరంతో, నల్లగా..... చూస్తూనే కష్టాలతో కాపురం చేస్తున్నట్లుంటాడు. అతనికి నలుగురు సంతానం. అతని పెద్దకొడుకు పన్నెండేండ్ల కిట్టప్ప. ఎనిమిదేండ్ల తమ్ముడితో కలిసి వీధిలో కూర్చొని ఆడుకుంటున్నాడు.

చుట్టింట్లో చిరిగిన గుడ్డకు మాసికలేసి కుట్టుకుంటూ కూర్చోనుంది వెంకటస్వామి భార్య పెద్దగంగి. ఆమె వడిలో కూర్చుని రొమ్ముచప్పరిస్తోంది చిన్నబిడ్డ..... తల్లి చించి యిచ్చిన పాతచీర గుడ్డను పైటగా వేసుకుని పెరట్లో ముఖం కడుక్కొని పైటతో తుడుచుకుంటూ వచ్చి వీధి పక్కనున్న గూట్లోనుంచి చాదుచిప్ప తీసుకుని అందులో రెండు నీళ్ల చుక్కల్ని వేసి వేల్తోసాది, అద్దం

ముక్కలో ముఖం చూసుకుంటూ నొసటన బొట్టు పెట్టుకొని మళ్లీ యింట్లోకి వెళ్లిపోయింది. పదమూడేళ్ల శాంతమ్మ. శాంతమ్మ ఆ యింటికి మొదటి సంతానం." ఈ వాక్యాన్ని చిత్రాలుగా మలిచి రాసానివారు పాఠకులకు అందించారని చెప్పటంలో ఏమాత్రం అతిశయోక్తిలేదు.

'వేట' అనే ఈ కథలో ఇంకా అనేక సామాజికాంశాలు ప్రతిఫలిస్తున్నాయి. కాలం మారటంతో రోడ్లు సందడిగా ఉండటం, కొత్త ప్రభుత్వాల రాకతో గతంలో ప్రజలకు జరగవలసిన మేలుకు అవరోధం కలగటం, ఇంట్లో పనిచెయ్యటానికి 'కులం' అడ్డురావటం, పిచ్చుగుంట్ల వాళ్లు కాకుల్ని పట్టుకొనే తీరు, ఉడతల్ని పట్టుకొనే నైపుణ్యం – పాము కరిచినా ప్రమాదం లేని 'పామేరు' ప్రస్తావనా మొదలైన అంశాలు రాసానివారి సామాజిక పరిశీలనాశక్తికి తార్కాణాలుగా ఉన్నాయి.

పిచ్చుగుంట్లవాళ్ల కాకుల వేట, వెంకటస్వామి ఉడతల వేట, ఇసుళ్లవేట – ఇలా ఈ కథలో అనేక అంశాలు ప్రస్తావనకు వచ్చాయి. వేటలో ఒకరికి ఒకరు బలికాక తప్పదు. వేటాడబడిన జీవి బాధ పడుతుంది. ఈ బాధలకు గురైన ప్రాణులు కాకులు, ఉడతలు, ఇసుళ్లా – అలాగే అధికారులు తమ దర్పాన్ని ప్రదర్శిస్తూ సాగించిన వేటకు వెంకటస్వామిలాంటి ఎంతోమంది పేదప్రజలు గూడును కోల్పోయారు. 'ఇసుళ్లను' గూర్చి రచించిన ఈ కథ తెలుగు కథా ప్రపంచంలో అపూర్వమైనదిగా నిలిచి రాసాని వారి సామాజిక అవగాహనను, పరిశీలనా శక్తిని, రచనా నైపుణ్యాన్ని ప్రదర్శిస్తున్నదని చెప్పవచ్చు.



**ఇతిహాసపు చీకటి కోణం**
**అట్టడుగున పడి కాన్పించని**
**కథలన్నీ కావాలిప్పుడు!**
**దాచేస్తే దాగని సత్యం**

**- గురజాడ**

## మేటి కథలు-లోతు వ్యాఖ్యలు

# కంచిమేకలు



శ్రీ శిరంశెట్టి కాంతారావు
✆ 98498 90322

పడమర దిశలో, రక్తంతో అలికినట్టున్న ఆకాశంలో సూర్యుడు మొండెం నుండి వేరు చేయబడిన తలలా అన్పిస్తున్నాడు.....

బూరుగు చెట్టుకు తలకిందులుగా వేళ్ళాడుతున్న గబ్బిలాలు అప్పుడప్పుడే నిద్రలేస్తూ భయంకరంగా మూలుగుతున్నాయి.

రసూల్‌మియా కుటుంబం, తలా ఒక మూట నెత్తిన పెట్టుకుని, మరికొంత సామాను, గాడిద మీద వేసుకుని దక్షిణం వైపు నుండి మెల్లగా ఊళ్ళోకి వస్తోంది....

రసూల్‌మియాకి యాభై ఏండ్లుంటాయి. సున్నగా ఉన్న గుండు మీద టోపీ పెట్టుకున్నాడు. నలుపు, తెలుపు నిండు గడ్డం అతని ముఖానికి అందంగా అమరింది. మెడలో చిన్న తావీజొకటి వేళ్ళాడుతుంది. వంటి మీద మాసిపోయిన తెల్లలాల్చీ వేసుకున్నాడు. కాటన్ గళ్ళలుంగీని కాళ్ళకు అడ్డం తగలకుండా పైకి బిగించి కట్టుకున్నాడు.

అతని ఎడమ భుజానికి బరువుగా ఉన్న పెద్ద గుడ్డ సంచీ ఒకటి వేళ్ళాడుతోంది. కుడిచేతిలో ఉన్న కర్రతో గాడిదను అదిలిస్తూ నడుస్తున్నాడు...

రసూల్‌మియా వెనుక అతని భార్య జరీనా వస్తోంది...... ఆమెకు నలభై. నలభై ఐదేండ్లుంటాయి. నల్లగా, సన్నగా, కురచగా ఉంది. వంటి మీద పూల పూల పంజాబీ డ్రస్సు వేసుకుని అదే రంగు చున్నీని తల మీద కప్పుకుంది. ఆమె తలమీదో మూట, ఎడమ చంకలో ఓ చంటిపిల్లా ఉన్నాయి. కుడిచేత్తో మరో 'ఎడపిల్లవాణ్ణి' పట్టుకుని నడిపిస్తుంది.....

ఆ భార్యా, భర్తల వెనుక పదీ, పదిహేనేళ్ళ లోపు పిల్లలు మరో ముగ్గురు

తలల మీద మూటలు మోసుకుంటూ వస్తున్నారు. వాళ్ళు తొడుక్కున్న బట్టలతో పాటు, వాళ్ళ శరీరాలు కూడా మట్టికొట్టుకొని కన్పిస్తున్నాయి.

పాత ఇత్తడి, రాతెండి సామాన్లను కరిగించి, దేవుళ్ళ బొమ్మలు తయారుచేసి పొట్టబోసుకునే రసూల్ మియా కుటుంబం రోడ్డు మీద పడి బతికే 'కంచి మేకల్లా' కన్పిస్తుంది. వాళ్ళంతా వచ్చీ, వచ్చీ మెయిన్ రోడ్డులో ఉన్న చర్చి ముందు రావి చెట్టు కింద ఆగారు...

"అచ్ఛా! ఠీక్" అంటూనే చంకలో పిల్లను కిందికి విడిచి, తల మీది మూటను కూడా దించుకుంది.

"క్యాజీ? జరీనా? ఇక్కడ బాగానే ఉంది. ఠికానా ఏద్దామా?" – చుట్టూ పరిశీలనగా చూస్తూ భార్యను అడిగాడూ రసూల్ మియా.

"అచ్ఛా! ఠీక్" అంటూనే చంకలో పిల్లను కిందికి విడిచి, తల మీది మూటను కూడా దించుకుంది, భర్త మాటలను ఆమోదిస్తున్నట్టుగా జరీనా.

వెంటనే పిల్లలు కూడా తమ, తమ మూటలు – ముల్లెలు నేల మీద దించి, ఎంతోసేపటి నుండి ఆగకుండా నడిచి, నడిచి రావటంతో నీరసంగా ఊపిరి తీసుకుంటూ నేల మీద కూలబడ్డారు.

భార్యతో కలిసి గాడిద మీది మూటలు కూడా దించిన రసూల్ మియా, "జావో బేటా! జావో" అంటూ గాడిదను చర్చికి ఎడమ వైపున ఉన్న ఖాళీ స్థలం వైపు తోలాడు.

ఆ వెంటనే జరీనా చీపురు కట్టతో ఆ చెట్టు కిందంతా చిమ్మి, అంతకు ముందు ఎవరో తమలాంటి బాటసారులు వేసి ఉంచిన పొయ్యి రాళ్ళ మధ్య ఉన్న బూడిదను ఎత్తిపోసి, ఆ చుట్టుపక్కల ఉన్న చిత్తుకాగితాలను, అట్ట ముక్కలనూ ఏరుకొచ్చేలోపు, రసూల్ మియా ప్లాస్టిక్ బిందె, బకెట్ల నిండా చర్చీ ముందున్న బోరు దగ్గర నుంచి నీళ్ళు కొట్టుకొచ్చి పెట్టాడు.

పిల్లల సాయంతో రసూల్ మియా మూటలు విప్పి వాటిల్లో ఉన్న ప్లాస్టిక్ షీట్లతో గుడిసె వెయ్యసాగాడు...

డబరా గిన్నెలో బియ్యం కడుగుతున్న జరీనా "జీ! ఆ పని పిల్లలు చేస్తారు గాని, నువ్ పొయ్యి ఏదన్న హోటల్లో ఇంత సాంబార్ కొనుక్క రారాదూ! అంతసేపట్లో నేనీ అన్నం వండుతా గానీ" అంది భర్తతో.

"అచ్ఛా! ఠీక్" అని మిగతా పని పిల్లలకు పురమాయించి హోటల్ వెతుక్కుంటూ వెళ్ళాడు రసూల్ మియా.

**పిల్లలంతా తలో ప్లాస్టిక్ ప్లేట్ పట్టుకుని చుట్టూ కూర్చుంటే, వాళ్ళకొడ్డించింది జరీనా.**

టెంట్ పని పూర్తిచేసిన పిల్లలు, పొయ్యి ముందు కూర్చుని చిత్తు కాగితాలతో అన్నం వండుతున్న తల్లి చుట్టూ చేరి కబుర్లు చెప్పుకుంటూ ఆడుకోసాగారు....

జరీనా అన్నం వండడం ఐపోతుండగా సాంబార్, పెరుగు సంచుల్ని, క్యారీబ్యాగ్‌లో వేసుకుని హోటల్ నుండి వచ్చాడు రసూల్ మియా.

పిల్లలంతా తలో ప్లాస్టిక్ ప్లేట్ పట్టుకుని చుట్టూ కూర్చుంటే, వాళ్ళకొడ్డించింది జరీనా. పిల్లలు తినగా మిగిలిన దాంట్లో చెరిసగం సర్దుకున్నారు రసూల్ మియా, జరీనాలు.

తినడం ఐపోయిన పిల్లలు, తలో పట్టా వేసుకుని గుడిసెలో పడుకున్నారు.

తిన్న ప్లేట్లనూ, అన్నం గిన్నెనూ శుభ్రం చెయ్యసాగింది జరీనా.

"నేనా గాడిద బేటా ఎటు పొయ్యిందో చూసి తోలుకొస్తా" అనుకుంటూ అంతకు ముందు గాడిదను తోలినవైపు బయలుదేరాడు రసూల్ మియా.

ఎక్కడో దూరంగా ఉన్న సినిమా హాల్లో ఆ రోజే విడుదలైన సినిమా మొదటి ఆట చూసిన జనం కార్లల్లో, ఆటోల్లో, స్కూటర్ల మీదా, సైకిళ్ళ మీదా, నడుచుకుంటూ ప్రవాహంలా వెళుతున్న వాళ్ళను చూసి, 'అబ్బో! ఎంతమంది చూసొస్తున్నారు! ఇంతకూ అదేం సిన్మో?!" అనుకుంటూ గుడిసె వెనుక పడుకున్న జరీనా దగ్గరకు వెళ్ళి, ఆమె పక్కలో పడుకున్న 'ఎడపిల్లను' పక్కకు జరిపి మెల్లగా భార్య పక్కన చేరాడు రసూల్ మియా.

ఎందుకోగాని, ఆ రోడ్డులోని ఊర కుక్కలన్నీ రసూల్ మియా కుటుంబం దిగిన రావిచెట్టు కింద మూగి, మోరలు పైకెత్తి దీనంగా ఏడవసాగాయి!!!

★★★

అప్పటిలాగే తూర్పు దిశ ఎరుపును పులుముకుంది.

రసూల్ మియా కుటుంబానికి మళ్ళీ ఓ రోజు మొదలైంది.

రసూల్‌మియా పెద్దకొడుకు మస్తాన్, పదిహేనేళ్ళ కుర్రాడు వచ్చి ఫ్యాన్ ముందు కూర్చుని దాని హ్యాండిల్‌ని గుండ్రంగా తిప్పసాగాడు...

పిల్లలు లేస్తూనే గుడిసెకు, మెయిన్ రోడ్డుకూ మధ్య ఉన్న ఖాళీ స్థలంలో ఓ ప్లాస్టిక్ షీట్ పరిచి, గాలికి లేవకుండా నాలుగు మూలలా నాలుగు రాళ్ళు పెట్టారు. ఆ తరువాత ఓ మూటలో నుండి రకరకాల సైజుల్లో ఉన్న ఇత్తడి, రాతెండి దేవుళ్ళ బొమ్మలను వరుసల్లో పేర్చారు. వాటిల్లో రాముడు, కృష్ణుడు, వినాయకుడు, ఆంజనేయుడు, లక్ష్మీదేవిలతో పాటు ఏడువండల ఎనభై ఆర్లూ, తాజ్‌మహాళ్ళూ, శిలువ నెక్కిన జీసస్‌లు కూడా ఉన్నారు.

అలా పేర్చిన బొమ్మలకు ఓ పక్కగా కూర్చున్న రసూల్మియా తన దగ్గరున్న పనిముట్టుతో చిన్న గుంత తవ్వాడు. ఆ గుంతలో ఫ్యాన్ గొట్టాన్ని అమర్చి, దాన్ని తడిమట్టతో మెత్తాడు. ఆ విధంగా తయారైన కొలిమి గుంతలో, బొగ్గుల సంచిలో నుంచి ఇన్ని బొగ్గులు తీసి ముక్కలుగ కొట్టి వేసిం తరువాత, "అరే బేటా! మస్తాన్" అంటూ పిలిచి అగ్గిపుల్ల వెలిగించాడు.

రసూల్ మియా పెద్దకొడుకు మస్తాన్, పదిహేనేళ్ళ కుర్రాడు వచ్చి ఫ్యాన్ ముందు కూర్చుని దాని హ్యాండిల్‌ని గుండ్రంగా తిప్పసాగాడు.... ఆ ఫ్యాన్ గాలికి కొలిమి గుంతలోని బొగ్గులు మెల్ల మెల్లగా అంటుకోసాగాయి.....

ఈలోగా జరీనాతో పాటు, వాళ్ళ పెద్దపిల్ల, పది సంవత్సరాలది ఇద్దరూ కలిసి రొట్టెల కోసం గోధుమ పిండి పిసికి, రొట్టెలు తాల్చి సిద్ధంగా ఉంచారు.

కొలిమిలో బొగ్గులు, నిప్పులుగా మారగానే రొట్టెల పెనం ఎక్కించిన జరీనా

రొట్టెలు కాలుస్తుంటే, రసూల్ మియాతో బాటు పిల్లలంతా తలో బొగ్గు ముక్క తీసుకుని "కర్ర – కర్ర" మంటు నమిలి పండ్లు తోమడం ఐందనిపించారు.

"అరే భాయ్! రోటీ తయ్యార్" – గంటకొట్టేసింది జరీనా.

తలో ప్లేటూ పట్టుకొని కొలిమిగుంట చుట్టూ చేసిన భర్తా, పిల్లలకు తలో రెండు రొట్టెల్ని నాలుగు ఉల్లిగడ్డ ముక్కల్నీ వేసింది జరీనా. ఆ ఉల్లిగడ్డ ముక్కల్ని నంజుకుంటూ రొట్టెల్ని తినే సరికి కొలింమ్మీద 'టీ' డీకాషన్ కూడా తయారైంది. ఆ డికాషన్నే తలా ఇంత తాగారు. దాంతో ఆ పూటకి తిండి కార్యక్రమం ముగిసింది.

**ఎడమ చంకలో చంటిపిల్ల నెత్తుకుని, కుడిచేతిలో బొమ్మల అచ్చుల దండను పట్టుకుని చర్చికి కుడివైపున ఉన్న రోడ్డు మీద నడుస్తూ....**

★★★

ఎడమ చంకలో చంటిపిల్ల నెత్తుకుని, కుడిచేతిలో బొమ్మల అచ్చుల దండను పట్టుకుని చర్చికి కుడివైపున ఉన్న రోడ్డు మీద నడుస్తూ....."బొమ్మలు చేస్తాం, బొమ్మలు చేస్తాం, పాత ఇత్తడి, రాతెండితో బొమ్మలు చేస్తాం....." అంటూ ఇండ్లల్లో పనిచేసుకుంటున్న ఆడవాళ్ళకు విన్పించేలా గట్టిగా అరవసాగింది జరీనా.

ఆమె వెనుకే పదేళ్ళ పెద్దపిల్ల ఓ ఖాళీ గోతాంను, తరాజ్‌ను పట్టుకొని నడుస్తోంది.

జరీనా కేకలు విన్న ఓ ఇంటావిడ బైటికొచ్చి "ఓ బొమ్మలమ్మీ! ఇట్రా...." అంటూ పిలిచింది.

చేరవచ్చిన జరీనాతో, "ఏం బొమ్మలు చేస్తారు? అంటూ ప్రశ్నించింది.

"ఎయ్యిగావాల్నంటే, అయ్యి జేస్తం" అంటూ తన చేతిలో ఉన్న బొమ్మల అచ్చుల్ని చూపించింది జరీనా.

ఆ బొమ్మల అచ్చుల్ని పరికించిన ఇంటావిడ, "ఇదుగో, ఈ లక్ష్మీదేవి, వినాయకుల బొమ్మలు చేస్తారా?" అంటూ అడిగింది.

"ఆఁ ఎందుకు చెయ్యం" అంది జరీనా.

"ఇంతకూ ఎక్కడ దిగారు మీరు? వేసిన గిన్నెల్ని తీసుకుని ఉడాయిస్తే ఎలా?" కూపీ లాగుతున్నట్టుగా అడిగిందా ఇంటావిడ.

"అయ్యో! అట్లా చేస్తే మేం బత్కేదెట్లా అమ్మగారూ!? మా తాతల్నుంచి మాకిదే బతుకుదెరువు. మీరన్నట్టు జేస్తే మాకు బతుకుంటదా?" అంటూ ఇలాంటి మాటలు వినీ - వినీ బండబారిన జరీనా యాంత్రికంగా సమాధానం ఇచ్చింది.

"సర్లే ఉండు" అంటూ ఇంట్లోకెళ్ళి ఓ నాలుగు పాతగిన్నెలు తెచ్చి జరీన ముందు పడేసిందా ఇంటావిడ.

"అట్లా కాదు బాబమ్మా?! ఇంతకు ముందు అలా జరిగింది కాబట్టే అడుగుతున్నా" - అవసరం లేకున్నా అపద్ధర్మంగా ఓ అబద్ధం ఆడిందా ఇంటావిడ.

"ఏమో! అయ్యన్నీ మాకు తెలియదు" అంది జరీనా.

"సర్లే ఉండు" అంటూ ఇంట్లోకెళ్ళి ఓ నాలుగు పాతగిన్నెలు తెచ్చి జరీన ముందు పడేసిందా ఇంటావిడ.

వెంటనే పిల్ల చేతిలో తరాజ్ అందుకుని ఆ గిన్నెలను తూకం వేసి చూపించి, ఖాళీ గోతాంలో పడేసి పిల్ల చేతికందించింది జరీనా.

"ఎప్పుడు తీసుకొస్తావ్ మరి?" అడిగింది ఇంటావిడ.

"మద్దానంకల్లా తీసుకొస్తా" - సమాధానం ఇచ్చింది జరీనా.

ఇదంతా గమనించి బైటికొచ్చిన ఇరుగు - పొరుగు వాళ్ళు కూడా తలా ఒకటో, రెండో బొమ్మల్ని చెయ్యమని పాతగిన్నెలు వేశారు.

ఏ ఇంటావిడ, ఏ బొమ్మ చెయ్యమని, ఏ ఏ గిన్నెలు వేసిందో గుర్తుంచుకుంటూ తరాజ్‌ను అచ్చుల దండను పిల్లచేతికిచ్చి గిన్నెల మూటను తను నెత్తికెత్తుకుని వెనుదిరిగింది జరీనా.

★★★

చర్చి ముందు, రోడ్డు పక్కన ప్లాస్టిక్ షీట్ మీద పేర్చిన బొమ్మలు ఆ రోడ్డు మీద పోతున్న జనాలను ఆకర్షించాయి.

మెల్లమెల్లగా నడిచి వెళ్ళేవాళ్ళు, సైకిళ్ళ మీద, స్కూటర్ల మీద, ఆటోల మీద, కార్ల మీద వెళ్ళే వాళ్ళు కూడా ఆగి ఒక్కొక్కళ్ళే వచ్చి బొమ్మల్ని తీసుకొని చూడసాగారు.....

కొలిమి ముందు కూర్చుని పనిచేసుకుంటున్న రసూల్‌మియా, వస్తున్న కస్టమర్లను చూసి హుషార్‌గా లేచి వచ్చి, "తీస్కోండి సాబ్! యుద్ధంలో ఛోటాభాయ్ లక్ష్మణ్‌జీ, ఇంద్రాజిత్ దెబ్బకి మూర్ఛబోతే ఏడుస్తూ కూర్చున్న బడాభాయ్ రాంజీని సంతోషపెట్టెందుకు దవా పత్తా కోసం పర్వతాన్నే లేపుకొస్తున్న వీర హన్మాజ్‌జీ సాబ్! హన్మాన్‌జీ ఇంట్లో ఉంటే గాలీ దూలీ, ఏదీ చేరదు సాబ్" అంటూ హన్మంతుని బొమ్మను పట్టుకొని తీసుకోవాలా వద్దా అని ఆలోచిస్తున్న వ్యక్తితో అన్నాడు రసూల్‌మియా!

ఓ కార్లో నుండి దిగివచ్చిన యువజంట సీతారాముల బొమ్మల్ని తీసుకొని, చూసి పెట్టిన వాటి వంక చూసి, "అమ్మా సీతా మాజీ హమేషా రాంజీ ఎడమ పక్కనే ఉంచాలి ఇట్లా కుడి పక్కన ఉంచగూడదు" అంటూ రసూల్ మితా వాళ్ళు పెట్టిన బొమ్మల్ని సర్దాడు.

హిందీ, తెలుగూ కలిపి మాట్లాడుతున్న రసూల్‌మియా మాటలు వినే వాళ్ళకు గమ్మత్తుగా అన్పిస్తుంటే చూసేవాళ్ళల్లో ఒకతను ఉత్సాహంగా – "నువ్వు చూస్తే ముస్లిం వాడివైనా మా పురాణాలకు సంబంధించి భలే కతలు చెబుతున్నావే! అవన్నీ నీకెలా తెలుసు?" అడిగాడు. దానికి రసూల్‌మియా, 'దేఖో సాబ్! నేను ముసల్మాన్నే, ఐతే ఏంది సాభ్" ముత్తాతల దగ్గర్నుండి ఈ కతల్ చెప్పుకుంట, ఈ దందా చేసుకుంట బతుకుతున్నం. ఈ దందానే మాకు రోజు రోటి అందిస్తుంది. ఆ అల్లా దయవల్ల మీలాంటి మారాజులు కొంటం వల్ల ఇట్లా బతుకుతనే ఉంటం సాబ్!

నేను అన్నీ మతాల బొమ్మల్నీ బచ్‌పన్ చేస్తానే ఉన్నాను సాబ్! ఆ బొమ్మల్ని చేస్తుంటే, ఆటిల్లో నాకేం తేడాలు కన్పించవ్ సాబ్! నేను ముసల్మాన్ గదా ఈ హిందూ దేముళ్ళ బొమ్మలు చేసుడేందని నాకెప్పుడూ అన్పించలేదు సాబ్! మేం ఏ బొమ్మ జేసినా అది ఎంత అందంగా వచ్చిందా అని మాత్రమే చూసుకుంటాంగాని ఇంకేం ఆలోచించం సాబ్ ఈ దందా చెయ్యకుంటే మా ఫ్యామ్లీ అంతా కూటికి

ఛస్తాం సాబ్! ఎందుకంటే మాకీ పని తప్ప వేరే పనేదీ రాదు సాబ్!

దందా బాగా జరిగినందుకు ఆనందపడిపోతూ... జరీనా ఎప్పుడొస్తుందా? అని మాటి మాటికీ రోడ్డువైపు చూస్తూ..

నేను అన్నీ మతాల బొమ్మల్నీ బచ్‌పన్ చేస్తానే ఉన్నాను సాబ్! ఆ బొమ్మల్ని చేస్తుంటే, ఆటిల్లో నాకేం తేడాలు కన్పించవ్ సాబ్! నేను ముసల్మాన్ గదా ఈ హిందూ దేముళ్ళ బొమ్మలు చేసుడేందని నాకెప్పుడూ అన్పించలేదు సాబ్! మేం ఏ బొమ్మ జేసినా .... ఎంత అందంగా వచ్చిందా అని మాత్రమే చూసుకుంటాం గాని. ఇంకేం ఆలోచించం ...... ఈ దందా చెయ్యకుంటే మా ఫ్యామ్లీ అంతా కూటికి ఛస్తాం సాబ్! ఎందుకంటే మాకీ పని తప్ప వేరే పనేదీ రాదు సాబ్!

"ఐనా, నాకు తెలియకడుగుతా సాబ్! గరీబోనికి కులమేంది? మతమేంది? మజిద్ గట్టాలన్నా, మందిర్ గట్టాలన్నా కస్టం జేసేది మాలాంటి గరీబోల్లమే గదా సాబ్. పని జేస్కోని పొట్టబోస్కునే వానికి, చేసే పనే కులం, మతం – అదే మాకు అల్లాతో సమానం" అంటూ రసూల్ మియా తన చుట్టూ గుమికూడిన కస్టమర్లను గుక్క తిప్పుకోనివ్వకుండా మాట్లాడుతుంటే అతని మాటల చమత్కారానికి చాలా మంది బొమ్మలు కొన్నారు.

దందా బాగా జరిగినందుకు ఆనందపడిపోతూ..... జరీనా ఎప్పుడొస్తుందా? అని మాటి మాటికీ రోడ్డువైపు చూస్తూనే. "అరే బేటా! మస్తాన్! ఇటా" అంటూ పెద్ద కొడుకును పిలిచాడు రసూల్ మియా.

"ఏంటి బాబా!?" అంటూ వచ్చాడు మస్తాన్.

"ఇదుగో..... ఈ యాభై రూపాయలు తీసుకొని చికెన్ పట్రా ఫో బేటా!" అంటూ కొడుక్కి యాభై నోటు ఇస్తుండగానే..... దూరంగా చంకలో పిల్లా, తల మీద పెద్ద మూటతో వస్తున్న భార్యను చూసి, "అరే బేటా అటు జూడు మీ అమ్మీజాన్ బరువుతో వస్తుంది గాని ఉరుకూ" అంటూ కొడుకును తరిమాడు రసూల్ మియా.

తల మీద మూటను కొడుక్కందించిన జరీనా, చంక పిల్లతో వచ్చి రావిచెట్టు నీడలో అమాంతం కూలబడి, “యా అల్లా!” అంటూ గట్టిగా ఊపిరి తీసుకుని, పైమీది చున్నీతో వంటికి పట్టిన చెమటను తుడ్చుకోసాగింది.....

రసూల్‌మియా మెల్లగా భార్య ముందుకొచ్చి, “అరే జరీనా బేగం! ఇయ్యాల ఈ రసూల్‌మియా ఖమాల్ చూడకపోతివి! దందా ఎట్లా చేసిండనుకున్నవ్? యే దేఖో తమాషా!” అంటూ జేబులో డబ్బులు తీసి జరీనా ముఖం ముందు ఆడిస్తూ ఆమె ఎదురుగా కూర్చున్నాడు.

భార్య చెప్పిన వివరాలను బుర్ర లోకెక్కించు కుంటూ వెళ్ళి కొలిమి ముందు కూర్చుని బొమ్మలు తయరుచేసే పనిలో పడిపొయ్యాడు రసూల్‌మియా.

“అరే హుజూర్! నీ ఖమాల్ సంగతి నాకు తెలియదా?! దేఖో ఎన్ని బొమ్మలు చేయాల్నో!” అంటూ తను తెచ్చిన పాతగిన్నెల మూటను భర్తకు చూపించింది జరీన.

“అరే జహాపనా! ఈ పొద్దు అల్లా దయ మన మీద నిండ ఉంది” అని భార్యతో అంటూనే కొడుకువైపు తిరిగి, “బేటా! జల్ది బొయ్యి చికెన్ తే ఫో” అన్నాడు రసూల్‌మియా.

తను తెచ్చిన మూటను విప్పి ఒక్కో గిన్నెను భర్తకు చూపిస్తూ, ఏ గిన్నెతో ఏ బొమ్మ చెయ్యాలో వివరించింది జరీన.

భార్య చెప్పిన వివరాలను బుర్రలోకెక్కించుకుంటూ వెళ్ళి కొలిమి ముందు కూర్చుని బొమ్మలు తయరుచేసే పనిలో పడిపొయ్యాడు రసూల్‌మియా. ఒకసారి పనిలోకి దిగి, ఒక్కో బొమ్మా తయారుచేస్తుంటే అతను బాహ్య స్మృతినే కోల్పోతుంటాడు. తండ్రి చేస్తున్న కళాయజ్ఞంలో పిల్లలంతా తమ శక్తి మేరకు సహాయం అందించసాగారు....

జరీనా చిత్తు కాగితాలు, చిన్న చిన్న చిదుగులూ ఏరుకొచ్చి అన్నంతోపాటు కోడి కూడా వండి భర్తా, పిల్లల్ని భోజనాలకు పిలిచింది.

చేస్తున్న పనికి అంతరాయం జరక్కుండా ఒక్కొక్కరే వెళ్ళి అన్నం తిన్నారు.

మధ్యాహ్నం మూడు గంటల వరకు జరీన తెచ్చిన పాత గిన్నెలన్నీ తళతళా మెరుస్తున్న దేవుళ్ళుగా మారిపోయ్యి వరుసల్లో పేర్చబడ్డాయి.

సరిగ్గా అదే సమయానికి....

సైరన్ మోగించుకుంటూ అటుగా వచ్చిన పోలీస్ వ్యానొకటి లౌడు స్పీకర్లో "పట్టణ ప్రజలకు పోలీసు శాఖ వారి హెచ్చరిక, – రెండు వర్గాల మధ్య జరుగుతున్న గొడవల కారణంగా పట్టణంలో నూట నలభై నాలుగవ సెక్షన్ విధించబడింది. కాబట్టి ప్రజలంతా సహకరించగలరు. ఇద్దరు ముగ్గురు కన్నా ఎక్కువ కలిసి తిరగరాదు. ఇంకా పట్టణంలో ఏ విధమైన ప్రదర్శనలుగానీ, సభలూ, సమావేశాలు గాని నిర్వహించగూడదని తెలియజేస్తున్నాం" అంటూ ఎనౌన్స్ మెంట్ ఇస్తూ, రయ్యి, రయ్యిన దూసుకుపోయింది.

రసూల్ మియాతో బాటు అక్కడున్న ఒకరిద్దరు కస్టమర్లు గూడా విషయమేంటో అర్థంగాక అయోమయంగా చూడసాగారు.....

రచన మాస పత్రికలో 01 ఆగష్టు 2004 లో తొలుత ప్రచురితమైనది.



మతం వేరైతేను యేమోయి
మనసు వొకటై మనుషులుంటే
జాతియన్నది లేచి పెరిగీ
లోకమున రాణించు నోయి !

- గురజాడ

## మేటి కథలు-లోతు వ్యాఖ్యలు

# మతోన్మాదం మీద ఎక్కుపెట్టిన బాణం శిరంశెట్టి “కంచిమేకలు” కథ



శ్రీ మండవ సుబ్బారావు
✆ 94933 35150

తెలుగు ప్రపంచానికి ఇద్దరు కాంతారావులు తెలుసు. యాదృచ్ఛికంగా ఇద్దరూ పాత నల్గొండ జిల్లాకు చెందినవారే. ఒక కాంతారావు నల్గొండ జిల్లాలో పుట్టి చెన్నై వెళ్ళి, చిత్రసీమలో నటుడిగా చేరి కత్తి కాంతారావుగా పరిచయం అయితే, మరో కాంతారావు నల్గొండ జిల్లాలో పుట్టి పాల్వంచ చేరి కార్మికుడిగా శ్రమజీవుల కష్టాల్నీ, కన్నీళ్ళనీ తన కలంలో సిరాగా నింపుకొని కథకుడుగా ఆ జీవితాల చుట్టూ తను తిరుగుతూ, తెలుగు కథా సాహిత్యాన్ని తన చుట్టూ తిప్పుకుంటున్న కథల కాంతారావు.

“కథ“ అంటే చెప్పటం అనే సంస్కృత క్రియా పదం “కథ” గా మారింది. ఈ చెప్పటం మనిషి పుట్టినప్పుడే పుట్టింది.

“కథాయ లక్షణం జ్ఞేయం సారస్వతేన నిరూప్యతే

ఉత్పాద్యం సరసం హృద్యం వస్తు సంకీర్తయే కథా !!”

రచయిత ఊహల్లో పుట్టి రసవంతమయి హృదయాన్ని ఆకట్టుకునే వస్తువును కథ అంటారని కొందరు నిర్వచిస్తారు.

మానవునితోనే పుట్టిన కథ కొన్ని వందల శతాబ్దాల పాటు మౌఖిక సాహిత్యంగా ఉండిపోయింది. జానపద కథకులు కథను మౌఖికంగా ప్రచారం చేస్తూ కాపాడుతూ వచ్చారు. లిఖిత కథ క్రీ.పూ. 300 నుండి క్రీ.పూ. 300 వరకు ప్రాకృతం రాజబాషగా ఉన్న కాలంలో ప్రాచీన కథా సాహిత్యం వెలువడినట్లుగా సాహిత్య చరిత్రకారులు అభిప్రాయ పడ్డారు. ఆరుద్ర తన సమగ్రాంధ్ర సాహిత్యంలో గుణాఢ్యున్ని గురించి ప్రస్తావిస్తూ, –“ప్రపంచ కథానికలలో ఆద్య బ్రహ్మ అనదగ్గ గుణాఢ్యుడు ఆంధ్రుడు కావడం, తెలుగు వారందరికీ గర్వకారణం” అని

అభివర్ణించాడు. కథా, కథానిక రెండూ వేరు వేరు.. రూపాన్ని బట్టి కథానిక అంటే చిన్న ప్రక్రియ అయినప్పటికీ శక్తివంతమైన ప్రక్రియ. బాహ్య లక్షణాలను పక్కన పెట్టి అంతర లక్షణాలైన పాఠకుల హృదయాన్ని ఆకట్టుకునే వస్తువు, శిల్పం, శైలి రెండింటికి వర్తిస్తున్నందున కథకు పర్యాయపదంగా కథానికను వాడటం జరుగుతుంది. ఆధునిక కథ అంటే బహుశా ఇంగ్లీష్ లో షార్టు స్టోరీ పేరుతో వచ్చిన కథ అని అర్థం. కథా, కథానిక రెండూ ఒకటే అనేవారు ఉన్నారు.

కాలక్రమంలో సమాజంలో వచ్చిన మార్పు కథా సాహిత్యంలో మార్పు రావడానికి దోహద పడింది. పెద్ద కథ, చిన్న కథ, పేజీ కథ, కాలం కథ, కార్డు కథ, చివరకు నానో కథ.

ప్రాచీన కథకు గుణాఢ్యుడు ఆద్యుడైతే, ఆధునిక తొలి తెలుగు కథా రచయిత గురజాడ. అయితే కొందరు ఈ వాదాన్ని వెనక్కునెట్టి, 1901లోనే తెలంగాణా నుండి భండారు అచ్చమాంబ తెలుగులో మొట్టమొదటి కథా రచయిత్రి అని ప్రతిపాదించారు. కానీ, గురజాడ రచించిన దిద్దుబాటు కంటే ముందు కొన్ని కథలు ఉన్నా, అవన్నీగ్రాంథిక భాషలో ఉండటం వలన వాటిని కాదని వ్యావహారిక భాషలో ఉన్న మరియు ఆధునిక కథానిక లక్షణాలతో ఉన్న కథ "దిద్దుబాటు" అని, దానితో తెలుగు కథా వికాసం ఆరంభమైందని సాహితీవేత్తల అభిప్రాయం.

కాలక్రమంలో సమాజంలో వచ్చిన మార్పు కథా సాహిత్యంలో మార్పు రావడానికి దోహద పడింది. పెద్ద కథ, చిన్న కథ, పేజీ కథ, కాలం కథ, కార్డు కథ, చివరకు నానో కథ. కథ ఏదైనా, పాఠకుల్ని జోకొట్టడానికో, రెచ్చకొట్టడానికో, ఉన్నది ఉన్నట్టు చరిత్ర చెప్పడానికో అయితే సమాజానికి కలిగే ప్రయోజనం శూన్యం.

శిరంశెట్టి కాంతారావు కథల్లో వ్యథార్థ జీవుల యథార్థ గాథలు కనిపిస్తాయి. సుందరమైన విగ్రహానికి నొసటి తిలకం వలె కథకు మరింత అందాన్నిచ్చేది కథా శీర్షిక. "కంచి మేకలు" అంటే, మామూలుగా మేకలు బీడు భూముల్లో, అడవుల్లో తిరుగుతూ, అనేక చెట్ల ఆకులు, అలములు తిని పెరుగుతాయి. కానీ, అడవులు

తరిగిపోయి, పట్టణాలలో, నగరాలలో తిరుగుతూ, జనం తిని పారేసిన తొక్కలు, ఎంగిలి విస్తరులు తింటూ, నాకుతూ రోడ్డు మీద తిరిగే మేకలు కంచి మేకలు. వాటి బుద్ధి ఎలా ఉంటదో ప్రతీకగా తీసుకొని కథ చెపుతాడు. పాఠకుడు కథ చదవగానే, అసలీ మేకలేంటో తెలుసుకోవాలనే ఆసక్తి కలుగక మానదు. ఈ కథ "ఇంటింటి" పత్రికలో ఆగష్టు 2004లో ప్రచురించబడింది. డా. ఉన్నవ గోపాలక్రిష్ణ స్మారక పోటీలో బహుమతి పొందిన కథ. కాంతారావు ఎంచుకున్న వస్తువును తన ప్రతిభా పాటవాలు జోడిస్తూ నేర్పుగా చెప్పటం వలన ఈ కథకు గుర్తింపు, సార్థకత ఏర్పడింది. ఇక శిరంశెట్టి కథలోని గొప్పతనమంతా శిల్పం, వస్తువులకే చెందుతుంది.

> పాత సామన్లు కరగబోసి, వివిధ మతాలకు చెందిన దేవుళ్ళ బొమ్మల్ని పోతబోసి పొట్టనింపుకునే రసూల్ మియా విషాధ గాథ "కంచి మేకలు.

కథా కథన నైపుణ్యమే శిల్పమంటారు. ఒక గొప్ప వస్తువుకు గొప్పనైన శిల్పం తోడైతే అది గొప్ప కథ అవుతుంది. కథలో ముఖ్యంగా వస్తువు, ఎత్తుగడ, కథా కథనం, పాత్రలు, సంభాషణలు, వర్ణనలు, శీర్షిక, ముగింపు, భాష ప్రధానమైనవి. సమాజ పరిశీలనతో వాస్తవిక దృక్పథంతో ఉన్న కాంతారావు కథ పాఠకుల హృదయాల్ని గాఢంగా తాకింది.

రచయిత కథను ఎట్లా ఆరంభించాడన్నదే ఎత్తుగడ. పాఠకులకు ఆసక్తిని రేకెత్తించేటట్లు ప్రారంభ వాక్యాలుండాలి. సాధారణంగా కథకులు కథా వాతావరణంతోనో, వర్ణనతోనో, పాత్రల పరిచయాలతోనో, సంఘటనలతోనో, నాటకీయంగానో ప్రారంభించటం చేస్తారు. శిరంశెట్టి తన కంచి మేకలు కథను ఒకానొక సాయం సమయాన్ని సూచించే వర్ణనతో ప్రారంభిస్తాడు. "పడమర దిశలో రక్తంతో అలికినట్టున్న ఆకాశంలో సూర్యుడు మొండెం నుండి వేరు చేయబడిన తలలా అన్పిస్తున్నాడు.. బూరుగు చెట్టుకు తలకిందులుగా వేలాడుతున్న గబ్బిలాలు అప్పుడప్పుడే నిద్ర లేస్తూ భయంకరముగా మూలుగుతున్నాయి " అనే ప్రకృతి వర్ణనతో ఆరంభమవుతుంది.

పాత సామన్లు కరగబోసి, వివిధ మతాలకు చెందిన దేవుళ్ళ బొమ్మల్ని పోతబోసి పొట్టనింపుకునే రసూల్ మియా విషాధ గాథ "కంచి మేకలు. ప్రారంభంలోనే "పడమర దిక్కు" అన్నాడు. అస్తమిస్తున్న సూర్యుడు కూడా

అందంగా లేడు. సింధూరం రంగులో ఉండవలసిన వాడు రక్తంతో అలికినట్టు మొండెం నుండి వేరు చేయబడిన తలలా ఉన్నాడట ! తరువాత అశుభానికి ప్రతీకలైన గబ్బిలాలను ప్రస్తావించడం ద్వారా కథా గమనం ఎలా సాగబోతుందో సూచన ప్రాయంగా వ్యక్తీకరించాడు కథకుడు. ఇక మనిషిని పశువు నుండి దూరం చేసి, మనిషి జీవితం నైతిక విలువలతో సాగిపోవడానికి సహాయపడవలసిన మతం, వర్తమాన సమాజంలో ఒక మౌఢ్యంగా, ఉన్మాదంగా ప్రజా జీవితాల్ని తలకిందులు చేస్తున్నాయి. ఈ స్థితిని కథకుడు చాలా నైపుణ్యంగా నర్మగర్భంగా 'తలకిందులుగా వేలాడుతున్న గబ్బిలాలలను' ప్రస్తావించడం ద్వారా సామాజిక స్వరూపాన్ని సూచించాడు. బూరుగు చెట్టు కూడా ఒక ప్రతీకనే. పెళుచుగా వుండే బూరుగు చెట్టులా వర్తమాన సమాజం ఉందని చెప్పకనే చెపుతున్నాడు.

రోడ్డు పక్కన చెట్టు కింద భార్యా బిడ్డలతో జీవనం సాగిస్తున్న రసూల్ మియా, ఏదో సినిమాలో ఒక మతాన్ని, ఇంకో మతం వాళ్ళు ఎగతాళి చేస్తున్నట్టుగా ఉందని చెలరేగిన పనికిరాని ఆందోళన.

రోడ్డు పక్కన చెట్టు కింద భార్యా బిడ్డలతో జీవనం సాగిస్తున్న రసూల్ మియా, ఏదో సినిమాలో ఒక మతాన్ని, ఇంకో మతం వాళ్ళు ఎగతాళి చేస్తున్నట్టుగా ఉందని చెలరేగిన పనికిరాని ఆందోళన. ఒక గల్లీలో నుండి "జై శ్రీరాం" అంటూ ఒక గుంపు, ఇంకో వైపు నుండి "అల్లాహో అక్బర్" అంటూ మరో గుంపు నినాదాలు చేస్తూ తిరగటం, పోలీసులు విజిల్స్ వేస్తూ సైరన్ మోతలు మోగించటం. ఇదంతా రచయితకు రక్త హోమానికి రాక్షస సంగీతంలా అనిపించిందట! అది రసూల్ మియా కుటుంబానికి "కాళరాత్రి" అని ఒక్క మాటలో ఆ దృశ్యాన్ని కళ్ళకు కట్టాడు. ఆవేశంలో మతం ఏం చెపుతుంది, తామేం చేస్తున్నాం అనే ఇంగితం మరచి చర్చిలో తలదాచుకోటానికి పోతున్న రసూల్ మియాను పట్టుకొని " మన దేవుళ్ళ బొమ్మలు చేసి అమ్ముతున్న తురక నా కొడుకు" అంటూ కత్తితో పొడిచాడొకడు. గుంపులోని వాళ్ళంతా ఆ రక్తాన్ని చూసి రెచ్చి పోయి పిచ్చికుక్కల్లా తలా ఒక పోటు పొడిచి పారిపోయారు. ఆ గుంపు వెళ్ళిన మరో పది నిమిషాలకు ఇంకో గుంపు వచ్చి, "కాఫిర్ ! ముసల్మానువై ఉండి, ఆ

హిందూ సైతాన్ గాళ్ళ దేవుళ్ళ బొమ్మలు చేసి అమ్ముతావ్ బే !" అంటూ రాక్షసత్వం కళ్ళకు పొరలు కమ్మినవాళ్ళలా తలో పోటు పొడిచి పారిపోయారు.

మతోన్మాదానికి బలైపోవటాన్ని కథా వస్తువుగా తీసుకొని, ఎక్కడా ఎవ్వరినీ నిందించకుండా, మతోన్మాదులకు, సమాజానికి వేసిన చురకలు కనిపించని పోలీసు దెబ్బలు.

శిరంశెట్టి కథల్లో కథా వస్తువును సమాజం నుండే స్వీకరిస్తాడు. అందుకనువైన పాత్రల్ని ఎంచుకుంటాడు.

శిరంశెట్టి కథల్లో కథా వస్తువును సమాజం నుండే స్వీకరిస్తాడు. అందుకనువైన పాత్రల్ని ఎంచుకుంటాడు. ఆయా పాత్రలు సమాజంలోని వివిధ వర్గాల ప్రతినిధులకు నమూనాలుగా కనిపిస్తాయి. అంతే కాకుండా వాస్తవిక జీవనాన్నే కథా వస్తువుగా తీసుకొని రాయడం వలన కథలోని స్త్రీ, పురుషులు పాఠకులకు పరిచితులుగానే కనిపిస్తారు. కంచి మేకలు కథలో ప్రధానమైన పాత్రలు రెండే. ఒ కటి రసూల్ మియా, రెండవది అతని భార్య జరీనా. కథలోకి ఒక పాత్ర ప్రవేశించగానే ఆ పాత్రను కళ్ళకు కట్టినట్లు వివరించడంలో కాంతారావు అనితర సాధ్యుడు. "రసూల్ మీయాకు యాభై ఏండ్లుంటాయి. నున్నగా ఉన్నగుండు మీద టోపి పెట్టుకున్నాడు. నలుపు తెలుపు నిండు గడ్డం అతని ముఖానికి అందంగా అమరింది. మెడలో చిన్న తావీజొకటి వేళ్ళాడుతుంది. వంటి మీద మాసిపోయిన తెల్ల లాల్చీ వేసుకున్నాడు. కాటన్ గళ్ళ లుంగీని కాళ్ళకు అడ్డం తగలకుండా పైకి బిగించి కట్టుకున్నాడు." ఇంత కన్నా ఇంకేం కావాలి ఆ పాత్ర మరో కథ చదివే వరకు పాఠకుడ్ని వదిలిపెట్టకుండా ఉండటానికి. అలాగే జరీనానూ వర్ణన చేశాడు. "ఆమెకు నలభై, నలభై ఐదేండ్లుంటాయి. నల్లగా, సన్నగా, కురచగా ఉంది. వంటి మీద పూల, పూల పంజాబీ డ్రస్సు వేసుకుని అదే రంగు చున్నీని తల మీద కప్పుకుంది. ఆమె తల మీద మూట, ఎడమ చంకలో ఓ చంటి పిల్లా ఉన్నాయి. కుడి చేతిలో మరో ఎడపిల్లవాడ్ని పట్టుకొని నడిపిస్తుంది". రోజూ మనకు కనిపించే దృశ్యాన్నే అక్షరీకరిస్తే ఎలా ఉటుందో చూపించాడు కథకుడు.

కథా శిల్పంలో మరో భాగం సంభాషణ. ఏ రచయిత అయినా తాను చెప్పదలచుకున్న విషయాలు నేరుగా చెప్పకుండా పాత్రల ద్వారా చిత్రించడం చేస్తారు. కాంతారావు ప్రత్యేకత ఏమిటంటే, ఆయా ప్రాంతాల వ్యావహారిక భాషను అవలీలగా నేర్చుకుని, ఆయా పాత్రలకు తగిన రీతిలో సంభాషణలు చేకూర్చటం.

ఈ పని ఇవ్వాళ రేపు అందరూ చేస్తుండవచ్చు. కానీ అతికినట్టు ఉండాలి కదా ! భాష కూడా రచనలో ప్రధానమైనది. ముఖ్యంగా తెలంగాణ ప్రాంతలో ఉర్దూ భాష మాండలికంలో చేరిపోయి ప్రజల వ్యావహారిక సంభాషణలో అలవోకగా వస్తుంటాయి. అలాగే సందర్భోచితంగా సామెతలు, పదబంధాలు, విశేషోక్తులు ఉంటేనే కథా ప్రక్రియకు సొబగు చేకూరుతుంది. ఈ లక్షణాలన్నీ కంచి మేకల్లో కనిప్తాయి.

"రోడ్డు మీద పడి బతికే కంచి మేకల్లా రసూల్ మియా కుటుంబం కన్పిస్తుంది" ఒక్క మాటతో దృశ్యామానం చేయటం. "ఎడపిల్ల వాడు", "కళా యజ్ఞం" పదబంధాలు. " సాబ్ గరీబోనికి కులమేంది? మతమేంది? మజీద్ గట్టాలన్నా, మందిర్ గట్టాలన్నా కష్టం జేసేది మాలాంటి గరీబోల్లమే గదా సాబ్ ! పని జేస్కోని పొట్ట బోస్కునేవానికి , చేసే పనే కులం, మతం– అదే మాకు అల్లాతో సమానం". ఇది మొత్తం కథకు ప్రాణం. ఆంగ్లములో చెప్పాలంటే, సెంట్రల్ ఐడియా ఆఫ్ ది స్టోరీ. తాను సమాజానికి చెప్పదలచుకున్న విషయాన్ని సందర్భోచితంగా రసూల్ మియా నోట పలికించాడు.

"కంచి మేకలు" కథ పడమర దిక్కున సూర్యుడు, రక్తంతో అలికినట్టు మొండెం నుండి వేరు చేయబడిన తలలా ఉన్నాడు– అని వర్ణనతో ప్రారంభమైంది.. మరుసటి రోజు "ఎప్పటిలాగే తూర్పు దిశ ఎరుపును పులుముకుంది" కథలో చివరి రోజు "పొద్దు పొడుపు నిన్నటి కంటే దారుణంగా ఉంది". ఈ వర్ణనలు ఆ రోజు ఏం జరుగబోతుందో చూచాయగా అందించటం. ఇది కాంతారావు స్టైలు.

ఇక ముగింపు. కథకు ఆరంభం ఎంత ముఖ్యమో ముగింపు కూడా అంతే ముఖ్యము. కథకులు ఆయా కథాంశమును బట్టి ముగింపు చేస్తుంటారు. శిరంశెట్టి విషాదాంత ముగింపులో కూడా తన ముద్ర చెరిగిపోనీయలేదు. పోలికలు, వర్ణనలు తన స్టైల్లోనే చేసి ముగించాడు.

" కత్తి పోట్లతో వళ్ళంతా జల్లెడలా మారిపోయిం"దట! "రెక్కల తెగిన పక్షిలా" రసూల్ మియా. ఇక కారుతున్న రక్తం కూడా "రాముడు, ఏడు వందల ఎనభై ఆరు, జీసస్ బోమ్మలను తడుపుతూ" మట్టిలో కలిసి పోయిందట !

కథ చదవటం ముగించాక కూడా పాఠకుడు కాసేపు అక్కడే తచ్చాట్లాడేట్టు చేయటంలో శిరంశెట్టి నైపుణ్యం కలిగిన కథకుడు. వైవిధ్య కథా వస్తువులతో, శిల్ప, శైలిలతో ఆకట్టుకునే కథకుడు శ్రీ శిరంశెట్టి కాంతారావు.

# తడి భుజాలు



**శ్రీ వశిష్ఠ సోమేపల్లి**
✆ 80747 79202

ముళ్ళు ఎదురొస్తూ వుంటాయి
కొన్ని తొక్కడం అనివార్యం

కొందరు గాజు పెంకులు పరుస్తారు
రక్తమోడాల్సిందే

అప్పుడప్పుడూ లోపలన ఈదడం కోసం
ప్రవహించే సూర్యుళ్ళలో నడవాల్సి వస్తుంది

సిలబస్‌లో ఇదొక ఇంపార్టెంట్ చాప్టర్

★★★

కళ్ళదేముంది
ఇలా ఏవేవో కారణాలు వెతుక్కుంటూ
అప్పుడప్పుడూ తడుస్తూనే వుంటాయి
తడవాలి కూడా

కానీ
తడి భుజాలు కదా మనకు కావాల్సింది
మనం కావాల్సింది

తనవి కాని రెండు వేళ్ళు రెప్పల కింద
దూదై హత్తుకోకపోవడమే ఏకాకితనం

అటూఇటూ చూస్తే అన్నీ ముళ్ళ భుజాలు
పాలిథీన్ వేళ్ళు

★★★

ఎవరో మనల్ని ఓ ఇరుకు చట్రంలోకి నెట్టేసారు

ఇక్కడ
అప్పటికే వందల సార్లు వెళ్ళిన దార్లో
తాజా గాయంతో తోక వూపే
కుక్కపిల్ల తలని నిమరలేనంత రద్దీ

మిత్రుడెవరో కాసేపు జేబుని బదులుకి అడిగితే
గుండె కుట్లు తెగిపోయేంత లోతైన నిస్పృహాయత

బయటంతా నవ్వులు తగిల్చుకు తిరిగి
తిరిగొచ్చినాక భుజాలనిచ్చే వాళ్ళ ముందు
ముసుగును విసిరి పగలకొట్టేంత మహా అసహనం

ఇదొక ఊపిరాడని స్థితి
భుజాలపై సూదుల్ని నాటే ఎడారి క్రీడ

★★★

నేరమంటూ ఏమీ లేదు
ఇది నేటి అనివార్యత

నవ్వూ, ఏడుపూ, కోపమూ..
లోపలే వున్నాయిగానీ
చేతుల్లో నుండే జారిపోయాయి
మనమంతా కేవలం కస్టమరో, సర్వెంటో లేక ప్రోడక్టో

గుండె పొరపై
సిమెంటుతో మందంగా ప్లాస్టరింగ్ చేసుకోవడమే
తాజా సర్వైవల్ టాక్టిక్

పట్టాలెక్కామనుకుంటూనే
ఎటో తప్పిపోయాం

★★★

బతుకు నిర్వచనం
మోటివేషనల్ పుస్తకాల్లో వెతికినన్నాళ్ళు
దీని పేరు పురోగతి

ఎవరెవరిదో చెమట
రంగు కాగితాలై
మన చేతుల్ని తడపడం పేరు నాగరికత

# గురజాడ రచనలు సమకాలీనత

## ప్రత్యేక వ్యాసాలు



# నవతరానికి వెలుగుబాట గురజాడ



కీ.శే.పురిపండా అప్పలస్వామి



"తెలుగు ప్రజల స్మృతిపథంలో అప్పారావు సదా జీవిస్తాడు. చనిపోయినప్పటికీ అతను జీవిస్తున్నాడు" అన్నారు గిడుగు రామమూర్తి గారు 1915లో.

ఎంత నిజమైన మాటలివి ! తెలుగు ప్రజలు అప్పారావుగారిని మరచిపోలేదు. మరచిపోరు. ఏమంటే ఆయన మరణించలేదు. ఆయనకి మరణం లేదు. కాలంతో పాటు ఆయన పెరుగుతున్నాడు. పెరుగుతాడు. ఈ నవతరానికి భావితరానికి ఆయన పథ ప్రదర్శికుడు, వెలుగుబాట.

నవ్య సాహిత్యానికి – అభ్యుదయ సాహిత్యానికి నాంది పలికిన మహాకవి గురజాడ. వైతాళికులకు వైతాళికుడు గురజాడ. కొత్త యుగానికి యుగపురుషుడు గురజాడ.

అందుకనే ఏట్సు దొర అన్నట్టు "రచయితగా, పండితుడుగా, దేశభాషా సంస్కరణోద్యమానికి ఆద్యుడిగా" ఆయనకి హారతులు పడుతుంది లోకం.

గురజాడ కేవలం ఒక కవి మత్రమే కాడు, కథా రచయిత మాత్రమే కాడు, నాటకకర్త మాత్రమేకాడు, ఆయన మహా మేధావి. గొప్ప భాషాతత్వవేత్త. సంఘ సంస్కారి. ముందు చూపున్న రాజకీయవేత్త. స్త్రీ జనోద్ధరణ బద్ధకంకణుడు.

దేశమంటే మట్టికాదు
మనుషులు
అని చాటి చెప్పిన దేశాభిమాని.

అదిగో ఆ చీకటిలో
వేగుచుక్కలాగ
1861
నవంబరులో
కళింగసీమలో
ఉదయించారు
అప్పారావు గారు

అప్పారావుగారు అవతరించిన నాటికి భారతదేశం మాట అటుంచి తెలుగు దేశం ఎలా ఉంది ? సానిమేళాల సరదా, వేశ్యని వుంచుకోవటం గొప్ప, కన్యాశుల్కాలు, బాల్య వివాహాలు, జాతి విభేదాలు, పచ్చి శృంగార ప్రబంధాలు, అర్థమైనా కాని కల్పవృక్ష కవిత్వాలు, కృత్రిమ గ్రాంధికభాషా రచనలు – పండిత భిషక్కుల భాషా భేషజం – ఒక్కమాటలో చెప్పాలంటే అంతా అధఃపతనానికి దారితీసే అయోమయ వ్యవస్థ. అంతా భాద్రపదమాసంలో అమావాస్యరాత్రి చీకటి.

అదిగో ఆ చీకటిలో వేగుచుక్కలాగ 1861 నవంబరులో కళింగసీమలో ఉదయించారు అప్పారావు గారు, సరిగా ఇవాళకి నూటపదనాలుగేళ్ళ కిందట. విజయనగరంలో పట్టభద్రులయ్యారు. కలెక్టరాఫీసులోనూ, కాలేజీలోనూ కొంతకాలం పనిచేశారు. సంస్థాన శాసన పరిశోధకుడిగా, 'ప్రకాశిక' పత్రిక సంపాదకుడిగా, పురపాలక సంఘ సభ్యుడిగా, రీవారాణి ఆంతరంగిక కార్యదర్శిగా, మద్రాసు విశ్వవిద్యాలయం బోర్డ్ ఆఫ్ స్టడీస్ సభ్యుడిగా – ఫెలోగా పనిచేశారు.

ఇన్నిటా అప్పారావుగారు చూపిన ప్రతిభ ఒక ఎత్తూ, సాహిత్యంలో సాగించిన ప్రతిభ ఒక ఎత్తు. అడవి డొంకల్లోకి, వంతర్ల లోకి, గతకల్లోకి కదలిపోతున్న తెలుగు సాహిత్య రధాన్ని కొత్త పాతల మేలు కలయికతో మేలుదారి పట్టించిన మేటి సారధి, మహారధి గురజాడ మహాకవి.

కాశీభట్ల బ్రహ్మయ్యశాస్త్రి, కాశీ కృష్ణమాచార్యులు, కొక్కొండ వెంకటరత్నం, వావిలకొలను సుబ్బారావు, కూచి నరసింహం, మోచర్ల రామచంద్రరావు, జయంతి రామయ్య, వేదం వెంకట్రాయశాస్త్రి, ప్రానుగంటి లక్ష్మీనరసింహం, కొమర్రాజు లక్ష్మణరావు గార్ల వంటి కరడుకట్టిన గ్రాంధిక భాషావాదులు పన్నిన వ్యూహాలు ఛేదించుకొని మాతృభాష అయిన వాడుక భాష కోసం గిడుగు నీడలో పోరాడిన మహాయోధుడు గురజాడ అప్పారావు.

సరిగా ఈ యేటికి వందేళ్ళక్రితం 1875 లో గిడుగు రామమూర్తిగారిని కలుసుకున్నారు అప్పారావుగారు. అప్పటికి మైనారిటీ అయినా దాటలేదు. పద్నాలుగేళ్ళ యువకుడు. అతనికంటె రెండేళ్లు చిన్న రామమూర్తి గారు, గిడుగు గురజాడల ఆ కలయిక అపూర్వమైంది, చారిత్రాత్మకమైంది. వాడుక భాషోద్యమానికి శుభవేళ అది నిజంగా వందేళ్లు నిండుతున్న ఈ ఏట శత జయంతి జరపదగింది.

అప్పారావుగారు విద్యార్థిగా వున్న దినాల నుంచీ స్వతంత్రంగా ఆలోచించేవారు. "భావించడం నా ముచ్చట, ఆలోచనలు నా బలం" అని రాసుకున్నారాయన

అప్పారావుగారిని స్మరించినప్పుడు ఆనాటి వ్యావహారిక, గ్రాంధిక భాషల సంగ్రామ చరిత్ర జ్ఞాపకం వస్తుంది. గ్రాంథిక వాదులు చేసిన, చేస్తున్న కువిమర్శలు, కుతంత్రాలు రక్తం కుతకుతలాడిస్తాయి. అవన్నీ తడవాలంటే ఈ చిన్న వ్యాసంలో వ్యవధి తక్కువ. కాని అప్పారావుగారి మాటల్లోనే ఇక్కడ ఒక మాట చెప్పాలనిపిస్తుంది.

"వారు విరమించి చాలాకాలమైంది. కాని ఏ ముహూర్తాన పోరు తలపెట్టారో గాని ఆ యుద్ధరంగం మట్టుకు యెన్నడూ చల్లారలేదు. కవులు లావైనారు. కొట్లాటలు లావైనాయి. చరిత్ర పునరావృతమవు తున్నది, నలుదిక్కులా జయభేరీలు మోగుతున్నాయి. ఏమని? బిరుదులు గట్టిన పండితకవులకు తెలుగు లక్షణం రాదు, రాదు, రాదని."

గురజాడ అప్పారావుగారు తాను "పండితుడ్ని" అని ఎక్కడా చెప్పుకోలేదు. అందుకని నాడూ, నేడూ చిన్నచూపు చూసిన "పండితులు" లేకపోలేదు. కాని

ఆయన అసలయిన పండితుడు. లోతులు తెలిసిన పండితుడు. గుడ్డిగా అనుసరించని దూరపు చూపు గల పండితుడు. అన్నిటినీ మించి ఆయన ప్రజల పండితుడు.

అప్పారావుగారు విద్యార్థిగా వున్న దినాల నుంచీ స్వతంత్రంగా ఆలోచించేవారు. "భావించడం నా ముచ్చట, ఆలోచనలు నా బలం" అని రాసుకున్నారాయన, ఈ భావించడం, ఆలోచించటమే – ఈ సత్యాన్వేషణమే

ఆయనను మహాకవిగా తీర్చిదిద్దాయి. ఆ రోజుల్లోనే ఇంగ్లీషులో కవిత్వం రాయడం మారంభించారాయన. తరువాత సారంగధర (1883) ఇంగ్లీషులో రాశారు. కాని తన మాతృభాషలోనే రాయడం తన కర్తవ్యంగా నిర్ణయించుకున్నారు.

**అప్పారావుగారి కన్యాశుల్కం అప్పటికీ ఇప్పటికీ అపూర్వమైన జాతిరత్నంగా నిలిచిపోయింది.**

అప్పారావుగారి కన్యాశుల్కం అప్పటికీ ఇప్పటికీ అపూర్వమైన జాతిరత్నంగా నిలిచిపోయింది. ఆనాటి తెలుగుదేశం అచ్చంగా అందులో నిలిచిపోయింది. దాన్ని మించిన రచనగాని, కనీసం దానితో సమానమైన రచన గాని ఇంతవరకూ రాలేదంటే దాని గొప్పతనం వ్యక్తమవుతుంది. ఇప్పటికీ కన్యాశుల్కం హటాత్తుగా ఏ పుట అయినా తెరిచి చదవండి, అనుకోకుండా మనం విజయనగరంలో వున్నట్టనిపిస్తుంది. గిరీశం మనం బాగా ఎరిగిన పెద్దమనిషే అనిపిస్తాడు. సానుల సందడి చప్పబడిపోయినా మధురవాణి నవ్వుతూ బతికే ఉంటుంది.

కొండుభట్టీయం, బిల్హణీయం, కన్యాశుల్కంతో సాటిరాకపోయినా, వదిలిపెట్ట దగినవి మాత్రం కావు.

అప్పారావుగారి ప్రతి రచనా అమూల్యమైన ఆణిముత్యం. చిన్న కథలు, ముత్యాల సరాలు, వ్యాసాలు, సాహిత్యలోకానికి జీవగర్రలు. పూర్ణమ్మ గేయం పాడని, కనీసం విననివారుండరు.

వెలుగుచూసి కళ్ళు మూసుకునే వాళ్ళూ, మంచిని మెచ్చని వాళ్ళూ అప్పుడూ ఇప్పుడూ – ఎప్పుడూ వుంటారు. అలాంటి వాళ్ళని ఉద్దేశించే అన్నాడా మహాకవి :

"మెచ్చ నంటా నీవు పోనీ
మెచ్చుకుంటే మించి పొయెను
కొయ్య బొమ్మలు మెచ్చు కళ్ళకు
కోమలులు సారెక్కునా"

అని సాహిత్యకళను సాధనంగా జేసుకొని స్త్రీల ఉన్నతికి పాటుపడిన మహాకవి గురజాడ అప్పారావు. ఆయన రచనల్లో హెచ్చుభాగం దీనికే వినియోగించారు. అయితే ఆయన రచనలు కళాసంపన్నం కావడంచేత, తాత్కాలిక ప్రయోజనంతో వెనకపడక నవనవోన్మేషంగా చిరకాలం నిలిచిపోతున్నాయి. కళ కళ కోసమే కాకుండా కళ జనం కోసం అన్న సత్యాన్ని రుజువు చేశాడాయన.

అప్పారావుగారి ప్రతిభా విశేషం గురించి ఒక్క సంగతి ఇక్కడ చెప్పాలి. అప్పటి విజయనగరం మహారాజు ఆనంద గజపతి మంచి సాహిత్య రసికుడు. ఆయనతో మన అప్పారావుగారికి మనస్సు కలిసిన పరిచయ మేర్పడడం గొప్ప విశేషం. కన్యాశుల్కం ఆనంద గజపతికే అంకితం. ఆయన ఆస్థానంలో ముడుంబై నరసింహాచార్యులు, కొల్లూరి కామశాస్త్రి, మండచిట్టి కామేశ్వరశాస్త్రి, భాగవతుల లక్ష్మీనారాయణ, పేరి వెంకటశాస్త్రి, పేరి కాశీపతిశాస్త్రి, ఇవటూరి నందికేశ్వరశాస్త్రి, మైసూరు భీమాచార్యులు, నేమాని కోదండ రామయాజులు మొదలైన మహాపండితులుండేవారు. ఇలాంటి ఉద్దండుల మధ్య వ్యావహారిక భాషావాది అప్పారావుగారు స్థానం సంపాదించుకున్నారంటే, ఉపాధ్యక్షులు కాగలిగారంటే ఆస్థానంలో గోష్టికి ఉపాధ్యక్షులు ఇంక చెప్పవలసిందేముంది ?

పిఠాపురం సంస్థానంలో కూడా పండితులుండేవారు, కాని ఆ మహారాజు ప్రాచీన సాహిత్యానికి, గ్రాంధిక భాషకే తప్ప తన ఆస్థానంలో వాడుక భాషకు తావు కల్పించలేదు. ఆనంద గజపతి రెండింటినీ ప్రోత్సహించారు, ఆదర్శప్రాయులైనారు. ఆనంద గజపతి ప్రోత్సాహం గురజాడ మహాకవికి వంద ఏనుగుల బలం కలిగించింది.

"అప్పారావుగారిని అంతటివాడిగా మలిచి తీర్చిన మహారాజు ఆనంద గజపతి" అన్నారు బుర్రా శేషగిరిరావు.

అప్పారావు గారు అవతరించింది 21-9-1862 అనీ, 30-11-1861 అని చరిత్రకారులు రాస్తున్నారు. ఏమయినా ఆ మహాకవి సంస్మరణ మన కర్తవ్యం.

ఈ వ్యాసం ముగించేముందు గిడుగు సీతాపతిగారి మాటలలో ఆ మూ ర్తిని ఓమారు మనస్సులో చిత్రించుకుందాం.

"వెడల్పయిన నుదురు, చక్కని పెద్ద కన్నులు, ఆ కన్నులకు గొడుగు పట్టినట్లున్న కనురెప్పలు, తొమ్మిది అంకె వలెనున్న చెవులు, సోగగా కాస్త వంగినట్లున్న ముక్కు, మృదువైన అధరం, కింద కొంచెము వంపుదేరి స్ఫుటముగానున్న గడ్డం, వెడల్పు, పొడవు గల చెక్కిళ్ళు, పురుష లక్షణములకు తగినట్లు కనుబొమలు, మీసం – ఇవి అన్నీ ముఖమునకు నిండుతనము, గాంభీర్యము కలిగించి, వీరు దృఢకాయులు, ఆరోగ్యవంతులు అయి వుండవలెనన్న అభిప్రాయమును కలిగించును. కాని వీరు బాల్యము నుండిన్నీ అర్భకులుగానే ఉండేవారు."

"ఈనాడు" దినపత్రిక 21-9-75 సంచిక నుండి పునర్ముద్రితం.

దృక్కోణం

# కన్య, శుల్కం



డాక్టర్ కొవ్వలి గోపాలకృష్ణ

మనిషి భూమి మీదకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు మనిషి జీవితానికి సంబధించిన మౌలిక అంశాలు మారలేదు. మనిషిని మనిషి పీడించడం–ఆడవాళ్ళని మగవాళ్ళు గాని, మగవాళ్ళని ఆడవాళ్లు గాని– ఇప్పటికీ కొనసాగుతున్నాయి.




పిల్లలు కాముకత్వానికి బలి అవడం, అక్రమ సంబంధంలో పుట్టిన పిల్లలని చంపడమో, ఎక్కడో వదిలి పెట్టడమో, పెంపకం పేరుతో పిల్లలని హింసించడమో జరుగుతూనే ఉన్నాయి. నిశితంగా పరిశీలిస్తే, ప్రతి మనిషి జీవితంలోనూ, ప్రతి సమాజ మనుగడలోను ప్రముఖ పాత్ర వహించే అంశాలు రెండు– కన్య, శుల్కం. అంటే స్త్రీ, డబ్బు.

అమ్మకాలు కొనుగోళ్ళ మీద విధించే పన్ను విషయంలో ప్రభుత్వం లబ్ధిదారుగా ఉంటుంది. కానీ కుటుంబ, సమాజ వ్యవస్థలలో జరిగే ఆర్థిక లావాదేవీల విషయంలో ప్రభుత్వ చొరబాటు ఉండదు; ఎవరైనా ఫిర్యాదు చేస్తే విచారించి తగిన చర్య తీసుకునే పాత్ర తప్ప. లావాదేవీలు, సద్దుబాట్ల విషయంలో పెద్దల, లేక పెద్దలుగా చెలామణీ అయే మనుషుల ప్రమేయం ఉంటుంది; వాళ్ళు స్త్రీలు కావచ్చు, పురుషులు కావచ్చు. ఒక మనిషి వేరొక మనిషితో సంబంధం ఏర్పరచుకోవాలంటే చుట్టు పక్కల ఉన్న పెద్దలు, తల్లిదండ్రుల ప్రమేయం ఉంటుంది. మనుషుల

మధ్య ఏర్పడే, కొనసాగే సంబంధాలు, మానవ సంబంధాల పరిధి స్థాయి నుంచి ఆర్థిక, మరియు పరస్పర అవసరాలు తీర్చే మార్పిడి వ్యవస్థ స్థాయికి మారాయి. మారుతూనే ఉన్నాయి. ఇది తరతరాలుగ జరుగుతున్న తంతే.

ఒకానొక కాలంలో, ఆడపిల్లలని అబ్బాయిలకి, ముఖ్యంగా ముసలి అబ్బాయిలకి ధారపోయడం (కన్యాధార)

కొనే వాడు అమ్మే వాడికి ధర చెల్లిస్తాడు. ఆ ధరలో వస్తువుకి ఉండే విలువ, గిరాకి, వస్తు ఉత్పత్తికి, సరఫరాకి అయ్యే ఖర్చు ఇమిడి ఉంటాయి. ప్రభుత్వం కన్నేస్తే అందులో ప్రభుత్వ వాటాగా అమ్మేవాడు ఇచ్చుకోవలసిన కప్పం ఉంటుంది. పశువుల అమ్మకాలు కొనుగోళ్ళ విషయంలో కొనేవాడి, అమ్మేవాడి అవసరాలు, అమ్మబడే పశువుల నిస్సహాయత ముఖ్యపాత్ర వహిస్తాయి. ఆశ్చర్యకరంగా, పెళ్ళి పేరుతో, పశువులు కాని పిల్లల క్రయ విక్రయాల విషయంలో కూడా ఇదే మానవ బలహీనత, మనుషుల ప్రవర్తన కనపడుతుంది.

ఒకానొక కాలంలో, ఆడపిల్లలని అబ్బాయిలకి, ముఖ్యంగా ముసలి అబ్బాయిలకి ధారపోయడం (కన్యాధార), అందుకు ప్రతిఫలంగా వరుడు (వరుడి కుటుంబం కాదు) అమ్మాయి కుటుంబానికి కొంత సుంకం చెల్లించడం జరిగేది. లోకం తెలియని పిల్లని లోకం వదలడానికి సిద్ధంగా ఉన్న ముసలి వరుడితో పెళ్ళి చేసే సాంప్రదాయం వినడానికే చాలా జుగుప్సాకరంగా ఉంటుంది. ఈ మార్పిడి ప్రక్రియ కొన్ని ఛాందస బ్రాహ్మణ కుటుంబాలలోనే ఉండడం గమనించతగ్గ విషయం. అయినా కన్యాశుల్కం అనే వివాహ వ్యవస్థ, దానిని నిరసిస్తూ ప్రభావవంతంగా రాసిన నాటకం విస్తృత సమాజం మీద విశేష ప్రభావం చూపడం గమనార్హం. ఇది ఒక మంచి పరిశోధనాంశం.

ఇద్దరు బాలల మధ్య జరిగే వివాహాలు కూడ సామాజిక రుగ్మతయినా అవి సమాజంలో రేపిన అలజడి, ఆక్రోశం వేరే స్థాయిలోను వేరే పరిధిలోను ఉండేవి. చాల అరుదుగా జరుగుతున్నా, బాల్య వివాహాలు ఇంకా ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్నాయి. అమెరికాలాంటి దేశాలలో సహితం. ఇంకా ఆశక్తికరమైన విషయం ఏమిటంటే ఇప్పుడు కొంతమంది ముసలి అరబులు

భారత దేశం వచ్చి ఆడపిల్లలని పెళ్ళి పేరుతో కొనుక్కుంటున్నారంటే నవ భారతం కన్యాశుల్క వ్యవస్థని ఎగుమతి చేసిందని గర్వపడాలా, చింతించాలా? ఈ విషయంలో కడపటి మాట- మనుషుల మధ్య సంబంధాలు ఆర్థిక లావాదేవీల ప్రాతిపదిక మీదనే ఆధార పడి ఉంటాయి. కన్య, శుల్కం, జగన్నిర్దేశనాస్త్రాలు.

కన్యాశుల్కంగా పేరొందిన, వరుడు వధువు కుటుంబానికిచ్చే "కానుక", వరుడికిచ్చే లంచంగా (కట్నం) మారింది. తేడా ఏమిటంటే, వయసు, ప్రాంతం, కులం, సాంప్రదాయం, అనే భేధం లేకుండా అందరినీ ఆకర్షించి పీడిస్తున్న జాడ్యం వర కట్నం. సామాజిక పరిణామం ఎంత ఆశ్చర్యకరంగా ఉంటుంది? గురజాడ ఇప్పుడు ఉంటే? ఈ కాలం సమస్యలకి గురజాడ ఆణిముత్యాల సరాలు వైద్యం చేయగలవా?

**ఎక్కడ విన్నా వరకట్న దురాచార అకృత్యాలు, ఆగడాలు చూసిన, చూస్తున్న భారత దేశం గత కొన్ని సంవత్సరాలలో "అమ్మాయి దొరికితే చాలు" అని ఆకాంక్షించే వరసీమగా మారుతోంది.**

ఎక్కడ విన్నా వరకట్న దురాచార అకృత్యాలు, ఆగడాలు చూసిన, చూస్తున్న భారత దేశం గత కొన్ని సంవత్సరాలలో "అమ్మాయి దొరికితే చాలు" అని ఆకాంక్షించే వరసీమగా మారుతోంది. కారణం? అమ్మాయిల విద్య, ప్రచార మాధ్యమాల ద్వారా ప్రవహిస్తున్న సమాచారం, వివేకం, ఇరుగు పొరుగు వారి అనుభవాలు. ఈ పరిణామాలు ఏమి ధృవీకరిస్తున్నాయ్? మానవ సంబంధాలన్నీ ఆర్థిక లావాదేవీల ప్రాతిపదికగా నడిచేవేనని.

ఆశ్చర్యకరంగా, ప్రేమించే, ప్రేమించి పెళ్ళి చేసుకునే ఆధునిక "యువకులంలో" స్వచ్ఛ ప్రేమ ఉందా? ప్రేమలో, పెళ్ళిలో, ఆర్థిక అంశాలు, స్వార్థ ప్రయోజనాల ప్రభావం లేదా? అమెరికా సంబంధం కోసం వెదికే వనితల, వాళ్ళ తల్లిదండ్రుల వింత విన్యాసాలు చూడట్లేదా?

ఇంతకు ముందు చెప్పినట్లు సమాజ వ్యవస్థలో ఆడపిల్లల పాత్ర చాలా ముఖ్యం. కొన్ని తరాల వాళ్ళు బాధితులు; కొన్ని తరాలలో కొన్ని పరిస్థితులలో

వాళ్ళూ తోడ్పాటుదారులు; కొన్ని కాలాలలో, కొన్ని సమయాలలో వాళ్ళూ ప్రభావవంత పాత్రధారులు. ఎటు తిరిగి ఎటు చూసినా కోమలులు కొంపల దీపికలు. కానీ, సమాజ ఆర్థిక లావాదేవీల విషయంలో మాత్రం వాళ్ళు వస్తు సమానులు. దురదృష్టకరం అయినా ఇదొక సత్యం.

కన్యాశుల్కం అనే వికృత బాల్య వివాహ వ్యవస్థా సమయంలోనూ, వరకట్న వ్యవస్థలోనూ, మహిళలు మార్పిడికర్హమైన జీవ పదార్థాలుగా మాత్రమే ఉన్నారు. ఇందులో పెద్దల పాత్ర ఎంతో ఉన్నా ఆధునిక వనితల తోడ్పటు, పాత్ర లేదా? డబ్బుని, డబ్బుతో ముడిపెట్టే బాంధవ్యాల సంస్కృతి రూపాంతరం చెందుతున్నా ప్రతి శకంలోనూ, ప్రతీ తరంలోనూ కొనసాగుతూనే ఉంది. వస్తు ప్రస్థావనలేని వివాహ, సామాజిక వ్యవస్థ ఎక్కడ ఉంది? స్వంత ప్రమేయం, అనుమతి లేకుండా చిన్న పిల్లల వివాహాలకి నిస్సహాయత కారణం అయితే, వయసొచ్చిన, ఆలోచించగల వాళ్ళ వివాహాలలో స్వార్ధం, ఆర్థిక సామాజిక హోదాల పాత్ర ఉండడం,అందులోనూ ఇరవై ఒకటో శతాబ్దంలోనూ ఈ పరిస్థితి ఉండడం ఎంత ఆశ్చర్యం?

కన్య, శుల్కం ఎప్పుడూ సమాజాన్ని ప్రభావితం చూస్తూనే ఉంటాయి. అందుకే కన్యాశుల్కం లాంటి నాటకం ఎప్పుడూ కొత్తగా ఉంటుంది; ప్రజలని ఆకట్టుకుంటోనే ఉంటుంది. కొంతమదినైనా ప్రభావితం చేస్తూనే ఉంటుంది.



**కదిలేదీ కదిలించేదీ**
**మారేదీ మార్పించేదీ**
**పాడేదీ పాడించేదీ**
**పెను నిద్దుర వదిలించేదీ**
**మును ముందుకు సాగించేదీ**
**పరిపూర్ణపు బతుకిచ్చేదీ**
**కావాలోయ్ నవకవనానికి**

**- శ్రీ శ్రీ**

## ప్రత్యేక పరిశోధనా వ్యాసం

# గురజాడ 'కన్యాశుల్కం' - ఆరుద్ర దృక్పథం



**ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు**
✆ 91826 85231




గురజాడ అప్పారావుగారు రచించిన 'కన్యాశుల్కం' నాటకంలోని అనేక విషయాలపై నేటికీ చర్చోపచర్చలు జరుగుతున్నాయి. ఆయన రచనలపై ఎంతోమంది పరిశోధన చేసినట్లే ఆరుద్ర కూడా పరిశోధన చేశారు. అయితే, వివిధ రచనల్లో గురజాడ కన్యాశుల్కం గురించి ఆరుద్ర వ్యక్తం చేసిన అభిప్రాయాలు ఎంతో విలువైనవిగా కనిపిస్తున్నాయి. మౌలికమైన ఆలోచనలకు ప్రేరణలిస్తున్నాయి. గురజాడవారు రాసిన కన్యాశుల్కం తొలి, మలి ప్రతులను పరిశీలిస్తూనే, కన్యాశుల్కం నాటక రచనపై పడిన వివిధ ప్రభావాల్ని ఆరుద్ర గుర్తించే ప్రయత్నం చేశారు. వీటిని ఈ వ్యాసంలో విశ్లేషించే ప్రయత్నం చేస్తాను.

గురజాడవారి కన్యాశుల్కం నాటకం కర్తృత్వ విషయంలో చెలరేగిన చర్చ ఇరవయ్యో శతాబ్ది ఉత్తరార్థం ప్రథమ పాదంలో సాహితీవేత్తల్లో కొంత ఆశ్చర్యాన్నే కల్గించి, అనేక వాదోపవాదాలకు దారి తీసింది. కన్యాశుల్కంపై తొలిసారిగా 1955 మార్చి 13 వ తేదీ నుండి, మే నెల మొదటివారం వరకు ఈ 'చర్చ' కొనసాగింది. ఈ చర్చ ఆంధ్రపత్రికలో ప్రారంభమైనా, సాహితీవేత్తలు మిగతా కొన్ని పత్రికల్లోనూ ఈ విషయాలు ప్రచురించక తప్పని పరిస్థితిని కల్గించారు. ఈ వివరాలన్నీ కె.వి.రమణారెడ్డి 'మహోదయం' లోనూ, ఆరుద్ర

'గురజాడ గురుపీఠం' గ్రంథం (గు.గు.పీ.పు:131-132)లోనూ, మొదలి నాగభూషణశర్మ సంపాదకత్వంలో వెలువడిన 'కన్యాశుల్కం - నూరేళ్ళ సమాలోచనం' బృహద్గ్రంథంలోను స్తూనే ఉన్నాయి.

కన్యాశుల్కం కర్తృత్వంపై వాదోపవాదాలు రావడంతోటే బంగోరె (బండి గోపాల రెడ్డి) ఎంతో పరిశోధన, పరిశీలన, పరిశ్రమ చేసి, విపుల వ్యాఖ్యాన సహితంగా 1969లో 'కన్యాశుల్కం' నాటకాన్ని ప్రచురించారు. దానికి తానే పర్యవేక్షణ వహించినట్లు ఆరుద్ర ప్రకటించుకున్నారు.(గు.గు.పీ.పు:146) "కన్యాశుల్కం రచన ఎవరిది?" అనే వ్యాసం ఆంధ్రపత్రికలో మార్చి 13 వ తేది 1955 న 'జయంతి కుమారస్వామి' పేరుతో అచ్చయ్యింది. దీనిలో గురజాడ కన్యాశుల్కాన్ని ఆంగ్లంలోనే రచించారనీ, కాని తెనిగించింది మాత్రం అప్పారావు కాదనీ, గోమఠం శ్రీనివాసాచార్యులు అనీ ఉన్న వ్యాఖ్యతో సుమారు నెలా పదిహేను రోజుల పాటు చర్చోపచర్చలు జరిగాయి. ఆరుద్ర ఈ చర్చలో పాల్గొంటూ, గురజాడ లేఖల్నీ, డైరీలను చూసి, శ్రీనివాసాచారి అనే పేరు ఉండటాన్ని గమనించానన్నారు. కానీ, ఎక్కడా ఆంగ్లంనుండి తెలుగులోకి అనువదించినవారు శ్రీనివాసాచారి అనేది పేర్కొనలేదని ఆరుద్ర అన్నారు. శ్రీనివాసాచారితో కలిసి నాటకాలు చూడటం, వివిధ సందర్భాల్లో కలిసి మెలసి ఉండటం వంటి విషయాలన్నీ రాసుకున్న గురజాడ, ఈ విషయాన్ని తన 'డైరీల్లో రాసుకోకుండా ఉండడు కదా' అనేది ఆరుద్ర అభిప్రాయం. "గురజాడ అప్పారావు మిగిలిన తెలుగు రచనలకు, కన్యాశుల్కం తెలుగు రచనకూ చాలా తేడా ఉంది. ముఖ్యంగా భాషలో ఉంది. ఈ తేడా" అని జయంతి కుమారస్వామి రాసినదాన్ని పూర్వ పక్షం చేస్తూ ఆరుద్ర "ఇది కొంతవరకూ నిజమేగాని, వారు ఊహించినట్లు కన్యాశుల్కం భాషకూ, అప్పారావుగారి తదనంతర రచనలకూ మరీ అంత తేడాలేదనీ, ఈ విషయమై పరిశోధన చేస్తున్నాను" అన్నారు. (ఆరుద్ర, కన్యాశుల్కం రచన ఎవరిది? (వ్యాసం), కన్యాశుల్కం- నూరేళ్ళ సమాలోచనం, (సం.లు.) మొదలినాగభూషణ శర్మ, ఏటుకూరి



ప్రసాద్, 1999, పు:6.) మరో వ్యాసంలో 'ఎవరు ఈ గోమఠం శ్రీనివాసాచార్యులు' అంటూ "అప్పారావు గారికీ ఆచార్యుల గారికీ స్నేహం లేకపోతే అసలు అనువాదం చేయడమన్నది పొసగదన్న అభిప్రాయంతో ఆ పరిశోధన చేశాను" అని పేర్కొన్నారు. వావిళ్ల వారి దగ్గర ఇంకా వివరాలున్నట్లు పత్రికాముఖంగా ప్రకటించడంతో ఆరుద్ర స్వయంగా వెళ్ళి కలిశారు. అయినా సాక్ష్యాధారాలేమీ బయటపెట్టలేదన్నారు. ఇక, గురజాడ రచనల్ని, గోమఠం శ్రీనివాసాచార్యుల రచనల్ని పరిశీలించి, భాషాశైలిని బట్టి, ఎట్టి పరిస్థితుల్లోనూ 'కన్యాశుల్కం' తెలుగులోకి అనువదించింది గోమఠం వారు కావడానికి వీలులేదనే నిర్ణయానికొచ్చారు. "ఈ పరిశోధనలో వావిళ్ళ వారు చేసిన ఒక గొప్ప ద్రోహాన్ని గుర్తించా"నని ఆరుద్ర ప్రకటించారు. సాహిత్య ద్రోహాలను ఎందుకు చేశారంటే అది వేరే కథ, కారణాలు మనం ఊహించాలే కాని, ఎవరూ చెప్పరన్నారు.(గు.గు.పీ.పు:46). అది కాపీరైట్ కి సంబంధించిన విషయంగా స్ఫురింప జేశారు. ముత్యాల సరాలే కాకుండా, 'నీలగిరి పాటలు' కూడా కలిపి చిన్న పుస్తకంగా అచ్చువేసి, దానిలో గోమఠం శ్రీనివాసాచారి రచనల్ని కూడా కలిపేసి, పుస్తకానికి అప్పారావు కర్తృత్వమే వావిళ్ల వారు ప్రకటించారన్నారు.(గు.గు.పీ.పు:45). 1969లో బంగోరే 'గురజాడ కన్యాశుల్కం' తొలి ప్రతిని విపుల వ్యాఖ్యానంతో ప్రచురించినప్పుడు 'కన్యాశుల్కం' కర్తృత్వానికి సంబంధించిన అసలు రహస్యాన్ని ఆరుద్ర బయటపెట్టారు.

1955 ఎన్నికల్లో శ్రీశ్రీ పాల్గొన్నారు. ఆయన ఆ ఎన్నికల 'కోలాహలం-హాలాహలాన్ని' తట్టుకోలేకపోవడంతో ఆయన్ని ఒక ఆసుపత్రిలో పెట్టి కొంతమంది చికిత్స చేయించారు. శ్రీశ్రీ పై వస్తున్న దూషణ సాహిత్యం ఆపడానికి మిత్రులు ఓమార్గాన్ని ఆలోచించి, ఒక తీర్మానాన్ని పత్రికలకు పంపారు. రాజకీయాలకు దూరంగా ఉన్నప్పటికీ, దానిలో, ఆరుద్ర సంతకం చేయకపోయినా, తాను సంతకం చేసినట్లు పేరు రావడంతో ఆరుద్ర స్పందించారు. తాను ఆ

1955 ఎన్నికల్లో శ్రీశ్రీ పాల్గొన్నారు. ఆయన ఆ ఎన్నికల 'కోలాహలం-హాలాహలాన్ని' తట్టుకోలేకపోవడంతో ఆయన్ని ఒక ఆసుపత్రిలో పెట్టి కొంతమంది చికిత్స చేయించారు.

ప్రకటనపై సంతకం పెట్టలేదని ఆరుద్ర పత్రికలకు లేఖలు రాశారు. ఆరుద్రకు జరిగిన అన్యాయానికి జలసూత్రం రుక్మిణీనాథశాస్త్రికి బాధ కలిగి, తనకు మేలు చేయబోయి అభిమన్యుడిలా అతడీ పద్మవ్యూహంలో ఇరుక్కొన్నారని ఆరుద్ర బాధపడ్డారు. దీనికి ప్రతీకారం చేయాలని భావించి చాలా కాలం కిందట వావిళ్ళ శాస్త్రులు చెప్పిన కన్యాశుల్కం నాటకాన్ని శ్రీనివాసాచారి రాశారనే స్కాండల్, జలసూత్రం రుక్మిణీనాథ శాస్త్రి పుట్టించడంతో, 'గురజాడ కర్తృత్వ చర్చ మొదలైందని, దాని నేపథ్యాన్నంతటినీ ఆరుద్ర వివరించారు.(గు.గు.పీ.పు:43-44).

**ఆరుద్ర 'గురజాడ' కన్యాశుల్కం విషయంలో జరిగిన చర్చలు, వాదోపవాదాలు జరుగుతున్న 'కన్యాశుల్కం' రచన ఎవరిది?'**

ఆరుద్ర 'గురజాడ' కన్యాశుల్కం విషయంలో జరిగిన చర్చలు, వాదోపవాదాలు జరుగుతున్న 'కన్యాశుల్కం' రచన ఎవరిది?' వంటి వ్యాసాల్ని చూస్తే, తర్వాత అనేక మంది అనేక వ్యాఖ్యానాల్ని ఆధారాల్ని చూపిస్తూ, వాదోపవాదాలు కొనసాగించడం వల్ల ఏమైనా కొత్త విషయాలు బయట పడతాయేమోననే 'పరిశోధన ఆశ' ఉండవచ్చునేమో గాని, ఆరుద్రగారి ఆ పద్ధతి సరైంది కాదనిపిస్తుంది. 'కన్యాశుల్కం-నూరేళ్ళ సమాలోచనం' సంకలన గ్రంథంలో, సంపాదకుడు మొదలినాగభూషణ శర్మ ఈ విషయాన్ని వ్యాఖ్యానిస్తూ "చివరకు ఆ నాటకం ఆసాంతమూ అప్పారావుదేనని వేంకటేశ్వర శాస్త్రి ఒప్పుకోలుతో యీ వాద ప్రతిపాదనలు ముగిశాయి. దీని నేపథ్యాన్ని గురించి బంగోరె పుస్తకానికి రాసిన "అభిఘారము" లో వివరంగా చర్చించారు ఆరుద్ర. అయినా ఒక మహాకావ్యాన్ని గురించి దాని రచయితను గురించి, మరొకరికెవరికో న్యాయం చెయ్యడం కోసం అయినా, దీనివల్ల కొంతమంచి జరిగిందని ఒప్పుకోక తప్పదు" అన్నారు. (పుట:13) ఈ పరిశోధనలో ఆరుద్ర పరిశోధన గురించి ఆలోచిస్తే, ప్రచురణ కర్తలు కొంతమంది చేసే పనిని బయట పెట్టడం, అలాంటి వాటిని కొంతమంది గుడ్డిగా సమర్థించడం, వ్యతిరేకించడం, వాటికి ఏవో కొన్ని ఉపపత్తులు చూపడానికి ప్రయత్నిస్తారని నిరూపించినట్లు తెలుస్తుంది. అయితే, ఆరుద్ర కూడా "గుడ్డి" గానే "గోమఠం" గురించి పరిశోధించినట్లేనా?

అనిపిస్తుంటుంది. కానీ, గోమఠం వారి "ప్రమేయం" ఏదీ లేదని సాక్ష్యాధారాలతో నిరూపించడానికి, తనూ పరిశోధన చేస్తూ, ఆ వివరాల్ని ఎప్పటికప్పుడు ప్రకటిస్తూ వచ్చారని కూడా అవగతమవుతుంది. షేక్స్పియర్ వంటి నాటక కర్తలకూ ఇలాంటి 'కర్తృత్వ వివాదాలు' తప్పలేదు. కనుక, కొంతమంది ప్రచురణ కర్తలు 'జలసూత్రం' వంటి వాళ్ళను భవిష్యత్తులో "కన్యాశుల్కం" పట్ల వినియోగించుకొని, లాభపడటానికి అవకాశం లేకుండా, సాహితీవేత్తల్లో అనుమానాలు రేకెత్తకుండా ఉండడానికి 'చాలమందిని' పరిశోధన చర్చల్లో పాలుపంచుకొనేటట్లు చేయడానికి ఆరుద్ర చేసిన ఈ పరిశోధన ఉపయోగపడిందని భావించవచ్చు.

## కన్యాశుల్కం - నాందీ ప్రస్తావనలు:

గురజాడ "కన్యాశుల్కం" మొదటి ప్రదర్శన జరిగినప్పుడు ముడుంబై వరాహనరసింహస్వామి "నాందీ-ప్రస్తావన" రచించగా, మేడేపల్లి వెంకటరమణాచార్యులు పఠనం చేసినట్లు (కన్యాశుల్కం తొలికూర్పు-1897) సెట్టి ఈశ్వరరావు సంపాదకుడు గా వెలువడిన విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ వారి 1986 నాటి ప్రచురణలో కూడా పీఠికగా పేర్కొన్నారు. దానిలోనే

"కన్యాశుల్క ప్రహసన మకార్షీద్రూపకం మహత్
వ్యాస వంశ జగన్నాథ సహాయోపచితావయమ్" అనే శ్లోకం ఒకటి కనిపిస్తుంది. అంటే "వ్యాస వంశం వాడైన జగన్నాథం కన్యాశుల్కం నాటకానికి సహకారిగా ఉన్నాడని ఈ శ్లోకాన్ని బట్టి తెలుస్తుంది. అయితే అది ఎలాంటి సహాయం అనేది దీనిలో స్పష్టత లేదు. దీన్ని ఆరుద్ర పరిశీలించారు. ఈ 'నాందీ ప్రస్తావన'లను 'బంగోరె' ప్రచురించిన 'కన్యాశుల్కం' ప్రతిలో కొన్ని చారిత్రక ప్రయోజనాల కోసం చేర్చారనీ, అయితే, అవసరాల సూర్యారావు 'మాట- మంతి'లో 'వ్యాసా' వారి పేరు అనువాదంలో వదిలేశారనీ, బులుసు వెంకటరమణయ్య ఈ పేరుని అనువాదంలో పేర్కొన్నారనీ, కానీ, కె.వీరమణారెడ్డి కూడా



ఈ పేరుని పేర్కొనలేదనీ ఆరుద్ర అన్నారు. (గు.గు.పీ.పు:143) "వ్యాసా" వారి పేరెందుకో అనువాదంలో తొలగించినా గానీ, అప్పారావు సమకాలికుల్లో ఒక వ్యక్తి సహాయం చేశాడని పబ్లిక్కుగా చెప్పడం వల్ల గతాన్ని తవ్వవలసి వచ్చిందని, ఆరుద్ర తన పరిశోధనకు గల కారణాన్ని పరోక్షంగా చెప్పారు.

కన్యాశుల్కం ప్రదర్శనకీ, తొలి ప్రచురణకీ అయిదేళ్ళ వ్యవధి పట్టింది. ప్రదర్శన సమయంలో "ప్రస్తావన" లో కొన్ని విషయాల్ని చేర్చడానికి గల కారణాల్ని చెప్పడానికి అంగీకరించడంలో గురజాడ ఆంతర్యాన్ని ఆరుద్ర అన్వేషించారు. 'భావి పరిశోధన వల్ల తప్ప వాస్తవం ఏమిటో తేలదు' (గు.గు.పీ.పు:143) అని ప్రకటించిన ఆరుద్ర, ప్రదర్శనకు బహుశా, సహాయం చేసి ఉంటాడనీ, నాటక రచయితకు కాదనీ తేల్చి, 'కన్యాశుల్క కర్తృత్వం విషయంలో నాకెప్పుడూ సందేహం లేద'న్నారు.(గు.గు.పీ.పు:149).

ఆరుద్ర పరిశోధనలో ఇక్కడ వైరుధ్యభావాలు కనిపిస్తున్నాయి. మొదట ఒక అనుమానాన్ని (ఊహ) రేకెత్తించి, చివరికి కాదనడానికి సరైన ఆధారాల్ని మరిన్ని చూపినట్లయితే, పరిశోధన మరింత శాస్త్రీయంగా ఉండేది.

ఏ పరిశోధనకైనా మొదట కొన్ని ఊహలు(Assumptions) చేయవలసిందే (ఆర్వి.ఎస్.సుందరం, పరిశోధన పద్ధతులు, పు:21.) 'ఆలోచనలు ఊహలుగా పుట్టి, ఊహలుగానే నిలిచిపోతే ఆ పరిశోధన పరిపూర్ణం కాదు. ఆ ఊహను సత్యంగా నిరూపించ గలగాలి. అలాంటప్పుడు ఆ పరిశోధన స్పష్టమైనదిగా భావించడానికి వీలవుతుంది. కానీ, చివర్లో కొన్ని ఆలోచనల్ని, కొన్ని ప్రశల్ని రేకెత్తించడమే అయితే అది సమీక్ష స్వభావంతోనే మిగిలిపోతుందనేది పరిశోధకుల అభిప్రాయం. 'కన్యాశుల్కం - నాందీ ప్రస్తావనల' విషయంలో ఆరుద్ర తన పరిశోధనను మరింత స్పష్టం చేస్తే బాగుండేది. మరికొన్ని అంశాలపై ఆరుద్ర దృక్పథం ఎలా ఉందో చూద్దాం.

### 'కన్యాశుల్కం" రచన - ప్రదర్శనల కాల నిర్ణయం:

కన్యాశుల్కం రచన, ప్రదర్శనల కాల నిర్ణయంలో ఆరుద్ర కింది అంశాల్ని కేంద్రీకరించి పరిశీలన చేశారు.

(I) నాటకం విజయనగరంలో ప్రదర్శించడానికి 1892 ఆగస్టు 13 న సంస్కృతంలో "ప్రస్తావన" రచన చేశారు.

(ii) 'ప్రస్తావన' రచన జరిగిన కొన్నాళ్ళకు ప్రదర్శన జరిగి ఉండవచ్చు.

(iii) 'తెలుగు హార్పు' పత్రిక కన్యాశుల్కం నాటక ప్రదర్శన సమీక్ష 1892 ఆగస్టు 26. దీనిలో 'గత శనివారం' ప్రదర్శించినట్లు ఉంది. "ఆయేడు ఆగస్టు 13 వ తారీఖు మంగళ వారం నాడూ, పదిహేడో తారీఖు, ఇరవై నాలుగో తారీఖూ మాత్రమే 'శనివారం' వచ్చాయి. ఈ రెండింటిలో ఏదో ఒక రోజున, బహుశా 24 వ తారీఖున ప్రదర్శన జరగవచ్చు" (గు.గు.పీ.పు:34, 145) అని ఆరుద్ర ఒక నిర్ణయానికొచ్చారు. కానీ, 'కన్యాశుల్కం' సెట్టి ఈశ్వరరావు 1892 ఆగస్టు 13 న ప్రదర్శన జరిగినట్లు పేర్కొంటున్నారు. (సెట్టి ఈశ్వర రావు.గురజాడ కన్యాశుల్కం(1897), తొలి కూర్పు, 1986, పు:5.)

నరాల వీరయ్య చారిత్రక, సామాజిక విశ్లేషణతో కె.వి.రమణారెడ్డి, ఆరుద్ర అభిప్రాయాల్ని పూర్వ పక్షం చేసి 1887-1892 సంవత్సరాల మధ్యలో గురజాడ అప్పారావు నాటక రచన ప్రారంభించి, పూర్తి చేశారని చెప్పడం సమంజసమన్నారు. (నరాల వీరయ్య, కన్యాశుల్కం తొలి, మలి కూర్పుల తులనాత్మక పరిశీలన, పు:68.) నాటక ప్రదర్శన విషయంలో 1892 నాటి గురజాడ డైరీలో ఆ విషయం రాసి ఉండాలనీ, పూర్తి డైరీ విశేషాలు లభ్యమైతేనే నూతనాంశాలు బయట పడగలవనీ నరాల వీరయ్య అన్నారు.



గురజాడ తన గొప్పతనం చెప్పుకోవడానికి గ్లాడ్‌స్టన్‌ని ప్రస్తావించాడనీ, అందువల్ల, గ్లాడ్‌స్టన్ కాలాన్ని నిర్ణయించడానికి ఆరుద్ర ప్రయత్నించి, కన్యాశుల్కం రచనా కాలాన్ని ఊహించడానికి గల అవకాశాల్ని వెదికారు. బ్రిటీష్ ప్రధాని గ్లాడ్‌స్టన్ 1868 నుండి 1892 వరకూ ప్రధాన మంత్రిగా ఉండటం వల్ల గిరీశం గ్లాడ్‌స్టన్ పేరుని వాడటాన్ని బట్టి 1892 లోనే నాటకాన్ని పూర్తి చేసివుండవచ్చన్నారు. అయితే, ఈ నిర్ణయం అంత సమంజసంగా, హేతుబద్ధంగా కన్పించడం లేదు. కానీ, గ్లాడ్‌స్టన్ కాలంలోనే ఈ రచన పూర్తి చేశారనేది ఆరుద్ర పరిశీలనలో ప్రధాన ప్రతిపాదనగా తెలుస్తుంది. దీనితో పాటు, ఆనంద గజపతితో గల గురజాడ స్నేహాన్ని కూడా చారిత్రక సంఘటనలతో పరిశీలన చేశారు. 1-2-1888 నాటి గురజాడ డైరీని అనుసరించి 1887 నుండి ఆనంద గజపతితో గురజాడకు స్నేహం పెరిగిందని

తెలుస్తుందన్నారు. చెన్నపురి శాసన మండలిలో 'కన్యాశుల్కం బిల్లు' శాసన సభ్యుడిగా ఆనందగజపతి ప్రవేశపెట్టడం, ఆ బిల్లు చట్టంగా రూపొందకుండా పళ్ళె చంచలరావు, సుబ్రహ్మణ్య అయ్యరు అడ్డు పడటంతో చట్టంగా రూపొందడంలో వైఫల్యం పొందడం, దీనికి ప్రజాభిప్రాయాన్ని సేకరించవలసిన అవసరాన్ని గురజాడ గుర్తించి, రచనకు పూనుకున్నారని ఆరుద్ర చెప్పారు.(గు.గు.పీ.పు:66). అందువల్ల కన్యాశుల్కాన్ని 1892 జూన్, జూలై నెలల్లో మొదలు పెట్టి పూర్తి చేసి ఉంటారు. నాటకం తయారైన వెనువెంటనే స్థానిక సమాజం వారు ఆగస్టులో ప్రదర్శించారని తలంచవచ్చు. ఒద్దికలకు మహా అయితే రెండు మూడు వారాలు పట్టి ఉండొచ్చు. నాందీ-ప్రస్తావనలను రచించిన తేదీ నాటికి ఒద్దికలు ఒక దారిలో పడ్డాయని కూడా ఊహించవచ్చునని ఆరుద్ర అన్నారు.(గు.గు.పీ.పు:37). ఈ నిర్ణయాలకు ముందు 1885-1887 సంవత్సరాల మధ్య రష్యాతో తెల్లవాళ్ళకు యుద్ధం వచ్చే సూచనలు కన్పించడం వల్లా, ఆ మాటలే నాటకంలో ఉండడం వల్లా, ఈ మధ్యకాలంలోనే నాటక రచన జరిగి ఉండవచ్చుననే కె.వి రమణారెడ్డి వాదనను ఆరుద్ర పూర్వ పక్షం చేశారు. (గు.గు.పీ.పు:35).



1887 లో కన్యాశుల్కం రచించి, 1892 వరకూ అయిదేళ్ళ పాటు ప్రదర్శించకుండా ఉండరనీ, దీనికి సంతృప్తికరమైన సమాధానాలు లేకపోతే ఆ తేదీని కొట్టి వేయాలని చెప్పి, శంభుచంద్ర ముఖర్జీ వంటి వారి వల్ల సాహిత్య ప్రయోజనాన్ని, సామాజిక చైతన్యాన్ని గురజాడ అవగాహన చేసుకొన్నారనీ ఆరుద్ర అన్నారు. ఆనందగజపతి వారి ప్రత్యేక శ్రద్ధతో చెన్నపట్నం లెజిస్లేటివ్ కౌన్సిల్ లో 'కన్యాశుల్కం' విషయాలు ప్రస్తావించడం, తర్వాత 1889 ఆగస్టు 10 న విజయనగరం డిబేటింగ్ క్లబ్బు ఉపాధ్యక్షుడిగా గురజాడ ఎన్నికవ్వడం వంటివన్నీ జరిగాయి. ఈ క్లబ్బులో జరిగే మేధావుల చర్చల వల్ల నాటి సమాజంలో సాంఘిక సమస్యల్ని ప్రతిబింబించే సరైన నాటకాలు లేకపోవడం వల్ల ప్రజలకి అర్థమయ్యే భాషలో 1892 జూన్, జూలైలో

నాటక రచన ప్రారంభించి, ఆగస్టులో ప్రదర్శనికిచ్చారని ఆరుద్ర చెప్తున్నారు. (గు.గు.పీ.పు:35-37) అయితే, నాటకాన్ని ప్రదర్శించిన అయిదేళ్ళకు గానీ అచ్చువేయించలేదనీ, అది 1897 జనవరిలో నిర్వహించారని కూడా ఆరుద్ర అన్నారు.(గు.గు.పీ.పు:41).

కె.వి. రమణారెడ్డి ఆరుద్ర అభిప్రాయాల్ని నరాల వీరయ్య పూర్వపక్షం చేశారు. తన పరిశోధన వ్యాసం 'కన్యాశుల్కం తొలి, మలి కూర్పుల తులనాత్మక పరిశీలన'లో నరాల వీరయ్య 1980 లో పరిశోధన చేసినా, దాన్ని 1985 మే నెలలో ప్రచురించారు. ఈ సందర్భంగా నరాల వీరయ్య తన పరిశోధన గ్రంథ ప్రచురణని గురజాడ వారి కన్యాశుల్కం ప్రచురణతో పోల్చుకొని అయిదేళ్ళకే పూర్తికావడం యాదృచ్ఛికం అనడంలో అయిదేళ్ళ తర్వాతనే కన్యాశుల్కం ప్రచురణ విషయాన్ని సమర్థించుకొంటున్నారని తెలుస్తుంది. కన్యాశుల్కం రచన, ప్రదర్శనల ప్రతిపాదనల్ని 1969 నాటికే ఆరుద్ర ప్రకటించినా, ఈ వ్యాసాల్నే 'గురజాడ పీఠం' పేరుతో సెప్టెంబర్ 1985 లో గ్రంథంగా ప్రచురించినప్పుడు గానీ, తారీఖుల్లో గానీ ఏ మార్పునీ చేయని ఆరుద్ర, సమగ్ర ఆంధ్ర సాహిత్యంలో బహుశా 1891 లో కన్యాశుల్కం నాటక రచన మొదలు పెట్టి 1892 ఆగస్టు నెలలో జగన్నాథ విలాసినీ నాటక సమాజం వారు ప్రదర్శించడానికి నిశ్చయించారని' రాశారు.(సమగ్ర ఆంధ్ర సాహిత్యం,1 పు:124). దీనిలో కాలనిర్ణయం చేస్తూ 'రచన ఎప్పుడు ప్రారంభించారో, ఎప్పుడు పూర్తి చేశారో ప్రస్తుతం లభిస్తున్న ఆకరాలను బట్టి ఖచ్చితంగా చెప్పలేమనీ, మళ్ళీ, 1892 లోనే కన్యాశుల్కం రచన పూర్తిచేసి ఉంటారని (స.ఆ.సా. 11 వ.సం.పు:144) ఆరుద్ర తన అభిప్రాయాల్ని చెప్పారు. తర్వాత జరిగిన పరిశోధన ఫలితాల్ని దృష్టిలో ఉంచుకొని మార్పులూ, చేర్పులూ చేసి ప్రజాశక్తి ప్రచురణకర్తలు 1991 లో ప్రచురించిన నాటికి ఆరుద్ర భావాల్లో మార్పులు కనిపిస్తున్నాయి. వీటన్నింటికీ తర్వాత అంటే 10-8-1992 లో మందలపర్తి కిశోర్ 'ఉదయం' పత్రికలో కన్యాశుల్కం తొలి ప్రదర్శన గురించి,



కె.వి.రమణారెడ్డి, ఆరుద్ర, సెట్టి ఈశ్వరరావుల అభిప్రాయాల్ని పూర్వ పక్షం చేస్తూ, కన్యాశుల్కం తొలి ప్రదర్శన 13 శనివారమే అయ్యిందన్నారు. అయితే, Telugu Harp పత్రిక సమీక్షకుడి దృష్టిలో గత శనివారం అనేది 1892 ఆగస్టు పదమూడా? ఇరవయ్యా? అన్నది తేలాల్సి ఉందన్నారు. ఇంకా తన ప్రతిపాదనను సిద్ధాంతీకరించడానికి ప్రయత్నిస్తూ, 1892 ఆగస్టు 13 నందన నామ సంవత్సరం శ్రావణ మాసం బహుళ షష్ఠి అవుతోందని, శుభకార్యాన్ని ఆనాడు తలపెట్టలేదనీ, ఆగస్టు 20 త్రయోదశి(పుష్యమీ నక్షత్రం) అవుతుంది. కనుక అది శుభకరమైన, అనువైన మూహుర్తమనీ, అందుచేత 1892 ఆగస్టు 20 వ తేదినే తొలి ప్రదర్శన జరిగి ఉంటుంది. స్పష్టమైన రిఫరెన్సులు లేని పక్షంలో రచనల్లోని అంతర్గత సాక్ష్యాధారాన్ని ఆధారం చేసుకొంటే 'ఆరుద్ర' అభిప్రాయాల్ని అంగీకరించవలసి ఉంటుందని మందలపర్తి కిశోర్ వివరించారు. పరిశోధన గ్రంథానికి 'ముందుమాట' రాస్తూ కె.వి. రమణారెడ్డి "గురజాడ అప్పారావు కలం నుంచి అది ఎప్పుడు వెలువడిందో ఆరుద్ర, నేనూ, చేసి వున్న వ్యూహా నిర్మిత నిర్ధారణలను తోసివేస్తూ, తగిన ఉపపత్తులతోటి తాను మరో (నరాల వీరయ్య) నిర్ధారణ చేయగలిగారంటేనే, తన పరిశోధన చర్విత చర్వణ మనిపించేట్టుగా సాగించలేదని తెలుస్తుందని" ప్రశంసించారు. దీన్ని అనుసరించి కె.వి.రమణారెడ్డి పరోక్షంగా వీరయ్య ప్రతిపాదించిన సిద్ధాంతాన్ని అంగీకరించినట్లు స్పష్టమవుతుంది.

ఈ ప్రతిపాదనల్ని, సిద్దాంతాల్ని పరిశీలించినప్పుడు అందరికీ ఆమోదయోగ్యమైన అంశం 1892 నాటికి కన్యాశుల్కం రచన పూర్తయ్యిందనే తెలుస్తుంది. ఇది ఆరుద్ర పరిశోధనలోనూ కనిపిస్తుంది. అయితే, రచనా కాలంలో కేవలం జూన్, జూలై నెలల్లో ప్రారంభించి, ఆగస్టులోనే పూర్తి చేయడమనేది అసాధ్యమని తోస్తుంది. అందుకనే ఆరుద్ర ఆలోచన, పరిశోధనా పరిణామం సమగ్ర ఆంధ్ర సాహిత్యంలో స్పష్టమవుతూ, ఆయన కొన్ని మార్పులు అంగీకరిస్తున్నట్లు తెలుస్తుంది.

### "కన్యాశుల్కం" – పూర్వోత్తర ప్రతులు : తులనాత్మక విశ్లేషణ :

గురజాడవారి కన్యాశుల్కం రచన 1892 నాటికి పూర్తయి, 1897 కి మొదటి ప్రచురణ పొందింది. 1909 నాటికి రెండవకన్యా శుల్కం ప్రతి రూపొందింది. ఈ మధ్యకాలంలో కన్యాశుల్కం నాటకంలో గురజాడ చాలా మార్పులూ చేర్పులూ చేశారు. రెండింటినీ చదివినట్లయితే, ప్రతి పాఠకునికీ ఈ వ్యత్యాసాలు

తెలుస్తుంటాయి. అయితే, బంగోరె ప్రచురించిన కన్యాశుల్కం (1969) కి ఆరుద్ర రాసిన ముందుమాటలోనే ఈ రెండింటిలోగల పోలికల్ని, తేడాల్నీ వివరిస్తూ, గురజాడ దృక్పథంలో వచ్చిన పరిణామాన్ని తొలిసారిగా గుర్తించారు. ఈ విషయాన్ని బంగోరె, నరాల వీరయ్య కూడా తమ పరిశోధన వ్యాసాల్లో తెలిపారు. రెండు నాటకాల్ని తులనాత్మకంగా పరిశీలించడానికి స్వీకరించిన అంశాలు, వస్తువు, సామాజిక సాహిత్య ప్రభావాలు, పాత్ర చిత్రణలను బట్టి ఆరుద్ర తులనాత్మక పరిశోధనతోనూ పరిశీలించాడు.

**కన్యాశుల్కంలో వస్తువు(ఇతివృత్తం) సంఘ సంస్కరణ (సోషల్ రిఫార్మ్), వ్యవహారిక భాషాభివృద్ధి (స్పోకన్ తెలుగు) అనే రెండింటిని దృష్టిలో పెట్టకొనే ప్రధానంగా గురజాడ ఈ నాటకం రచించారన్నారు ఆరుద్ర**

కన్యాశుల్కంలో వస్తువు(ఇతివృత్తం) సంఘ సంస్కరణ (సోషల్ రిఫార్మ్), వ్యవహారిక భాషాభివృద్ధి (స్పోకన్ తెలుగు) అనే రెండింటిని దృష్టిలో పెట్టకొనే ప్రధానంగా గురజాడ ఈ నాటకం రచించారన్నారు ఆరుద్ర (గు.గు.పీ.పు:2). ఆనాటి సమాజంలో బాల్యవివాహాల నిషేధం పట్ల ఆనందగజపతి కూడా ప్రదర్శించడం, బాల్య వివాహాలు జరుగుతున్నాయనే ఆనాటికి లభించిన లెక్కలూ గురజాడకి వస్తునిర్దేశం చేశాయనీ, అయితే ఆరుద్ర ప్రత్యేకించి చెప్పిన అంశంగా, మొదటి కన్యాశుల్కంలో స్పోకెన్ తెలుగు ఉన్నప్పటికీ, ఆ రచనకు ప్రముఖ ప్రయోజనం సోషల్ రిఫార్మేననీ, అప్పటికి సోషల్ రిఫార్మ్ అంటే, విడో మేరేజీ, ఇన్ఫేంటు మేరేజి (విధవా వివాహాలు, బాల్యవివాహాలు) సమస్యలేననీ, అందుచేతనే నాచికొచ్చిన్ అత్యల్పమని చెప్పారు ఆరుద్ర. కనుకనే మొదటి కన్యాశుల్కంలో మధురవాణి పాత్రకి పెద్ద ప్రాధాన్యం లేదన్నారు. (గు.గు.పీ.పు:3). గురజాడ రచనల్లో ఆనాటికి ఉన్న సాహిత్య ప్రభావం కూడా కన్యాశుల్కం నాటక ప్రక్రియలో రచించటానికి కారణమయ్యిందన్నారు. అప్పటికి, ప్రపంచ వ్యాప్తంగా ఆంగ్లనాటకాల ప్రభావం గురజాడపై పడి ఉంటుందనీ ఆంగ్ల నాటక రీతుల్ని క్షుణ్ణంగా ఆకళించుకున్నారన్నారు. (పు:38). అందుకనే వచనంలో స్పోకెన్ తెలుగుని ఉపయోగిస్తూ, బాల్య వివాహాల్ని నిరసిస్తూ, వేశ్యాసమస్య, వితంతు

సమస్యల్ని సమాజదృష్టికి తెచ్చి, వాటి వల్ల కలిగే అనర్థాల్ని వివరించారన్నారు. ఆనాటికి ప్రపంచ వ్యాప్తంగా సంస్కృత, ఆంగ్ల నాటకాల్ని ప్రదర్శించటం, శ్రీనివాసాచారితో, అప్పారావు వాటిలో చాలావాటిని చూసినట్లు, గురజాడ తన డైరీల్లో సాక్ష్యాలు కనిపిస్తుండటాన్నీ ఆరుద్ర గమనించారు.

## 'కన్యాశుల్కం" లో మధురవాణి పాత్ర చిత్రణ :

కన్యాశుల్కం తొలి, మలి ప్రతుల్లో పాత్రల స్వభావాల్లో వచ్చిన మార్పుల్ని పరిశోధించినట్లు ఆరుద్ర చాలా చోట్ల చెప్పుకున్నారు. ఈ పాత్రల్లో మధురవాణి సౌజన్యరావుల విశిష్టతలను పరిశీలించారు. తులనాత్మక పద్ధతిలో రెండు పాత్రల్లో ఉన్న స్వభావాల్ని విశ్లేషించారు. గిరీశం ఎవరై ఉంటారనే దానికి నాటకంలో గల కొన్ని సంఘటనల్ని ఆధారంగా స్వీకరించి కొన్ని నిర్ణయాలు చేశారు. 'మధురవాణి పాత్ర ఒక పరిశీలన-ఒక పరిశోధన' పేరుతో ఒక వ్యాసాన్నీ, 'పునఃపరిశీలన, పునఃపరిశోధన' పేరుతో ఇంకొక వ్యాసాన్నీ ప్రత్యేకించి మధురవాణి పాత్ర ఔచిత్యాన్ని చెప్పడమే ప్రధాన విషయంగా పేర్కొనగలిగే వ్యాసాలు. వీటితో పాటు మరికొన్ని వ్యాసాల్లోను, ఈ పాత్ర పట్ల తన అభిప్రాయాల్ని ఆరుద్ర వ్యక్తీకరించారు. మొదటి (తొలి) కన్యాశుల్కంలో మధురవాణి ఉన్నా ఆ పాత్రలో జీవం లేదు. ఆమె వేశ్యా శిఖామణి కాదు. మొదటి మధురవాణి పట్ల రచయితకే సద్భావం లేదు. కనుక, మధురవాణి పట్ల పరిశోధన చేస్తేనే గురజాడ అప్పారావు దృక్పథం ఏమిటో, అదెలా మారుతూ వచ్చిందో తెలుస్తుందని ఆరుద్ర వివరించారు. మొదటి మధురవాణి పాత్ర సజీవంగా లేకపోవటానికి, అప్పటికి సమాజంలో వేశ్యాసమస్య పెద్దగా లేకపోవటమేననీ (గు.గు.పీ.పు:3) మొదటి (తొలి) కన్యాశుల్కంలో గిరీశం మరిగిన మహాలక్ష్మి అనే వేశ్యని మధురవాణిగా మార్చాలనే ఆలోచన వచ్చి ఉంటుంది. దానికి కారణం, మహాలక్ష్మి చోటులో మధురవాణిని ప్రవేశపెడితే, రామప్పంతులు ఉంచుకున్న సానిగా మరొక పాత్రని సృష్టించాలా వద్దా? అనే సందేహంలో ఆ రెండు పాత్రల్నీ ఒకటే చేశారన్నారు. (గు.గు.పీ.పు:3) దీని వల్ల కథకి నష్టం కలగలేదు. 'కొండుభట్టీయం' లోని మంజువాణి, 'స్టూపింగ్ టురెయిజ్' ఆంగ్ల కథానాయిక సరళులను పరిశీలించి, మంజువాణి పాత్రలోనుండే తీసుకొని, సరళలోని తెలివిని కలిపి రెండవ మధురవాణిని గురజాడ సృష్టించారని ఆరుద్ర ఊహించారు. (గు.గు.పీ.పు:13) దీనికి తులనాత్మక పరిశీలనగా 'కొండుభట్టీయం' లోని మొదటి దృశ్యాన్నీ రెండవ కన్యాశుల్కంలోని మొదటి దృశ్యాన్ని ఆరుద్ర, తన పరిశీలనకు తీసుకున్నారు. మధురవాణి పాత్రను అప్పారావు జీవితంలో నుంచే తీసుకున్నా, అది ఏ ఒక్క

వ్యక్తికి ఫోటోగ్రాఫు కాదనీ, ఉండవలసిన ఔన్నత్యాన్ని అందుకున్న ఆదర్శమూర్తిగా తీర్చిదిద్దారన్నారు. (గు.గు.పీ.పు:66). ఇది ప్రధానంగా ఆరుద్ర తన పరిశోధనలో మధురవాణి పాత్ర పట్ల చేసిన ప్రతిపాదనలు, వీటిని నిరూపించడంలో ఆరుద్ర ఎంతవరకూ సఫలీకృతులయ్యారో సమన్వయం చేయడానికి కింది విధంగా ప్రయత్నించవచ్చు.

కొండుభట్టీయంలో మంజువాణి పాత్ర స్వభావాన్ని సంభాషణలతో సహా పేర్కొన్నారు. (గు.గు.పీ.పు:4) మంజువాణి ఒక శూద్రపు పిల్ల, పేదరికం వల్ల తనని కొనుక్కొన్న తల్లి రామసాని, కొండుభట్ల దగ్గర వదిలి వేయడమూ, కొన్నాళ్ళ తర్వాత కొండు బొట్లు సానిరికం చేయిస్తూ, విటుల్ని తానే తీసుకొస్తుంటాడు. తెచ్చిన ప్రతివాణ్ణీ తన దగ్గరకి రానివ్వదు. ఒకసారి, ఒక సాహెబుని తెస్తే, అతన్ని దగ్గరకు రానివ్వదు. అతన్ని తెచ్చినందుకు దెబ్బలు కొడితే కొండుభొట్లనే తిట్టమని, తాను మాత్రం తప్పించుకుంటుంది. తనని ఉంచుకొన్న నరహరిరావు పంతులు, అతనే కాకుండా, మరికొంత మంది సరసుల్ని రప్పించుకొన్నావేమని ఆమెను నిలదీస్తే, నేను వేశ్యననీ, నా వృత్తి ధర్మం నేను మానననీ చెప్తుంది. కానీ తన వృత్తి పట్ల ఆమెకి ఏవగింపు ఉంది. రామస్వామి చనిపోగానే రత్నాంగి తనే వేశ్య మంజువాణిని ఆదుకొని, రామసాని చనిపోయినందుకు, లోకం మెప్పుకోసమైనా కన్నీళ్ళు పెట్టమని సలహా ఇస్తే, దానికి మంజువాణి ఒప్పుకోదు. పైగా, ఆ రామసాని చచ్చినందుకు సంతోషించి, ఆమె దాచిపెట్టిన ముప్పైవేలు తీసుకొని, మంజువాణి స్వేచ్ఛగానే బ్రతకాలనుకొంటుంది. అంతేకాకుండా, పంతులు కూడా త్వరగా చావాలనుకొంటుంది. ఈ పరిస్థితుల్లో రత్నాంగి మంజువాణిని చేరదీసి, ఆదరించి, లోకం కోసం కొన్నాళ్ళు పాతతోవలోనే జరగనివ్వమని సలహా ఇస్తే, దానికి అంగీకరించి, అలానే కొనసాగిస్తుంది. దీన్ని గురించి ఆరుద్ర విశ్లేషిస్తూ, మంజువాణి తన గత చరిత్రని తలచుకొంటూ, వర్తమానాన్ని ఏవగించుకొంటూ, భవిష్యత్తు గురించి కలలు కంటుందనీ, ఇవేమీ మొదటి మధురవాణిలో లేవనీ, ఇద్దరిలోనూ డబ్బు సంపాదించాలనే తపన ఉన్నా ప్రతివాళ్ళనీ తన దగ్గరకి రానిచ్చే స్వభావం మంజువాణికి లేదని సాహెబుని నిరాకరించడం ద్వారా నిరూపించి, ఈ విచక్షణాజ్ఞానం, మొదటి మధురవాణిలో లేకుండా, పూర్తిగా ద్రవ్యాశ గలదానిగానే చిత్రితం కావడం గమనించవచ్చునని అన్నారు. (గు.గు.పీ.పు:8).

మంజువాణికి సరసంతో పాటు, మాటకారితనం, కోపం, పెంకితనాలు కూడా ఉన్నాయన్నారు ఆరుద్ర. దీనికి కొండుభట్లు మంజువాణి అందాన్ని పొగిడినప్పుడు "నేను మా పంతులుగారి వెధవప్పగారి కేమాత్రం సాటి" వంటి

> మంజువాణి తల్లి రాక్షస స్వభావం గలదైతే, రెండవ మధురవాణి తల్లి మంచిది! చెడని వారిని చెడగొట్టవద్దని చెప్పడం వల్ల మధురవాణి కృతజ్ఞతకు పాత్రురాలైంది

సంభాషణలవల్ల, మంజువాణి మాటకారి తనాన్నీ; పంతులుగారు, కొండుభొట్లతో జరిగిన సంభాషణలో దానం విషయం వచ్చినప్పుడు సువర్ణదానం వైపుకి సంభాషణను త్రిప్పగలగటం వంటివాటిని సమయస్ఫూర్తి, భాషణాచాతుర్యాలకు నిదర్శనాలుగా ఆయన నిరూపించారు. (గు.గు.పీ.పు:10) ఈ లక్షణాలేమీ మొదట మధురవాణిలో లేవని చెప్పి, ద్వితీయాంకంలో ఒక దృశ్యాన్ని వివరించారు. మొదట మధురవాణికీ, మంజువాణికీ ఎంత భేదం ఉందో, మంజువాణికీ, రెండవ మధురవాణికీ అంత దగ్గర పోలికలు ఉంటాయని చెప్తూనే,(గు.గు.పీ.పు:11) ఇద్దరిలోనూ మానవత్వం, మంచితనం, తమ వృత్తిలో గల హైన్యతను గుర్తించగలగటం ఉన్నప్పటికి, రెండవ మధురవాణే కొన్ని మెట్లుపైన ఉంటుందన్నారు (గు.గు.పీ.పు:12). అది ఎలాగో కింది సమన్వయం వల్ల తెలుసుకోగలిగే అవకాశం ఉంది.

మంజువాణి తల్లి రాక్షస స్వభావం గలదైతే, రెండవ మధురవాణి తల్లి మంచిది! చెడని వారిని చెడగొట్టవద్దని చెప్పడం వల్ల మధురవాణి కృతజ్ఞతకు పాత్రురాలైంది (గు.గు.పీ.పు:12)కానీ, మంజువాణి తల్లి రామసానిని, మధురవాణి ద్వేషించడానికి గల కారణం, ఆమె మంచిది కాకపోవడం. ఇద్దరూ వేశ్యలయినా, డబ్బు సంపాదించడానికే మంజువాణి ప్రయత్నిస్తే, రెండవ మధురవాణి అవసరమైతే విటులకి డబ్బు సహాయం కూడా చేస్తుందనేది కరకటశాస్త్రులకి డబ్బు ఇబ్బందిలో ఉన్నప్పుడు, మధురవాణి తన మెడలో ఉన్న నగల్ని తీసి, ఇచ్చి, అతని అవసరాలకి వాడుకోమనడం నిదర్శనంగా కనిపిస్తుంది. "మొగాడికయినా, ఆడదానికయినా నీతి ఉండాల"నే మాటను రెండవ మధురవాణి పలకడమే ఈ పాత్ర గొప్పతనాన్ని చెప్తుంది. అందువల్లనే ఆరుద్ర, "మంజువాణి" పాత్రలోనించే "రెండవ మధురవాణి"ని గురజాడ సృష్టించారనే ప్రతిపాదన చేయగలిగారు. మంజువాణిలో గల సంభాషణా చాతుర్యాన్ని గ్రహించారని, ఆ చాతుర్యం రెండవ మధురవాణిలో పరిణతి సాధించిందనీ తెలుస్తుంది.

మరో తేడాని ఆరుద్ర వివరిస్తూ రత్నాంగి చెప్పిన మాట ప్రకారం మళ్లీ పాత దారిలోకే మంజువాణి వెళ్ళిపోవడానికి అంగీకరించదనీ, సౌజన్యరావు గారి మాట ప్రకారం వృత్తిని మానలేవా? అంటే, ఆ వృత్తిని మానేసి, చివరికి ఆయనకంటే గడుసుగా వ్యవహరించిన పాత్ర రెండవ మధురవాణి స్టూపింగ్ టురెయిజ్ లో సరళ. ఆమె వేశ్య అయినా, బాగా చదువుకొన్న కళా పిపాస కలిగిన యువతి, ఈ కథ (సంస్కారి) లో కాలేజీ ప్రొఫెసర్ రంగనాథయ్యరు యాంటీ నాచ్ ఉద్యమాన్ని కొనసాగించడం వల్ల ఆయన్ని కలవాలని ప్రయత్నించి, పలకరింపులు, పరిచయాలు, రోజూ సంభాషణలు కొనసాగించగలిగే వరకూ వెళ్లిన తర్వాత, సరళ తన జీవిత వ్యథని చెప్పి, తనని ఏ మర్యాదస్తుడు పెళ్ళి చేసుకొంటారో చెప్పండని ఆయన్నే అడగటం, ఆమె మేధోవికసనాన్ని తెలుపుతుంది. ఈ తెలివితేటల్ని రెండవ మధురవాణిలో గురజాడ ప్రవేశపెట్టారనీ ఆరుద్ర విశ్లేషించారు.

> ఈ రెండు పాత్రల్నీ, ఈ సన్నివేశాన్నీ, ఈ సమస్యనీ తీసుకొని అప్పారావు రెండవ కన్యాశుల్కంలోని చివరి అంకం, చివరి దృశ్యాన్ని రాశారు

ఈ రెండు పాత్రల్నీ, ఈ సన్నివేశాన్నీ, ఈ సమస్యనీ తీసుకొని అప్పారావు రెండవ కన్యాశుల్కంలోని చివరి అంకం, చివరి దృశ్యాన్ని రాశారు. ఈ దృశ్యంలోనే మధురవాణిలో గల బుద్ధివికసనం మనకి బోధపడుతుంది, అందులోనే ఆమె నాచికొచ్చెన్ పునాదినే పెకలించగలిగడమే కాకుండా, సౌజన్యరావుతో చర్చించగలిగింది. సరళే మధురవాణిలోనూ, రంగనాథయ్యరే సౌజన్యరావులోనూ పరిణిత పాత్రలుగా కనిపిస్తున్నాయని ఆరుద్ర విశ్లేషించారు.(గు.గు.పీ.పు:17). తాను ప్రతిపాదించిన మొదటి మధురవాణి, మంజువాణిలో సరళలో ఎలా పరిణామం చెందిందో నిరూపించి, ప్రొఫెసర్ రంగనాథయ్యర్ గారి కన్నా ఉన్నతమైన పాత్ర ప్లీడరు సౌజన్యరావులోనూ కనిపిస్తున్నారని అన్నారు. (గు.గు.పీ.పు:17) "అందరికన్నా మహోదయమైన పాత్ర మధురవాణిది, నేనే ఆమెను చూసి భ్రమసి పోతున్నాను" అని గురజాడ అప్పారావు ఒక లేఖలో ఆశ్చర్యపోవడంలో నిజమైన స్వారస్యం ఉందన్నారు.(గు.గు.పీ.పు:20). ఆరుద్ర తులనాత్మక పరిశోధనను తెలుసుకోవడానికి గురజాడ వారి కన్యాశుల్కంలో వస్తు, పాత్రల విశ్లేషణలను చక్కని పరిశీలనగా పేర్కొనవచ్చు. ఇవేకాకుండా, కన్యాశుల్కం

నాటకాన్ని, కందుకూరి వీరేశలింగం 'బ్రాహ్మవివాహం' తోనూ తులనాత్మకంగా పరిశీలించడం వల్ల కూడా ఆరుద్ర తులనాత్మక పరిశోధనా పటిమ తెలుస్తుంది.

### 'కన్యాశుల్కం' - 'బ్రాహ్మవివాహం' : తులనాత్మక పరిశీలన :

గురజాడ 'కన్యాశుల్కం' నాటకాన్ని రాసిన నాటినుండి రెండవ ప్రతి (మలి ప్రతి) ప్రచురణ చేసే నాటి వరకూ చేర్పులూ, మార్పులూ చేశారని తొలి, మలి ప్రతుల్ని గమనించినవారికి తెలుస్తుంది. అయితే, గురజాడ 'కన్యాశుల్కం' రాసేనాటికే కందుకూరి వీరేశలింగం 'కన్యాశుల్కం' బ్రాహ్మవివాహం ప్రహసనాన్ని రచించారు. ఆరుద్ర వీటి మధ్యగల పోలికల్ని, తేడాల్ని తులనాత్మకంగా పరిశీలించారు. ఒక అంశంలో గల అంశాలకే పరిమితం చేసి ఆరుద్ర ఈ పరిశీలన కొనసాగించారు.(గు.గు.పీ.పు:47).

'బ్రాహ్మవివాహం' పీఠికలో ఏ అంకంలో, ఏ దురాచారాన్ని ఖండించారో వీరేశలింగం వివరించారు. ఆ విషయాల్ని ఆరుద్ర కూడా పేర్కొన్నారు. కానీ, ఆ వివరాల్ని పేర్కొనలేదు. కందుకూరి వారి పీఠికలో ఉన్న దురాచారాలు ఏమిటో గమనిస్తే, కన్యాశుల్కం తీసుకొని పెళ్ళిళ్లు చేయటం వల్ల వచ్చే అనర్థాల్ని సూచనగా చెప్తుందన్నారు. మొదటి అంకంలో కొంతమంది భార్యాభర్తల మధ్య ఉండే ఐకమత్యభావన ఎలాంటిదో తెలుపుతుందని అన్నారు. బ్రాహ్మ వివాహంలోని ఈ అంకాన్ని గురజాడ తొలి, మలి ప్రతుల్ని ఆరుద్ర తన పరిశీలనకు తీసుకున్నారు.

అజ్ఞానమ్మ తన రెండేళ్ల కూతుర్ని, తన నలభై ఏళ్ల మేనల్లుడికిచ్చి పెళ్లి చేయాలనుకొంటుంది కానీ, భర్త కామయ్య ధనాశ వల్ల, భార్యని వ్యామోహంలో పడేసి పట్టెమంచం, పరుపు కొనుక్కోవచ్చనీ, నగలు చేసుకోవచ్చుననీ, నాలుగో పెళ్లికి సిద్ధమైన ధనవంతుడైన పెద్దింటి పెద్దయ్యకిచ్చి పెళ్లిచేయాలని భావిస్తే, దానికి అజ్ఞానమ్మ అంగీకరిస్తుంది. మొదటి కన్యాశుల్కంలో వెంకమ్మ కూడా మేనరికం ఇవ్వాలని ఎంతో పట్టు పడుతుంది. అజ్ఞానమ్మకీ, వెంకమ్మకీ మధ్యగల పోలిక ఇంతే అని అన్నారు ఆరుద్ర. (గు.గు.పీ.పు:48).

రెండవ కన్యాశుల్కంలో వెంకమ్మ పాత్రచిత్రణలో గురజాడ ఎంతో జాగ్రత్తను తీసుకున్నారని, దీని కోసం, గిరీశం, వెంకటేశం పాత్రల్లోనూ వైవిధ్యం కల్పించారనీ, కన్యాశుల్కంలో వెంకమ్మ తన కూతురి కోసం చివరికి నూతిలో పడటానికైనా వెనుకాడకపోవటం, అన్నంత పనీ చేస్తుందేమోనని, తన

సోదరుడు కరకట శాస్త్రులు 'నాటకం' ఆడవలసి వచ్చిందన్నారు. వెంకమ్మ పాత్ర, 'బ్రాహ్మవివాహం' లో అజ్ఞానమ్మ వంటిది కాదనీ, ఉదాత్తమైందని ఈ పోలికల్ని, తేడాల్ని సోదాహరణంగా వివరించారు (గు.గు.పీ.పు:50). ఇంకా, రెండింటిలో గల తేడాల్ని బాల్యంలో వివాహం చేయడానికీ, పెద్ద వాళ్లకిచ్చి పెళ్లి చేయడానికి చెప్పే హేతువుల్ని వివరించి చూపారు (గు.గు.పీ.పు: 50-52).

వీరేశలింగం 'బ్రాహ్మవివాహం' 'కన్యాశుల్కం' లలో కన్యాదానం శిష్టాచారంగా ఉందని చెప్పేందుకు కొన్ని శ్లోకాల్ని వివరించడం కనిపిస్తుంది. ఇంచుమించు ఇటువంటి హేతువుల్నే మొదటి కన్యాశుల్కంలో చెప్పించడం కనిపిస్తుంది. కన్యాశుల్కం శిష్టాచారమని అగ్నిహోత్రావధాని నమ్మకంగా, సౌజన్యరావు పంతులు ప్రశ్నకి సమాధానం చెప్తాడు. వాటిని వివరించి, 'బ్రాహ్మ వివాహం' ప్రభావం అప్పారావు మీద అతి స్వల్పంగానే ఉన్నట్లే, మొదటి కన్యాశుల్కం అచ్చుపడ్డాక ఆ గ్రంథం కొద్దిగా వీరేశలింగం మీద పనిచేసిందని స్పష్టం చేశారు. (గు.గు.పీ.పు:52). కందుకూరి వీరేశలింగం 1897 లో రాసిన 'కన్యాశుల్కం' అనే ప్రహసన తుల్య సంభాషణ రాశారనీ, దాన్ని పేర్కొని, అది ఒక రకంగా అప్పారావు కన్యాశుల్కం పీఠికకు వ్యాఖ్యానం అని చెప్పవచ్చునని నిరూపించారు. కడుపులో వున్న శిశువులను సైతం అప్పుడప్పుడూ అడగడానికి కొంతమంది వస్తున్నట్లు గురజాడ 'కన్యాశుల్కం' పీఠకలో కన్యాశుల్కం వివరాల్ని రాశారు. దీన్ని కందుకూరి కన్యాశుల్కం ప్రహసనానికి రాసిన సంభాషణతో పోల్చి, ఇవన్నీ అప్పారావు పీఠికలో ఒక వాక్యానికి వ్యాఖ్యానం అని ముగించారు ఆరుద్ర (గు. గు.పీ.పు:54).

ఈ పరిశీలనలో ఆరుద్ర తులనాత్మక పరిశీలన కనిపిస్తుంది. అయితే, ఆరుద్ర పేర్కొన్నట్లు 'బ్రాహ్మవివాహం' ప్రభావం గురజాడ మీద ఉన్నప్పటికీ, కందుకూరి వారు 'బ్రాహ్మవివాహాన్ని' వినోదం కోసమే కాకుండా వృద్ధవివాహం, 'కన్యాశుల్కం' దురాచారాల నుండి ప్రజల్ని విముఖుల్ని చేయాలనే తలంపుతో రాసినట్లు చెప్పుకున్నారు. దీన్ని బట్టి 'వినోదం' ప్రధాన ఆశ్రయంగానూ, దురాచార నిర్మూలన ద్వితీయ ప్రాధాన్యతలోనూ కనిపిస్తుంది. ఇక్కడ దురాచార నిర్మూలన ప్రధాన ఆశయంగానూ, వినోదం ద్వితీయ ప్రాధాన్యంగా గురజాడ వారు ఆశించటం గమనించవలసిన అంశం. దీన్ని పాఠకులకు తెలియజేయడంలో

ఆరుద్ర మరింతగా కృతకృత్యుడయ్యాడనిపిస్తుంది. గురజాడ, కన్యాశుల్కం నాటకం గురించి ఆరుద్ర చేసిన పరిశోధనల్ని గమనిస్తే ప్రచురణకర్తల వ్యూహాలు తెలుస్తాయి. కన్యాశుల్కం నాటకం ప్రదర్శన సమయంలో 'నాందీ ప్రస్తావన'లను కొన్ని చారిత్రక ప్రయోజనాల కోసం చేర్చారనీ స్పష్టమవుతుంది.

ఆధారాలు:


1. ఆరుద్ర. గురజాడ గురుపీఠం, విజయవాడ: నవోదయ పబ్లిషర్స్,1985.
2. గురజాడ. గురజాడ జాబులు- జవాబులు దినచర్యలు,(సం) సెట్టి ఈశ్వరరావు. హైదరాబాదు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 2000.
3. నరసింహారావు, ఆర్. అభ్యుదయ కవిత్వంలో ఆరుద్రత, హైదరాబాదు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్: 1992.
4. నాగభూషణ శర్మ మొదలి, ప్రసాద్, ఏటుకూరి(సం) కన్యాశుల్కం-నూరేళ్ళ సమాలోచనం. హైదరాబాదు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్,1994.
5. వీరయ్య, నరాల. కన్యాశుల్కం, తొలి-మలి కూర్పుల తులనాత్మక పరిశీలన. తిరుపతి: సునందా పబ్లికేషన్స్, 1994.
6. సంగయ్య, ఎల్. ఆరుద్ర జీవితం - రచనలు సమగ్ర పరిశీలన,నందిగామ: మాధురీ ప్రచురణలు,1991.
7. శ్రీ.శ్రీ మన గురజాడ, (కూర్పు: చలసాని ప్రసాద్), విశాఖపట్టణం: విరసం ప్రచురణలు, 1988.
8. శ్రీ.శ్రీ. మహాప్రస్థానం,(తొ.కూ.1940.) ( కూర్పు: చలసాని ప్రసాద్) విశాఖపట్టణం :విప్లవ రచయితల సంఘం, ఆంధ్ర ప్రదేశ్ ప్రచురణ,1999.
9. ప్రజాసాహితి కన్యాశుల్కం ప్రదర్శన శతజయంతి సంచిక (మాసపత్రిక) (సం) నిర్మలానంద.

# పాప చేతుల్లో ఉన్నప్పుడు



పలమనేరు బాలాజీ
94409 95010

పాప చేతుల్లో ఉన్నప్పుడు
లోకంతో పనే ఉండదు
ఇంకెవరూ కనపడరు,
మరెవరూ వినిపించరు
ఆ రెండు చిన్ని కళ్ళు చాలా మాటలు చెబుతాయి
ఆ కళ్ళు ఎవరి కళ్ళనూ తిప్పుకోనీయవు
ఎదుటి మనిషిని ఎటూ కదలనియ్యవు

లోకం మొత్తం ఆ కళ్ళల్లోనే ఉందేమో..
అమ్మానాన్న లేని వాణ్ణి కదా
వాళ్ళ ప్రేమలన్నీ ఆ రెండు చిన్ని కళ్ళల్లోనే వర్షంలా
కురుస్తుంటే..
ఎటూ కదల్లేను.
'లతికా...' అని పిలుస్తుంటే
ఏదో తెలిసినట్టు,
అంతా అర్థమైనట్టు
తను నవ్వుతుంది.
కళ్ళనిండా, మొహం నిండా,
చేతుల నిండా నవ్వులే నవ్వులు.
ఆ నవ్వుల ముందు
ఆ దయార్ద్ర చూపుల ముందు
ఆ ప్రేమైక తల్లి ముందు
నేను తాతనే అయ్యానో,
పసిబిడ్డనే అయ్యానో తెలీదు.

విసుగు, అలసట, దుఃఖం
అన్నీ ఆక్షణంలో
ఆవిరైపోతాయి.

★★★

బిడ్డలందరూ తండ్రులైనట్టే
తండ్రులందరూ తాతలవుతారు
ఆ తాతలందరూ మళ్ళీ
చిన్న బిడ్డలయ్యేది
మనవడి ముందు, మనవరాలి
ముందే కదా!

★★★

పునర్జన్మలు తెలియవు కానీ,
మా అమ్మ మళ్ళీ అట్లా మా
ఇంటికి తిరిగివచ్చినట్టే ఉంది..
ఆ పాప మొహంలోఅదే
అమ్మతనం
ఆ పాప మొహంలో అదే దయ,
ప్రేమ
ఆ పాప మొహంలో అదే
వాత్సల్యం, కరుణ!

అందుకే మనవరాలు చేతుల్లో
ఉన్నప్పుడు–
మలినాలన్నీ మాయమైపోతాయి.

పాప చేతుల్లో ఉన్నప్పుడు
మనసు పైన వర్షం కురిసినట్టు
కలతలు దుఃఖాలు బాధలు అన్నీ
ఎటో కొట్టుకుపోయి,
నేను తేలికైపోతాను,
మళ్లీ పసివాడినైపోతాను.

పాప చేతుల్లో ఉన్నప్పుడు
మనం మళ్ళీ పిల్లలమైపోతాం
మనం మళ్ళీ మనుషులైపోతాం!

రోజు మొత్తం బ్రతకలేని వాళ్లు
బ్రతకడానికి రోజంతా తీరిక లేని
వాళ్ళు
రోజంతా దిక్కుతోచకుండా
పనిచేసే వాళ్లు,
పరమ రద్దీగా నిరంతరం
ఎటో అటూ కదిలే వాళ్ళు
కాస్త తీరిక చేసుకోవాలి..

... రోజులో ఒక్కసారైనా
ఎవరి పాపనైనా సరే
చేతులారా ఎత్తుకోవాలి
ఆ లేత కళ్ళల్లోని తడిని చూడాలి
జీవితం ఎందుకో 'ఏమిటో ఎట్టానో
అప్పుడు కదా తెలుస్తుంది!
అసలు బ్రతుకంటే 'ఏమిటో అప్పుడు
కదా తెలుస్తుంది!

పాప చేతుల్లో ఉన్నప్పుడే– కదా
మనం మనుషులం!

పరిశోధనా వ్యాసం

# ఆధునిక తెలుగుపై గిరీశం భాషా ప్రభావం



ఆచార్య అయినవోలు ఉషాదేవి
85005 24879




గిరీశం గురజాడ అప్పారావు గారి 'కన్యాశుల్కం' లో ఒక ముఖ్యమైన పాత్ర. వందేళ్లకు మించి ఎక్కువ కాలమే ఐనప్పటికీ గిరీశం తెలుగు సమాజంలో సజీవంగానే ఉన్నాడు. కన్యాశుల్కం నాటకంలో గిరీశం భాషా ప్రయోగం, తర్వాత కాలపు తెలుగు వారిపై దాని ప్రభావం వివరించడమే ఈ వ్యాసం ప్రధాన ఉద్దేశ్యం.

గిరీశం ఎక్కడ చదువుకున్నాడో, ఏం చదువుకున్నాడో నాటకంలో ఎక్కడా స్పష్టంగా చెప్పబడలేదు. కానీ పూనా (పుణె) లాంటి ప్రాంతాలు చూసాడని అతని మాటల వల్ల తెలుస్తుంది. అయితే అతనికి యౌవనం వచ్చేసరికి పని చెయ్యకుండా, తన బతుకును సుఖంగా గడపగల నేర్పు, మాటలతో మభ్యపెట్ట గల చాతుర్యం మాత్రం బాగా పట్టుబడింది

గిరీశం పాత్ర ద్వారా గురజాడ అప్పటి కాలానికే కొందరు ఇంగ్లీష్ చదివిన తెలుగువారిలో కనపడే అవకాశ వాదాన్నీ, చాపల్యాలనూ, వ్యతిరేక లక్షణాలను, సంపాదించుకున్న కొద్దిపాటి జ్ఞానాన్ని స్వప్రయోజనాలకై సమర్థవంతంగా ఉపయోగించుకోగల కుటిల బుద్ధి , తెలియని విషయాలను కూడా తెలిసినట్లు ఒప్పించి, ఎదుటివారిని అంగీకరింప చేసేందుకు గానూ అవతలి వారి అజ్ఞానాన్ని

గ్రహించ గల నేర్పు, సందర్భోచితంగా దేశంలోని ప్రముఖుల పేర్లు వాడుకోగల చాకచక్యం, తన స్వార్థం కోసం తర్కాన్ని ఎటు హంగుగా ఉంటే అటు అమోఘంగా వినియోగించ గల చాతుర్యం, జిత్తులమారితనం, ఇతరుల డబ్బుని నిర్లజ్జగా అనుభవించ గల సోమరితనం – ఈ అన్ని లక్షణాల సాకార రూపమే గిరీశం. ఇలాంటివాడు నాటకంలో ఏ రకమైన తెలుగు మాట్లాడాడు? ఎట్లాంటి భాషాప్రయోగం చేసాడు? ఏ విధంగా అది ఆధునిక తెలుగుపై ప్రభావం చూపింది – సోదాహరణంగా చూపటమే ఈ వ్యాసంలోని ప్రధానాంశం.

**ఆంగ్లేయుల పాలనలో ఉన్న దేశంలో ఆంగ్ల మాధ్యమంలోనూ, లేదా దేశీయ మాధ్యమాల్లో ఆంగ్లం ఒక సబ్జెక్టు గానూ బోధించటం ప్రారంభమైన 19వ శతాబ్దంలో...**

ఆంగ్లేయుల పాలనలో ఉన్న దేశంలో ఆంగ్ల మాధ్యమంలోనూ, లేదా దేశీయ మాధ్యమాల్లో ఆంగ్లం ఒక సబ్జెక్టు గానూ బోధించటం ప్రారంభమైన 19వ శతాబ్దంలో ఇంగ్లీషులో మాట్లాడటం విద్యాధికతను ప్రదర్శించేందుకు, సమాజంలో ప్రత్యేక గుర్తింపు లేదా గౌరవం పొందేందుకు తెలుగువారు ఇంగ్లిష్ లో మాట్లాడటం ప్రారంభమైనట్లు గుర్తించవచ్చు.ఇది ఒక సామాజికవర్గం ఔన్నత్యానికి సూచికగా ఉపయోగపడింది. పూర్తిగా ఇంగ్లీష్ ఉపయోగించడం తెలుగు సమాజంలో అన్ని సందర్భాలలో కుదరదు కాబట్టి "తాము చదువుకున్న వాళ్లమనీ, ఇతర చదువుకోని వారికంటే భిన్నం అనీ" కనపడే తాపత్రయమే దీనికి ముఖ్య కారణం అని గుర్తించవచ్చు. తద్వారా అంతస్తులో ఆధిక్యాన్ని, అధిక గౌరవాన్ని పొంది తమ ప్రయోజనాలు నెరవేర్చు కోవటం ఈ రకం తెలుగువారి అసలు లక్ష్యం.

సుమారు 120/130 సంవత్సరాల క్రితమే ఈ రకమైన భాషా సాంకర్యం మొదలైనట్లు తెలుస్తోంది.

భాషల మధ్య అనేక కారణాలవల్ల (రాజకీయ, ఆర్థిక, సామాజిక మొదలైన) భాషా సంపర్కాలు (language contact) జరగడం పరిపాటి. అయితే కొత్తగా

ఇతర భాషలలోని మాటలకు మన భాషలో సమానార్థక పదాలు లేనప్పుడు వాటిని యథాతథంగా భాషలోకి తెచ్చుకొని వాడుకోవటం అనేక భాషల్లో కనిపిస్తుంది. దీన్ని భాషా శాస్త్రంలో ఆదానం (borrowing) అంటారు. అయితే ఇవి పదాలకే పరిమితం.

అలా కాకుండా ఒక భాషలో మాట్లాడుతూనే, మరో భాషలోకి మారి ఆ భాషలో ఒకటో రెండో వాక్యాలు మాట్లాడి మళ్ళీ ముందు మాట్లాడిన భాషలోకి మారిపోవడం (switch అవడం) జరిగితే దాన్ని సామాజిక భాషా శాస్త్రంలో "code switching" భాషా మార్పిడి అంటారు. ఈ రెండూ (అంటే ఆదానం, భాషా మార్పిడి కాకుండా రెండు భాషలు తెలిసిన వ్యవహారాలు మరో పద్ధతి కూడా వినియోగిస్తారు. దీనిని భాషా మిశ్రమంగా (code mixing) చెప్తారు.

ఈ భాషా శాస్త్ర వివరాలు ఇవ్వటం ఎందుకంటే కన్యాశుల్కం నాటకంలోనీ గిరీశం పాత్ర భాషా వ్యవహారంలో ఇవన్నీ మనకు కనిపిస్తాయి. వీటిని ఒక్కొక్కటిగా సోదాహరణంగా కింద వివరిస్తాను.

### I) ఆదానం (borrowing) :

నాటకం ప్రారంభమే గిరీశం ప్రవేశంతో మొదలవుతుంది. అతను మాట్లాడే రెండో వాక్యంలోనే డాన్సింగర్లు, ప్యూర్రిచర్డ్, పేషెన్స్ వంటి మాటలు కలిపి మాట్లాడుతాడు. వీటిలో ప్యూర్రిచర్డ్ ఒక్కటే ఆంగ్ల నామం కాబట్టి అనువాదం చెయ్యనక్కరలేనిది. కానీ మిగిలిన రెండింటికీ తెలుగు మాటలున్నాయి.

మరికొన్ని ఉదాహరణలు (ఉటంకించిన పుటలు గురుజాడలు పుస్తకంలోనివి):

1. నాతో మాట్లాడుతుండడమే యేడ్యుకేషన్ (132)
2. న్యూసు పాపర్లో.......( పుట 220)
3. నీకున్న లాంగ్వేజి (నీ మాస్టారుకుందీ?)(పై.)
4. సెల్లింగ్ గర్లస్ అనగా కన్యాశుల్కం...(237)
5. మీ అంకుల్ కరటక శాస్త్రి స్కౌండ్రల్లా కనపడు తున్నాడు (242)
6. నోట్ బుక్కు తీసి రాసుకో (221, 269)
7. మీరు.. ..కాలు కదపకుండా ఎరేంజిమెంటు యావత్తూ నేను చేస్తాను కాదూ( 271)

8. కొందరు పొగలు (పగలు) యాంటినాచి; రాత్రి ప్రోనాచి (377)
9. మళ్ళీ ఎబ్ డక్ షన్ కేసు కూడానా? (392)
10. ప్రోమీసరీ నోటు (397)
11. నాకో పవరాఫటర్నామా గొలికి ఇచ్చెయ్ (399)
12. డైలమాలో పడి(406)
13. యింత సింప్లిసిటీ యక్కడా లేదు.

ఇలాంటి ఉదాహరణలు గిరీశం భాషలో కొల్లలుగా కనిపిస్తాయి. ఇతర్లలో కేవలం కోర్టు సంబంధిత విషయాల్లో న్యాయ పరిభాష కనిపిస్తుంది.

II) కోడ్ మిక్సింగ్ :

ఒక భాషలో మాట్లాడుతూనే అందులో ఇతర భాషా పదాలు ప్రయోగించడం భాషా మిశ్రమం అని పైన చెప్పుకున్న దానికి గిరీశం కన్యాశుల్కంలో మాట్లాడిన కొన్ని వాక్యాలు కింద వివరిస్తాను :

1. నీ విషయమై యంత లాస్ వచ్చినా నేను కేర్ చెయ్యను. (221)
2. మీ వాళ్లు బార్బరస్ పీపుల్ గదా, నన్ను తిన్నగా ట్రీట్ చేస్తారో !(పై)
3. ఇన్నాళ్ళాయి నీకు విడో మారేజి విషయమై లెక్చర్ లిస్తూంటే ఈ కథ ఎప్పుడూ చెప్పావు కావు?(238)
4. ఒపీనియన్స్ అప్పుడప్పుడు చేంజి చేస్తుంటే గానీ పోలిటీషియన్ కానేరడు.(244)
5. మన కంట్రీయే యిండిపెండెంట్ అయితే గ్లాడ్స్టన్ లాగా దివాన్గిరి చెలాయిస్తును.
6. ఈ రామప్పంతులు చిక్కులకు జాకాల్; తెలివికి బిగ్ యాస్.(289)
7. మా గురువు గారి ఉపదేశం డ్యూటీ ముందూ ప్లెజర్ తరవాతే నండీ. ---గనక మా మారియేజి అనేది ట్రూలవ్ మారియేజి కానీ సాధారణ విడో మారియేజీ కాదండీ.

ఇలాంటి వాక్యాలు సృజనాత్మక రచనల్లోనూ, నిత్య జీవితంలో సంభాషణలలోను గత నూరేళ్లకు పైగా తెలుగు వారి వాడుకలో కనిపిస్తున్నాయి; వినిపిస్తున్నాయి.వీటిలో అనేక పదాలకు తెలుగు సమానార్థకాలు భాషలో ఉన్నప్పటికీ, (లాస్ కు నష్టం అనీ, కేర్ చెయ్యను కు బదులు లెక్క చెయ్యను అనీ, ఒపీనియన్స్ కు అభిప్రాయాలు అనీ) ఇట్లా వాడటం అందరిలో కాకపోయినా ఎక్కువ మంది తెలుగు వారిలో కనిపిస్తుంది. ఈ వినియోగం పెరిగి పెరిగి వంశీ తన కథల్లో రాసినట్లు వైట్ రైస్, యెల్లో రైస్ (అన్నం, పులిహోర లకు); సాల్ట్, కర్రీ వాడకం పెరిగింది.

### III. కోడ్ స్విచ్చింగ్:

మాట్లాడేటప్పుడు ఒక భాషలో మాట్లాడుతూనే రెండో భాషలోకి మారిపోయి అందులో ఒకటో రెండో వాక్యాలు మాట్లాడి మళ్ళీ మొదటి భాషకు మారి పోయి మాట్లాడ్డం జరిగితే దాన్ని భాషా మార్పిడి అంటే కోడ్ స్విచ్చింగ్ అంటారు. అంటే వాక్యం లో ఇతర భాషా పదాలనో పద బంధాలనో చొప్పించడం కాకుండా రెండు భాషల వాక్యాలు ఒకదాని తర్వాత మరొకటి వాడటం అన్నమాట. ఇట్లా వాడటం ద్విభాషీయులకూ, బహు భాషీయులకూ సహజంగా అలవడుతుందనీ అనేక అధ్యయనాలు చెబుతున్నాయి. ఉదాహరణకు బ్రజ్ కచ్రూ అనే అమెరికా లోని విశ్వ విద్యాలయం లోని ఒక భారతీయ శాస్త్రవేత్త అధ్యయనం నుండి ఈ ఒక్క వాక్యం చూడండి (1975).

ఔర్ మై పరివర్తన్ ఘర్ సే షురూ కరూంగా క్యోం కి change begins at home.

ఇప్పుడు గిరీశం మాట్లాడిన భాషలో ఈ రకం వాటిని కింది కొన్ని ఉదాహరణలలో గమనిద్దాం.

a) హౌ బ్యూటిఫుల్! క్వైటనెక్స్పెక్టెడ్. (గిరీశం బుచ్చమ్మను చూసి తనలో తను అనుకున్న మాట, పుట. 238)

b) మీ ఇంట్లోనే ఓ అన్ఫార్చునేట్ యంగ్ విడో ఉందటోయ్; హార్ట్ మెల్ట్స్. (238)

c) నేను కొంచం పస్తాయించి "థ్రోయింగ్ పెరల్స్ బిఫోర్ స్వైన్" అనుకొని ...(242)

d) ఆ లేడి కళ్ళతో తెల్లబోయి చూస్తుంది. అయామ్ డ్రెడ్ఫుల్లీ యిన్ లవ్ విత్ హార్. దీన్ని చూసిన దగ్గర్నుంచీ టౌన్ లవ్సూ, డాన్సింగరల్సూ మీద పరమాసహ్యం పుట్టింది. (265)

e) వన్ థింగ్ ఎట్ ఏ టైమ్, యిప్పుడు పాఠం మాట ఆలోచించు. (268)

f) కొంతకాలం కిందట గిరీశం అనే ఫులిష్ యంగ్ మాన్ వొకడు వుండేవాడు; మధురవాణి అనే ఆ బ్యూటిఫుల్ నాచ్ డెవిల్ ఒకతె ఉండేది. ........ ఐ క్రేవ్ యువర్ మెర్సీ. (420)

ఇట్లా వెంకటేశంతోనూ, తనలో తానూ ఇంగ్లీష్ కలగలిపి మాట్లాడే గిరీశం మధురవాణి, బుచ్చమ్మ, అగ్నిహోత్రావధాన్లు, కరటక శాస్త్రి వంటి మిగిలినవారితో కల్తీ లేని తెలుగులోనే మాట్లాడుతాడు. మళ్ళీ నాటకం చివర్లో సౌజన్యారావ్ తో అతను వకీల్ కాబట్టి రెండు భాషలు కలగలిపి మాట్లాడుతాడు.

ఇంతే కాదు. గిరీశం English, తెలుగు కలగలిపి రెండు పద్యాలు రాస్తాడు కూడా.

1. నీ సైటు నా డిలైటు
నిన్ను మిన్న కానకున్న
క్వైటు రెచడ్ ఫ్లైటు,
మూను లేని నైటు

2. ఫుల్లు మూను లైటటా
జాస్మిన్ను వైటటా
మూను కన్న మొల్ల కన్న
నీదు మోము బ్రైటటా
టా! టా! టా!

అంటూ రాసిన రెండు కవితలు ఇటీవల వస్తున్న ట్రెండును వందేళ్ల కిందటే పసికట్టి చూపినట్టు అనిపిస్తుంది.

ఇవి కాక పూర్తి ఇంగ్లీష్ లోనే చెప్పిన "The Widow" అనే కవిత కూడా ఉంది.

పై వివరణలన్ని చూస్తే గురజాడ గిరీశం పాత్రను సమాజంలో ఇంగ్లీష్

చదువు కొంత నేర్చుకున్న అప్పటి యువకులలో కొందరిలోనైనా ప్రారంభమైన ఆంగ్ల మిళితం ఆయిన తెలుగువాడుక అనే లక్షణం ప్రారంభమైనట్లు తెలుస్తోంది. ఇట్లా వాడటానికి సామాజికంగా కొన్ని కారణాలను గుర్తించవచ్చు.

1. నలుగురిలో తన అథారిటీ లేదా గొప్ప అనే ప్రదర్శన కోసం
2. టెక్నికల్ గా ఆంగ్లానికి సరియైన తెలుగు అనువాదం దొరకక పోవటం
3. తను చెప్పదలచకున్న దానికి అదనపు బలం ఆపాదించడం కోసం
4. వాగాడంబరంతో అవతలి వాళ్ళను దబాయించటం కోసం

1890–1910 ప్రాంతాల నాటికే ఇంగ్లీష్ కొంత వచ్చిన యువతరం ప్రారంభించిన భాషా సాంకర్యం అవసరం ఉన్నా, లేకున్నా; అతిగా అవసరం అయిన, కాని అన్ని సందర్భాలలో వాడే ఒక వ్యతిరేక ఒరవడిని (సాధారణంగా మంచి పరిణామాలకు మాత్రమే “ఒరవడి” అంటాం) చూపించి భవిష్యత్తులో కొన్ని దశాబ్దాలలోనే ఆ ట్రెండు భాషను ఆక్రమించే దురవస్థను నాటకంలో చొప్పించ చూపిన గురజాడది నిజంగా “చాలా ముందు చూపు” అని చెప్పక తప్పదు. ఆనాడు ఒక్క గిరీశం అయితే ఈనాడు తెలుగు సమాజాల నిండా వేల వేల గిరీశాలు తెలుగుని పూర్తిగా సంకీర్ణానికి భిన్నంగా సాంకర్యం చేసేస్తున్నారు.

### ఉపయోగించిన గ్రంథాలు, వ్యాస భాగాలు


1. అప్పారావు, గురజాడ. కన్యాశుల్కం. తొలి, మలి కూర్పులు. పెన్నేపల్లి గోపాలకృష్ణ (సం.). గురుజాడలు లో. (2012) పుటలు: 125–421. (తొలి ముద్రణ: 1897; మలి: 1909)
2. ఉషా దేవి, ఏ. ‘ఆధునిక తెలుగుపై గిరీశం భాషా ప్రభావం’ 2002. వాంఙ్మయి. 49–52
3. Annamalai, E. 1989. The language factor in code mixing. In IJSL.75.pp. 48–54
4. Kachru, Braj, B. 1975. Toward structuring the form and function of code mixing: An Indian perspective. In “Studies in Linguistic Science”. Vol.1, No. 5. Spring.

పరిశోధనా వ్యాసం

# గురజాడ సాహిత్యం అత్యంత ప్రాసంగికం



డా. పఠాన్ ఖాసిం ఖాన్
✆ 94949 98492

శాంతి, వృద్ధి, హితం, శ్రేష్ఠం, సుఖం, జ్ఞానం, ప్రేమ, భ్రాతృత్వం, సమత, మమత, నవత, ఐక్యత మొదలయినవి సర్వజగత్తుకు సమకూరాలనే సమున్నత ఆశయంతో అవిరామ కృషి చేసిన సాహిత్య స్రష్ట గురజాడ. వారి రచనల్లోని ప్రాసంగికాన్ని పరిశీలించటం ప్రస్తుత వ్యాస లక్ష్యం.

మనిషిని బాదేస్తూ, బాధిస్తూ, పశువు కంటే హీనంగా భావిస్తూ ఉన్న ప్రస్తుత సమాజానికి ప్రాణి సేవయే పరమాత్ముని సేవ అని 'మనిషి' అనే పాట ద్వారా పరమోత్కృష్టం, పరమపథప్రదాయకం, పరమాత్మ ప్రమోదకారకం అయిన పరమోపదేశం చేసారు. 'మీ పేరేమిటి' కథ హిందూ ముస్లింల సామరస్యాన్ని సాక్షాత్కరిస్తుంది. 'మతము విమతము' కథలో శివుడు, విష్ణువు, పీరు, బుద్ధుడు ఒక్కటే అని గురువు బోధిస్తాడు.



'బిల్హణీయం' నాటకంలో – మన మతమే నిజమూ, పరమతములన్నీ అబద్ధమూ అనుట అజ్ఞత, ఏ దేశంలో ఏ మతంలో ఏమేమి మేలు ఉంటే అదల్లా గ్రహించదగినదే. నాలుగు దేశాలు తిరిగి నాలుగు మతాల వాళ్ళతోను అన్నదమ్ముల్లాగ బతికినవాళ్ళకి మతాభిమానాలు మాసిపోతాయి. బుద్ధికి సంకెళ్ళు విడిపోతాయి...

నిజమైన జ్ఞానము సాధించవలెననే ఆకాంక్ష ఉన్న వ్యక్తికి పరమత నిరసన

చేయకూడని పని, సహనం అలవర్చుకోవాలి. అప్పుడే వివిధ మతాల్లోని ఉత్తమ గుణాలను గుర్తించగలరు. అన్ని మతాలు బోధించే ఉత్తమ లక్షణాలు సత్ప్రవర్తన, భూతదయ అని గుర్తించగలిగిన వ్యక్తి దృష్టి విశాలమవుతుంది. జ్ఞానం వెల్లివిరుస్తుంది. జ్ఞానవంతుడైనవానిలో మతమౌఢ్యంతోపాటు అన్ని మౌఢ్యాలు నశిస్తాయి. అలాంటి వ్యక్తికి విశ్వమే కుటుంబం, మనుషులు సహోదరులు అన్న దృష్టి ఏర్పడుతుంది. ఇత్యాదిగా గురజాడ విరచించారు. పరమత సహనం, పరమతములందలి హితములను గ్రహించటం, విశ్వమానవ సౌభ్రాతృత్వం, సత్ప్రవర్తనం, భూతదయ మున్నగు సద్గుణాలను అలవరచుకోవాలని, మతమౌఢ్యం, మత దురభిమానం, అజ్ఞానం, అన్యమత నిరసనం అంతమొందించాలని, మానవుల మనస్సులలోని మాలిన్యాన్ని, పాదుకొని వున్న పరస్పర ద్వేషాన్ని ప్రక్షాళన చేసి మానవ సంబంధాలను దృఢమైన ప్రేమబంధంతో బిగించారు. ఈ విధంగా మతసామరస్యాన్ని గూర్చి పలుతావులందు తన రచనలలో అవకాశాన్ని కల్పించుకొని తదావశ్యకతను బహువిధాల ప్రవచించారు.

> అమ్మలపైన, అమ్మాయిలపైన జరుగుతున్న అత్యాచారాలు, హత్యాచారాలు, దురాచారాలు, ఘోరాచారాలు, నగ్నంగా ఊరేగింపులు కంటుంటే, వింటుంటే...

అమ్మలపైన, అమ్మాయిలపైన జరుగుతున్న అత్యాచారాలు, హత్యాచారాలు, దురాచారాలు, ఘోరాచారాలు, నగ్నంగా ఊరేగింపులు కంటుంటే, వింటుంటే, చిత్తం లేని శిలల్లా కదలకుంటుంటే వెంటనే... పట్టమేలే రాజు అయితే, రాజునేలే దైవముండడా అనే కన్యక గర్జన ప్రతిధ్వనిస్తుంది. కండకావరమెక్కి దుండగాలు చేస్తుంటే మనిషి అన్నవాడు ఖచ్చితంగా అడ్డుకోవాలని ఈ గీతాదేశం. తగినంత శక్తి సామర్థ్యాలుంటే చేతితో, లేకుంటే నోటి మాటతో, తద్ధృతి సహితం లేకుంటే చివరకు చిత్తంతోనైనా చెడును చెడుగా తలంచాలి. అప్పుడుగాని ధర్మం అడుగంటి అయినా నిలబడి ఉంటుంది. ఈ పురుష యత్నాలు లోపిస్తే సర్వశక్తుడు కేవలం దుండగులనే దండించక, ప్రకృతి వైపరీత్యాలను ప్రభవింపజేసి సర్వనాశనం చేయవచ్చు. మన ధర్మం మనం పాటించకుంటే దైవం తన ధర్మాన్ని తాను నిర్వర్తించి తీరతాడని ఈ పాట ప్రస్ఫుటం చేస్తుంది.

కాయిదాలనే కళ్ళెంతో కట్టుకున్న కన్యను కట్టడి చేసే కర్కశుడు; తినడం, తాగడం, రావడం, పోవడం, కూర్చోటం, లేవటం, మాట్లాడటం, మౌనంగా ఉండటం అసలు ఏమి చేసినా భార్య తన మాట జవదాటకూడదనే నిరంకుశుడు; సతికి స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, సమానత్వం, సంతోషం, సుఖం సూచనప్రాయంగా కూడా లేకుండా చేసే ముసలి మొగుడు; పెద్ద పులి లాంటి క్రూరభర్తతో జనం గోడు భరించ లేక, కూడు, గూడు, గుడ్డ కోసం అట్టి మొగుడు తోడు భరిస్తున్న అందమైన అమ్మాయిలు అగుపిస్తే మెరుపులా మెరుస్తుంది మెటిల్డా.

**భర్త మార్గభ్రష్టుడైతే భార్య ఏవిధంగా దిద్ది తీర్చుకోవాలో 'దిద్దుబాటు' కథ కమలిని ద్వారా ఉద్బోధిస్తుంది.**

భర్త మార్గభ్రష్టుడైతే భార్య ఏవిధంగా దిద్ది తీర్చుకోవాలో 'దిద్దుబాటు' కథ కమలిని ద్వారా ఉద్బోధిస్తుంది. తన యజమాని గోపాలరావు చెడు తిరుగుళ్ళు తిరుగుతూ తప్పులు చేస్తుంటే నౌకరు రాముడు ఊరుకోకుండా, నిర్భయంగా, నిస్వార్థంగా, నిక్కచ్చిగా నిలదీసి చెప్పినట్లుగానే ఈనాటి తిరుగుబోతులకు తెలియజేయాల్సిన తీరును తెలుపుతుందీ కథ.

ఊకదంపుడు ఉపన్యాసాలిచ్చే ప్రొఫెసర్ రఘునాదయ్యరు వంటి ప్రముఖ గురువులు సహితం మనోమాలిన్యాన్ని తొలగించి, మనోనిగ్రహాన్ని పాటించాల్సిన పద్ధతిని 'సంస్కర్త హృదయం' ప్రవచిస్తుంది. జన్మతః సాని అయినప్పటికిని చదువు, సంస్కారం, సద్వర్తనాకాంక్ష కల సరళ తనకు నచ్చినవాడిని పెళ్ళి చేసుకొని మంచి ఇల్లాలుగా బ్రతకాలనే ప్రగాఢ వాంఛ ఫలించలేదు. కాబట్టి తమ తనువులను అంగళ్ళలో అమ్ముకొనే ఆడపడుచులను అనుభవించి వదిలెయ్యడం, అధములుగా భావించడం కాదు. కావల్సింది వారి అంతరంగాల్లోని ఆశలను ఫలింపచేసే పరోపకారులని ఈ కథ సూచిస్తుంది.

ప్రేమ ముసుగులో మోహం ముసురుకొని అసురలై ఉసురులు తీస్తుంటే, భార్యాభర్తల మధ్య సహితం ప్రేమ తరిగి కయ్యాలు కమ్ముకుంటుంటే 'కాసులు' ప్రేమను కుమ్మరిస్తుంది. ఆత్మసౌందర్యం, స్ఫటిక స్వచ్ఛతను మెచ్చుకోవటం, పరోపకారం, దయ, శాంతి, నిశ్చలత్వం, స్వార్థత్యాగం, మాయామర్మం లేని నేస్తం,

అన్యులను ఆదరించటం మున్నగువాటిని గురజాడ ప్రేమ లక్షణాలుగా నరుల హృదయాల్లో నాటుతాడు. ఇవ్వాల్సింది, ఏలాల్సింది, నిలపాల్సింది, నింపాల్సింది, నాటాల్సింది, పెంచాల్సింది ప్రేమనే. తనకు కావాల్సింది ఇస్తే తాను తిరిగి దానిని పొందుతాడు. అందుకే గురజాడ – 'ప్రేమనిచ్చిన ప్రేమ వచ్చును, ప్రేమ నిలిపిన ప్రేమ నిలుచును' అన్నారు.

వధువు స్వయంగా వరుణ్ని సమ్మతించి కన్యాశుల్కం గ్రహించి వరించటం ధర్మబద్ధం. కన్యాశుల్కంపై సర్వాధికారాలు కన్యవే. కన్యాదాత మాత్రమే కన్న తండ్రి. దానం ఇచ్చేదే కాని ప్రతిగా తీసుకొనేది కానేకాదు. కన్యాశుల్కం కన్యావిక్రయవిత్తంగా పరిణమించింది. కన్న తండ్రే తన కన్నబిడ్డను బలిపశువును చేసి ముసలివాడికి విక్రయించి విత్తం దోచేస్తున్నాడు. పైకాన్ని ఆశించి పసిపిల్లలనే కనికరం సహితం లేకుండా కాటికి కాళ్ళు చాచిన ముసలివాళ్ళకు కట్టబెట్టడం వలన వాళ్ళు బాలవితంతువులవుతున్నారు. అట్టి సందర్భంలో 'కన్యాశుల్కం' నాటకం వెలుగు చూసింది. కాని ఇప్పుడు కన్యాశుల్కం కనుమరుగై వరకట్నం పరవళ్ళు దొక్కుతుంది. ఏది వచ్చినా ఇల్లాలుకే ఇక్కట్లు, ఇబ్బందులు. నేటి మహిళల దురవస్థలు, మతమౌఢ్యాలు, వ్యభిచారాలు, తాగుళ్ళు, దావాలు, వితంతువుల వెతలు, మోసాలు మున్నగువాటికి ఈ నాటకం ప్రాసంగికమే. ఇది మనోరంజకంగా, మనసుల్లో ఆలోచనలను రేకెత్తిస్తూ, మానవుల్లో రావల్సిన మార్పును, కావాల్సిన తీరును కనిపించని గుద్దులు గుద్ది తీరుస్తుంది. గురజాడ ఈ నాటకంలో తన మాటలనే ఈటెలకు హాస్యమనే డైమెండ్ తొడుగులు తొడిగి శృంగారమనే గంగాజలంలో ముంచి వాటితో హృదయపుటాల్లో పొడుస్తుంటే లోలోన కుళ్ళి కుళ్ళి ఉన్న కుళ్ళంతా వెళ్ళిపోయి చిత్తశుద్ధి చేకూరుతుంది.

> వధువు స్వయంగా వరుణ్ని సమ్మతించి కన్యాశుల్కం గ్రహించి వరించటం ధర్మబద్ధం. కన్యాశుల్కంపై సర్వాధికారాలు కన్యవే. కన్యాదాత మాత్రమే కన్న తండ్రి.

పునర్వివాహానికి నోచుకోని బాలవితంతువుల వెతలు వింటున్నా, వితంతు వివాహ విఘ్న పరంపరను పరికిస్తున్నా, బాలవితంతువు అయిన పార్వతి

మరియు రామమూర్తుల పరిణయ ప్రయత్నాలు కల 'కొండుభట్టీయం' ప్రత్యక్షమవుతుంది.

దేశభక్తి ముసుగులో నటిస్తూ వేషాలు మారుస్తూ ఉన్న దొంగ భక్తులు, దేశద్రోహులు, కపట ప్రేమికులు, స్వార్థపరులు, ద్వేషస్రష్టలు, విద్వేష పోషకులు ప్రభృతులు ప్రబలుతుంటే గురజాడ కలం – 'దేశభక్తి' గీతాన్ని విలిఖించి నిష్కల్మషం, నిస్వార్థం, నిరామయం, నిరవద్యం, నిశ్రేయసం, నిత్యావశ్యకం తో నిండిన విశ్వశాంతి, విశ్వవృద్ధి, విశ్వమైత్రి, విశ్వహితాదులను విశ్వమంతా వెదజల్లుతుంది.

**ప్రస్తుతం పలుచోట్ల బహు రూపాల్లో కులరోగం, వర్ణబేధం అత్యధికులకు అంటుతూనే ఉంది.**

ప్రస్తుతం పలుచోట్ల బహు రూపాల్లో కులరోగం, వర్ణబేధం అత్యధికులకు అంటుతూనే ఉంది. గురుత్వాన్ని కోల్పోయి, మానవత్వాన్ని మంటకలిపి, కనికరం లేకుండా, మంచి నీళ్ళు తాగుతున్నాడనే జ్ఞానం కూడా లేకుండా పసిపిల్లవాడని కూడా చూడకుండా చావబాదుతుంటే గురజాడ గళం – ఎల్లలోకం ఒక్క ఇల్లవ్వాలని, వర్ణబేధాలెల్ల కల్ల అవ్వాలని గర్జిస్తుంది. కులాంతర, వర్ణాంతర వివాహాల ద్వారా కుల, వర్ణ బేధాలను నిర్మూలించవచ్చని తలంచి 'లవణరాజు కల' లో కవి కులాంతర వివాహాన్ని జరిపించాడు. కలిసిమెసగినంత మాత్రాన ఐకమత్యం కలుగదని, మాలమాది కన్యను పెండ్లాడాల్సిన ఆవశ్యకతను ముత్యాలసరాలలో ముచ్చటిస్తాడు.

మూఢవిశ్వాసాలు ముసురుకొని వదలకుంటుంటే గురజాడ 'తోకచుక్క' ను సంఘసంస్కరణ పతాకగా భావించి తద్వారా శాస్త్రీయ దృక్పథాన్ని ప్రస్ఫుటం చేసారు.

దేశదేశాల్లో యుద్ధారావాలు ఘూర్ణిల్లుతూ, ధరణి రక్తసిక్తమవుతూ, జనాల హాహాకారాలు మిన్నంటుతూ, మహిళల మానాలు మంట కలుస్తూ, పసిపిల్లలు, వృద్ధులు, అనాధలు ఆకలిదప్పులతో అల్లాడుతూ, బిక్కుబిక్కుమని జనం జీవచ్ఛవాలుగా జీవిస్తూ, హృదయ విదారకంగా శవాలు గుట్టలు గుట్టలుగా పడుతూ, బ్రతికి ఉన్నవాళ్ళు ప్రాణభయంతో పరుగులు తీస్తూ ఉన్న భీకర, భీభత్స సంగ్రామాలు సాగుతున్న ఈ సందర్భంలో 'దించు లంగరు' గేయం ద్వారా

గురజాడ లోకమంతా ఏకమై దీర్ఘ యుద్ధాన్ని అంతం చేసి విశ్వశాంతి వికసింపచేయాలని ధర్మోద్బోధ గావించాడు.

నిస్తేజం, నిర్వీర్యం, నిర్బలం, నిరుత్సాహం, నిరాశ, నిస్పృహలు అలుముకున్న నేటి సమాజంలో 'లంగరెత్తుము' గీతం ఉత్తేజం, ఉత్సాహం, ఉద్వేగం నింపుతుంది.

**కురుక్షేత్రం 18 రోజులు, రామరావణ యుద్ధం 27 రోజులు జరిగితే, గ్రాంథిక వ్యావహారిక భాషావాద యుద్ధం అనంతంగా సాగుతూ గురజాడ హృదయపుట ఛేదనం చేసింది**

కురుక్షేత్రం 18 రోజులు, రామరావణ యుద్ధం 27 రోజులు జరిగితే, గ్రాంథిక వ్యావహారిక భాషావాద యుద్ధం అనంతంగా సాగుతూ గురజాడ హృదయపుట ఛేదనం చేసింది. వారందుకే దీనిని దేవాసుర యుద్ధంతో పోల్చారు. కాని భాషామథనం మూలంగా అత్యధికులు మాట్లాడే అమృతం వంటి అమ్మభాష ఆవిష్కృతమయ్యింది. ఉభయులూ తెలుగుకు మేలు కోరేవారే. తెలుగును మిక్కిలి ఇష్టపడుతూ, తెలుగుకు నష్టం వాటిల్లకూడదని కష్టపడేవారే. ఒకరు బహుజనుల భాషకు పట్టం కడితే, మరొకరు పండితప్రకాండుల భాషకు పట్టాభిషేకం చేశారు. ఏదీ వ్యర్థం కాదు. దేని ప్రయోజనం దానికుంది. కాకపోతే మోతాదులోనే తేడా ఉంది. అత్యధిక సంఖ్యాకులకు అనాయాసంగా అర్థమయ్యేది వ్యావహారికం. అత్యల్ప సంఖ్యాకులకు అత్యధిక ప్రయాసతో అర్థమయ్యేది గ్రాంథికం. గురజాడ ఆశించిన వ్యావహారికం నెగ్గింది. ప్రస్తుతం వ్యావహారిక భాషాభాస్కరులు మాత్రం బహుళంగా ప్రచండంగా ప్రజ్వలిస్తూనే ఉన్నారు.

గ్రామ్యశబ్ద విచారణం వ్యాసంలో 'మ్లేచ్ఛ' అనే పదానికి తురుష్కుల భాష అని అప్పకవ్యాదులు, మరికొందరు ఇంగ్లీషు భాష అనే అర్థాన్ని భాషాపరంగా భావించారు. కాని శతపథ బ్రాహ్మణం, మహాభాష్యం, ఉద్యోతం లోని వివరణలాధారంగా అపశబ్దమనే అర్థమున్నట్లు గురజాడ తెలిపారు. దీని మూలంగా 'మ్లేచ్ఛ' అనే పదానికి పూర్వం ఉన్న 'అపశబ్దమ'నే అర్థం తరువాతి కాలంలో తురుష్క లేదా ఇంగ్లీషు భాషాపరంగా అర్థ విపరిణామం చెందినట్లు భావించవచ్చు. ఈవిధంగా అర్థవిపరిణామ, ధ్వని పరిణామాది విషయాలతో

కూడిన భాషాశాస్త్రాధ్యయనం చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

గురజాడ శాసన పరిశోధకునిగా, చరిత్ర పరిశోధకునిగా సహితం మిక్కిలి ఆసక్తితో అధ్యయనం చేసారు. 'విజయనగర సామ్రాజ్యము' అనే నవల్లో చరిత్రకు విరుద్ధంగా రచయిత చేసిన మార్పులను ఆకరసహితంగా చర్చించారు. ఈ నవల్లో రామరాజు సోదరుడైన తిరుమలరాయుడిని తాళికోట యుద్ధంలో ముస్లింలు వంచన చేసి చంపినట్లు రచితమయ్యింది. కాని తిరుమలరాయుడు తళ్ళికోట యుద్ధానంతరం సహితం కన్నడ రాజ్యాన్ని పరిపాలించినట్లుగా ఆధునికాంధ్ర వచన రచన వ్యాసంలో ప్రస్ఫుటం చేసారు. చారిత్రక రచనల్లో జరిగిన, జరుగుతున్న కల్పనలను గురజాడ లాగ కూలంకుషంగా అధ్యయనం చేసి చారిత్రక సత్యాలను ప్రకటించకుంటే కల్పిత చరిత్ర విస్తరిస్తుంది. అందుకే గురజాడ చారిత్రక గ్రంథం సహితం వ్రాయాలనుకొన్నారు.

> ఈ నవల్లో రామరాజు సోదరుడైన తిరుమలరాయుడిని తాళికోట యుద్ధంలో ముస్లింలు వంచన చేసి చంపినట్లు రచితమయ్యింది.

ప్రపంచ మానవుల భావ వినిమయానికి అనువాదం ప్రబల సాధనం. అందుకే ప్రస్తుతం అత్యంతావశ్యకం. అనువాదం ఆంధ్ర సాహిత్యం అనువాదంతో ఆరంభమవటం ఆంధ్రుల అదృష్టం.

దాతృత్వం ప్రియవక్తృత్వం ధీరత్వముచితజ్ఞతా ।
అభ్యాసేన నలభ్యంతే చత్వారస్సహజ్ఞ గుణాః ॥

ఈవియు తియ్యని మాటయు
భావంబున జేయదగిన పని తెలియుటయున్
ఠీవియగు ధైర్యభావము
రావు సుమీ యొకని వలన రావలె తనతోన్

యథాచతుర్భిః కనకం పరీక్ష్యతే, నికర్షణచ్ఛేదన తాపతాడనైః ।
తథా చతుర్భిః పురుషః పరీక్ష్యతే, కులేనశీలేన గుణేన కర్మణా ॥

నాల్గు రీతుల గనకంబు నాడెమగును,
వేటుగీటుల తునియించి వెచ్చజేసి
నరుడునట్టుల నాల్గింట నాడెమగును
కులము శీలము కర్మంబు గుణముచేత

ఈ పద్యాలకు పరిపూర్ణ లక్ష్యమనదగినవారు అప్పారావు గారు. ఈ విధమైన అనువాదం సహితం కొంత చేసినట్లు ఆరుద్ర ద్వారా అవగతమవుతుంది. నికర్షణచ్ఛేదన తాపతాడనాది పరీక్షల్లో నెగ్గిన బంగారు జాడ గురజాడది. ధనం, బలం, పాలనం, పాండిత్యం, ఉచ్చకులం, సంఖ్యాధిక్యం, ప్రఖ్యాతం ప్రభృతులు గల వారివైపు ఒరగటం అత్యధికులు, అనాయాసంగా అత్యధికంగా చేసే అకృత్యం. తద్విరుద్ధంగా ధైర్యంగా, స్థైర్యంగా, అవిరామంగా పోరాడి గెలిచిన ధర్మవీరుడు అప్పారావు. బ్రతికి చచ్చియు ప్రజలకు ప్రీతి కూర్చిన సత్కవివర్యుడు, ధన్యగురువు అప్పారావు.

ఆధార గ్రంథాలు :

1. గురజాడ రచనలు – వ్యాసాల సంకలనం, సెట్టి ఈశ్వరరావు, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్, 1991.

2. గురజాడ – బెర్నార్డ్ షా తులనాత్మక అధ్యయనం, డా. మొవ్వ రాజారావు, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్, 1990.

3. గురజాడ రచనలు – మానవతావాదం, డా. బి.భారతి, సంఘమిత్ర పబ్లికేషన్స్, విజయవాడ, 1991.

4. సమగ్ర ఆంధ్ర సాహిత్యం – 11వ సంపుటం, ఆరుద్ర, ప్రజాశక్తి బుక్ హౌస్, విజయవాడ, 1991.

5. మహోదయం, కె.వి.రమణారెడ్డి, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్, 1999.

ప్రత్యేక పరిశోధనా వ్యాసం

# మధురవాణి, మిసెస్ వారెన్: ఒక తులనాత్మక అధ్యయనం



ఆచార్య కె. సునీతా రాణి
98857 10863



ఆయన సమకాలికుల్లాగానే గురజాడ అప్పారావు మీద కూడా ఆంగ్ల ప్రభావం చాలానే ఉంది. కొన్ని విషయాల్లో ఆయన ఆంగ్లాన్ని వ్యతిరేకించారు. మరి కొన్ని విషయాల్లో, రచనల్లో ఆంగ్లాన్ని విస్తృతంగా ఉపయోగించారు. ఆయన రచనల్లో కూడా ఆయన ఆంగ్ల సాహిత్య అధ్యయనం తెలుస్తూనే ఉంటుంది. ముఖ్యంగా ఆయన రచనపై షేక్స్పియర్, బెన్ జాన్సన్, మొలియర్, జాన్ గే, అలెగ్జాండర్ డ్యూమస్, హెన్రిక్ ఇబ్సెన్, జార్జ్ బర్నార్డ్ షా లాంటి రచయితలూ, వారి రచనల ప్రభావం స్పష్టంగా కనిపిస్తూ ఉంటుంది. ఇతర భారతీయ భాషా సాహిత్య ప్రభావం కూడా గురజాడ అప్పారావు రచనలపై బాగానే ఉంది[1].

అంతే కాకుండా, ఆయన తన సమకాలీకుల్లాగానే ఆంగ్లంలో కూడా రచనలు చేసారు[2], తన తెలుగు పుస్తకాలకు ఆంగ్ల పీఠికలు రాసారు. తెలుగు

---

[1] నరసింహమూర్తి, యూ.ఏ. కన్యాశుల్కం: 19వ శతాబ్ది ఆధునిక భారతీయ నాటకాలు. విజయనగరం: ఎన్. కే. పబ్లికేషన్స్, 2007

[2] Gurajada's writings in English—Sarangadhara, Songs of the Blue Hills – Beautiful are the Blue Hills, The Wonders of Ooty, Worship the Lord of Uma, That World of Long Ago, Is There no Magic? I Took You for a Picture (Poetry); Diaries, My Own Thoughts, Correspondence, Minute of Dissent.

భాషకు అత్యంత ప్రాధాన్యతనిచ్చారు, మెకాలే ప్రవేశపెట్టిన ఆంగ్ల భాష బోధనకు విరుద్ధంగా నిరసన పత్రం కూడా రాసారు. కానీ, ఆంగ్ల సాహిత్య ప్రాధాన్యతను, భాషను విస్తృతం చేయాల్సిన అవసరాన్ని కూడా ఆయన గుర్తించారు. సమాజంలో మార్పు తీసుకురావడానికి దోహదపడే ఏ సాహిత్యాన్నయినా ఆయన ఆహ్వానించారు. ముఖ్యంగా ఆయన రచనల్లోని స్త్రీ పాత్రలకు, ఇతర సాహిత్యంలోని స్త్రీ పాత్రలకు సారూప్యం కనిపిస్తుంది. కన్యాశుల్కంనుండి మధురవాణిని, బెర్నార్డ్ షా రాసిన మిసెస్ వారెన్స్ ప్రొఫెషన్ లోని ముఖ్య స్త్రీ పాత్రను తులనాత్మకంగా అధ్యయనం చేస్తే, ఆ రోజుల్లో స్త్రీల గురించి జరుగుతున్న చర్చలు, మారుతున్న ఆలోచనలు, ప్రశ్నించబడుతున్న జీవన విధానాల గురించి మనకు ఒక స్పష్టత వస్తుంది. పైన చెప్పిన స్త్రీ పాత్రలు రెండు విభిన్న సమాజాలకు, వర్గాలకు చెందినవి. కానీ, వాళ్లిదరు లేవనెత్తిన ప్రశ్నలు మారుతున్న ప్రపంచానికి అద్దం పడతాయి.

> షా చేసిన రచనలను డ్రామా ఆఫ్ ఐడియాస్ అంటారు. వీటినే ప్రాబ్లమ్ ప్లే అని కూడా అంటారు. అంటే, ఈ నాటకాలు సంఘర్షణాత్మక ఆలోచనలను, విభిన్న భావజాలాలను చర్చకు పెడతాయి.

గురజాడ అప్పారావు, జార్జ్ బెర్నార్డ్ షా ఇద్దరు కూడా సమాజంలోని ఛాందసభావాలను చర్చించారు, మార్చడానికి ప్రయత్నించారు. అందు కోసం నాటక రంగాన్ని ఒక ఆయుధంగా ఉపయోగించారు. నాటకరంగం అంటే మార్పుకు సాధనం ఈ ఇద్దరికీ. షా చేసిన రచనలను డ్రామా ఆఫ్ ఐడియాస్ అంటారు[3]. వీటినే ప్రాబ్లమ్ ప్లే అని కూడా అంటారు. అంటే, ఈ నాటకాలు సంఘర్షణాత్మక ఆలోచనలను, విభిన్న భావజాలాలను చర్చకు పెడతాయి. ముఖ్యంగా, వ్యక్తిగత,

[3] In Drama of Ideas or problem plays, there is not much action but there is intense discussion. Audience is made to think about the issues raised by the play. The conflicting ideas are conveyed through the characters. The audience is also drawn into the conversations between the characters and introspect themselves and examine the society around them. Henrik Ibsen is another inspiring dramatist whose plays come under under the drama of ideas or problem plays.

సామాజిక నైతికత, న్యాయం గురించి. గురజాడ అప్పారావు రచనలు కూడా ఈ కోవకే చెందుతాయి. కన్యాశుల్కం మొదటి ముద్రణ (1897) పీఠికలో బాల్య వివాహాలగురించి, కన్యాశుల్కం గురించి మాట్లాడుతూ గురజాడ ఇలా అంటారు. "ఇలాంటి దారుణమయిన పరిస్థితి సమాజానికే సిగ్గుచేటు. ఈ ఆచారాలను ఎండగట్టి, ఉన్నతమయిన నైతిక విలువలను వ్యాప్తి చెయ్యడం కంటే మించిన గొప్ప ధర్మం సాహిత్యానికి ఇంకేముంటుంది? జనబాహుళ్యంలో చదివే అలవాటు పెరిగే వరకు ఆరోగ్యకరమయిన ప్రభావాలను విస్తరింపచెయ్యడానికి నాటకరంగం వైపే చూడాల్సి ఉంటుంది. అదే నన్ను కన్యాశుల్కం రాయడానికి ప్రోత్సహించింది[4]." ఈ పీఠిక ఆంగ్లంలో ఉంది. అలాగే జార్జ్ బర్నార్డ్ షా కూడా తన మిసెస్ వారెన్స్ ప్రొఫెషన్ నాటకానికి తన ముందు మాటలో ఇలా అంటాడు. "ఇంగ్లాండ్ లో వ్యక్తిగత ప్రవర్తన, మతం, చట్టం, విజ్ఞానం, రాజ్యకీయాలు, నైతికత విలువలు మరింత నాటకీయంగా తయారవుతుంటే నాటకరంగం ఇంగితజ్ఞానం, మతం, విజ్ఞానం, రాజకీయాలు, నైతిక విలువలను అడ్డుకుంటూ మరింత గొప్పదవుతోంది. అందుకే, నేను నాటకరంగంలో పోట్లాడవలసి వచ్చినప్పుడు కరపత్రాలు, బోధనలు, టీకా తాత్పర్యాలు కాకుండా నాటకాలతోనే పోట్లాడతాను. నాటకమన్నది నాకెంత గొప్పగా అనిపిస్తుందంటే లండన్ వాసులు నాటకశాలకు వచ్చేటప్పుడు తమతో పాటు తమ అంతరాత్మను, మెదడును కూడా తీసుకువచ్చేలా నేను చేయగలనని బలంగా నమ్ముతున్నాను. ఇప్పటిలాగా వాళ్ళను ప్రార్థన

నాటకమన్నది నాకెంత గొప్పగా అనిపిస్తుందంటే లండన్ వాసులు నాటకశాలకు వచ్చేటప్పుడు తమతో పాటు తమ అంతరాత్మను, మెదడును కూడా తీసుకువచ్చేలా నేను చేయగలనని బలంగా నమ్ముతున్నాను.

[4] "Such a scandalous state of things is a disgrace to society, and literature cannot have a higher function than to show up such practices and give currency to a high standard of moral ideas. Until reading habits prevail among the masses, one must look only to the stage to exert such healthy influence. These considerations prompted me to compose Kanyashulkam". Preface to the first edition of Kanyshulkam (1897)

పుస్తకాలు చదువుకోమని ఇంట్లో మాత్రం వదిలెయ్యను[5]."

గురజాడ అప్పారావు నాటకం, నాటకరంగం, భాష, రచన, ప్రేక్షకుల స్పందన, మార్పు గురించి విస్తృతంగా తన రచనల్లో చర్చించాడు. షా కూడా వేశ్యావృత్తిని కీర్తించడం తన ఉద్దేశం కాదని, బ్రిటిష్ సమాజంలో ఉన్న లోపాలను ప్రేక్షకుల దృష్టికి తీసుకెళ్లడమే తన ఉద్దేశమని తన నాటకాల్లో, ముందు మాటల్లో స్పష్టంగా చర్చించాడు. "మిసెస్ వారెన్ వృత్తిలోకి ఎక్కువమంది ప్రవేశిస్తున్నారు కాబట్టి దాన్నిబట్టి ఆ వృత్తి పనితీరును నిర్ణయించాలని నేను అస్సలు చెప్పను[6]."

డ్రామా ఆఫ్ ఐడియాస్ లో పాత్రల ద్వారానే నాటక రచయితల ఆలోచనలను చర్చకు పెడతారని తెలుసుకున్నాం కదా. మరిప్పుడు...

డ్రామా ఆఫ్ ఐడియాస్ లో పాత్రల ద్వారానే నాటక రచయితల ఆలోచనలను చర్చకు పెడతారని తెలుసుకున్నాం కదా. పై ఇద్దరు నాటక కర్తలు తమ నాటక రచన వ్యాసంగం గురించి ఏం రాసారో కూడా చదివాం కదా. మరిప్పుడు వాళ్ళ

[5] " I have pointed out again and again that the influence of the theatre in England is growing so great that whilst private conduct, religion, law, science, politics, and morals are becoming more and more theatrical, the theatre itself remains impervious to common sense, religion, science, politics, and morals. That is why I fight the theatre, not with pamphlets and sermons and treatises, but with plays; and so effective do I find the dramatic method that I have no doubt I shall at last persuade even London to take its conscience and its brains with it when it goes to the theatre, instead of leaving them at home with its prayer–book as it does at present". The Author's Apology; Mrs Warren's Profession (performed for the first time in the theatre of the New LyricClub, London, on the 5th and 6th January 1902, after eight years of delay.

[6] "Consequently, I am the last man in the world to deny that if the net effect of performing Mrs Warren's Profession were an increase in the number of persons entering that profession, its performance should be dealt with accordingly."

పాత్రలు ఏం మాట్లాడుతున్నాయి, ఎందుకు అలా మాట్లాడుతున్నాయి, నాటకకర్తలు ఆ నాటకాలను, పాత్రలను ఎలా తీర్చి దిద్దారో తులనాత్మక పరిశీలనా దృక్పథం నుండి అర్థం చేసుకుని విశ్లేషించడానికి ప్రయత్నిద్దాం. ముందే చెప్పినట్లు, ఈ వ్యాసం మధురవాణి, మిసెస్ వారన్ ల మీదే ప్రధానంగా చర్చిస్తుంది. ఈ చర్చ నైతికత గురించి కాదు. స్త్రీ పాత్రల నైతిక విలువల మీద తీర్పునివ్వడం అసలే కాదు. ఈ వ్యాసం ముఖ్య ఉద్దేశం ఏమిటంటే, ఇద్దరు స్త్రీలు తమ సమాజంలోని దోపిడీకి, అనాచారాలకు బలయినా కూడా ఎలా నిలదొక్కుకున్నారు, తమదయిన జీవన మార్గాలని ఎలా ఎన్నుకున్నారు అని విశ్లేషించడం.

> ఇద్దరు స్త్రీలు, దాదాపు ఒకటే కాలానికి చెందినవాళ్లు, కానీ వేర్వేరు సమాజాలకు దేశాలకు చెందినవాళ్లు.

ఇద్దరు స్త్రీలు, దాదాపు ఒకటే కాలానికి చెందినవాళ్లు, కానీ వేర్వేరు సమాజాలకు దేశాలకు చెందినవాళ్లు. వాళ్ళిద్దర్నీ కొంతవరకు దగ్గరగా తెచ్చేది వాళ్ళ జీవన శైలి, వాళ్ళ అభిప్రాయాలూ, వాళ్ళ ఆత్మ గౌరవం, వాళ్ళ బంధానుబంధాలు. యిద్దరూ స్వతంత్రులు, స్వయంపోషకులు, తెలివైయినవాళ్లు, మానసికంగా దృఢమయినవాళ్లు. వాళ్ళ జీవితాలు పురుషుల మీద ఆధారపడి లేవు, పురుషుల చుట్టూ అల్లుకుని కూడా లేవు. నిజానికి కొంతమంది పురుషులే ఈ స్త్రీల మీద ఆధారపడి ఉంటారు. వీళ్ళ జీవితాల్లోకి పురుషులు వస్తూ పోతూ ఉంటారు, కానీ వీళ్లు మాత్రం బలంగా నిలదొక్కుకునే ఉంటారు. ఇద్దర్నీ కూడా సమాజం అసహ్యించుకుంటుంది. ఒకరి కులంతో, ఆ కులం ద్వారా వచ్చిన వృత్తితో సమస్య ఉంటె, మరొకరు ఎన్నుకున్న వృత్తి వలన తమవారితో పాటు సమాజపు ద్వేషాన్ని కూడా ఎదుర్కొంటారు. కానీ, తమను తాము మాత్రం ద్వేషించుకోరు, అసహ్యించుకోరు, వాళ్లిద్దరూ తమను తాము, తమ జీవన విధానాలను, తమ ఎంపికలను గౌరవించుకుంటారు. డ్రామా అఫ్ ఐడియాస్ లో జరిగేట్లుగానే, వీళ్లిద్దరి మాటల్లో ఆలోచనల్లో ఎన్నో పాత్రల మనోభావాలు కనిపిస్తుంటాయి, సంఘర్షిస్తూ ఉంటాయి. అలా అని, ఈ రెండు పాత్రలు మిగతా పాత్రలన్నిటిని తమలో కలిపేసుకుంటాయని కాదు. కానీ, మిగతా స్త్రీలలో, పాత్రల్లో ఉన్న సంఘర్షణ వీరిలో కనిపిస్తుంది. వీరిలో ఉన్న సంఘర్షణ మిగతా పాత్రల్లో ప్రతిఫలిస్తూ ఉంటుంది.

పురుషాధిక్య సమాజంలో ఇలాంటి స్త్రీ పాత్రల చుట్టూ నాటకాలు రచించడమంటే విప్లవాత్మకమయిన నిర్ణయమే.

ఏ స్త్రీ కూడా పూర్తిగా ఒక దేవత కాదు, పిశాచి కాదు. ప్రతి స్త్రీ కూడా తమ చుట్టూ ఉన్న స్త్రీలను తమ హృదయంలో దాచుకునే ఉంటారు.

మధురవాణి గురించి మనకు చాలావరకు తెలుసు కాబట్టి, మళ్ళీ మళ్ళీ చర్చించుకున్నాం కాబట్టి, మిసెస్ వారెన్ గురించి ఎక్కువగా తెలుసుకుందాం. మిసెస్ వారెన్, ఆమె కూతురు మాత్రమే మనకు ఎక్కువగా కనిపించే పాత్రలు ఈ నాటకంలో. మిగతా పురుష పాత్రలు వస్తూ పోతుంటాయి. ఎక్కువగా చర్చ, భావ సంఘర్షణ తల్లి కూతుళ్ళ మధ్యే జరుగుతుంది. మిగతా పురుష పాత్రలు ఆ చర్చలో అప్పుడప్పుడు పాలు పంచుకుంటూ ఉంటాయి. అందులో, కూతురు పాత్రను ప్రేమించిన వ్యక్తి ఒకరయితే, మిసెస్ వారెన్ కు స్నేహితులుగా, ఒకప్పటి ప్రేమికులుగా చెప్పుకుంటూ కూతురు పాత్రకు దగ్గరవ్వాలని ప్రయత్నించే పురుష పాత్రలు మరి కొన్ని. ఆమె పేరు శ్రీమతి వారెన్ అయ్యుండొచ్చు కానీ, ఆమె శ్రీమతి కాదు, ఆమె జీవితంలో మిస్టర్ వారెన్ కూడా లేదు. భావజాల సంఘర్షణ జరిగే మిసెస్ వారెన్ ఆమె కూతురు ఒకే నాణానికి చెందిన రెండు వైపులుగా అనిపిస్తారు. సాండ్రా గిల్బర్ట్, సూసన్ గుబార్ రాసిన మాడ్ వుమన్ ఇన్ ది ఆటిక్[7] సిద్ధాంతానికి ఇది చాల దగ్గరగా ఉంటుంది. వాళ్లేమంటారంటే, ఏ స్త్రీ కూడా పూర్తిగా ఒక దేవత కాదు, పిశాచి కాదు. ప్రతి స్త్రీ కూడా తమ చుట్టూ ఉన్న స్త్రీలను తమ హృదయంలో దాచుకునే ఉంటారు. వారితో నిరంతరం సంభాషిస్తూనే ఉంటారు, అది పంచుకోవడానికయినా గొడవ పడ్డానికయినా. ఉదాహరణకు కన్యాశుల్కం నాటకాన్ని తీసుకుంటే, అందులో చాలామంది ముఖ్యమయిన స్త్రీలు ఉంటారు. బుచ్చమ్మ, పూటకూళ్ళమ్మ, మధురవాణి, బుచ్చమ్మ తల్లి ఇలా ఎందరో. వీళ్ళందరూ కూడా వేర్వేరు వ్యక్తులు, వేర్వేరు

[7] Gilbert, Sandra M. The Madwoman in the Attic : the Woman Writer and the Nineteenth-Century Literary Imagination. New Haven :Yale University Press, 1979.

సమూహాలకు పరిస్థితులకు చెందినవాళ్ళే. అయినా సరే, మధురవాణి లాంటి పాత్రలు కొన్నిసార్లయినా సరే మిగతా పాత్రలను ప్రతిఫలిస్తుంది. కొన్నిసార్లు ఇంకోరిలా బ్రతికితే బాగుండుననుకుంటుంది. ఆమె కొన్నిసార్లు బుచ్చమ్మలా దుర్బలంగా, అమాయకంగా, ఆశావహంగా ఉంటుంది. అందుకే గిరీశం లాంటి వాళ్ళను నమ్మి వాళ్ళ కోసం ఎదురుచూస్తుంది. మరికొన్నిసార్లు ఆమె పూటకూళ్ళమ్మలా దృఢంగా, మొరటుగా ఉంటుంది. కానీ ఎప్పుడూ కూడా తనలాగే ఇతరులకు సహాయకారిగా ఉంటుంది. ఒక స్త్రీ పాత్ర అన్ని స్త్రీ పాత్రలుగా కాకపోవచ్చు. కానీ, ఒక స్త్రీ పాత్రలో చాలా స్త్రీ పాత్రలు ప్రతిఫలించవచ్చు.

“నేను మా అమ్మ కూతుర్ని. నేను నీలాగానే ఉంటాను. నాకు పని ఉండాలి, నేను ఖర్చు పెట్టేదానికన్నా ఎక్కువ డబ్బు సంపాదించగలగాలి.

అలాగే, మిసెస్ వారెన్ ఆమె కూతురు వివీ కూడా భిన్న వ్యక్తిత్వాలు కల వేరు వేరు వ్యక్తులు. వాళ్ళిద్దరి అభిప్రాయాలు మాత్రమే కాదు, జీవనశైలి కూడా భిన్నమే. నువ్వు నా మాట వినడం లేదని కూతుర్ని తల్లి నిందించినా, నువ్వు నా మీద అధికారాన్ని చెలాయిస్తున్నావని కూతురు ఫిర్యాదు చేసినా, వాళ్ళిద్దర్నీ కలిపి ఉంచే సూత్రం వాళ్ళ స్వతంత్ర స్వభావం, ప్రశ్నించే ధోరణి, ఆత్మగౌరవం, దోపిడీకి అవకాశమివ్వని విధానం. వివీ ఇలా అంటుంది, “నేను మా అమ్మ కూతుర్ని. నేను నీలాగానే ఉంటాను. నాకు పని ఉండాలి, నేను ఖర్చు పెట్టేదానికన్నా ఎక్కువ డబ్బు సంపాదించగలగాలి. కానీ, నా పని వేరు, నీ పని వేరు; నా దారి నీ దారి కాదు. మనం విడిపోవాల్సిందే. దాని వాళ్ళ మన జీవితాల్లో తేడా ఏమీ ఉండదు. ఈ ఇరవై ఏళ్ళల్లో కొన్ని నెలలు మాత్రమే మనం కలిసి ఉన్నాం. ఇకపై ఇంకెప్పుడు కలవరం. అంతే.”

సమాజం, స్నేహితులు మాత్రమే కాదు, వివీ కూడా తన తల్లిని తక్కువగానే చూస్తుంది. ఆ ప్రయత్నంలో తనను తాను గౌరవనీయమయిన మహిళగా చిత్రించుకుంటుంది. ఎలా అయితే తాను తన తల్లి ఒకటే అని చెబుతుందో, అలాగే తాను తన తల్లి వేరు వేరు అని కూడా చెబుతుంది, వాదిస్తుంది. “సాంప్రదాయక మాతృత్వ అధికారంతో నువ్వు నా మీద దాడి చేసావు. సాంప్రదాయక గౌరవనీయ

మహిళకు ఉండే ఆధిక్యతతో నన్ను నేను రక్షించుకున్నాను", అంటుంది వివీ. కానీ, షా తన ముందు మాటలో మిసెస్ వారెన్ నే సమర్థిస్తాడు. తల్లిని భరించలేని గౌరవనీయ కూతురికంటే మిసెస్ వారెన్ తక్కువేమి కాదంటాడు. డబ్బు సంపాదన పట్ల ఆమెకున్న అభిప్రాయం, డబ్బు సంపాదనకు ఆమె పాటించే మార్గాలు బ్రిటిష్ సమాజంలో ఉన్నవే. అవేమీ ఆమెకు మాత్రమే ప్రత్యేకమయినవి కాదంటాడు.

> వారానికి పద్దెనిమిది షిల్లింగుల జీతంలోనే తన ఇల్లు, ముగ్గురు పిల్లల్ని శుభ్రంగా నిర్వహించేవాడు. అతను తాగుడుకు అలవాటు పడ్డాక ఇదంతా మారిపోయింది.

సమాజాన్ని మధురవాణి ప్రశ్నించినట్లే, మిసెస్ వారెన్ కూడా ప్రశ్నిస్తుంది. మధురవాణి ప్రశ్నలు సందేహాలుగా, అతి చిన్న తిరుగుబాట్లుగా మిగిలిపోతాయి. కానీ, మిసెస్ వారెన్ తన జీవితాన్ని మార్చుకుని, తనకు కావలసినట్లుగా జీవించి మరీ చూపిస్తుంది. గౌరవనీయత అన్న పదం ఎంత బోలుదో చూపిస్తుంది. అన్నికంటే ఆత్మ రక్షణ, ఆత్మ గౌరవం ఎంత ముఖ్యమో చెబుతుంది. తన చాకిరిని, తన ఉనికిని మగవాళ్ళు వినియోగించుకోకుండా తన మార్గం తానే నిర్దేశించుకుంటుంది. ఆమెకు ఆ పాఠాలు నేర్పింది తన సవతి చెల్లెల్లే. "వాళ్ళు గౌరవంగానే జీవించారు. కానీ, వాళ్ళ గౌరవనీయత వాళ్ళకేమిచ్చింది? వాళ్ళల్లో ఒకరు రోజులో పన్నెండు గంటలు ఒక తెల్ల సీసం ఫ్యాక్టరీలో పని చేసేది. వారానికి తొమ్మిది షిల్లింగ్గుల జీతం. సీసపు విష ప్రయోగానికి గురై చనిపోయేదాకా ఆమె అక్కడే పనిచేసింది. బహుశా తన చేతులు కొంత పక్షవాతానికి గురవుతాయేమో అనుకుంది కానీ చనిపోయింది. ఇంకో అమ్మాయిని మాకందరికి ఒక ఆదర్శంగా చూపించేవాళ్ళు. ఎందుకంటే ఆ అమ్మాయి డెప్ట్ ఫర్డ్ లోని ప్రభుత్వ ఆహార వస్తువుల గిడ్డంగిలో కార్మికుడిగా పనిచేసేవాడు. వారానికి పద్దెనిమిది షిల్లింగుల జీతంలోనే తన ఇల్లు, ముగ్గురు పిల్లల్ని శుభ్రంగా నిర్వహించేవాడు. అతను తాగుడుకు అలవాటు పడ్డాక ఇదంతా మారిపోయింది. గౌరవంగా బ్రతకడమంటే ఇదే కదా, ఏమంటావ్?" పని చేసే చోట గుర్తింపు, సరయిన జీతం, జీవితానికి విలువ లేని చాకిరీ, ఆత్మగౌరవం లేని గౌరవనీయమయిన కుటుంబ మహిళగా జీవించడం రెండు

ఒకటే, మిసెస్ వారెన్ దృష్టిలో. గౌరవనీయత అంటే ఏమిటి? దాన్ని ఎవరు నిర్వచించారు, నిర్దేశించారు? ఒక స్త్రీ జీవితానికి అర్థమేమిటో ఎవరు నిర్ణయిస్తారు? మిసెస్ వారెన్ తాను వేరెవరికో లాభాన్ని చేకూర్చే ఒక వ్యాపార వస్తువు కాకూడదనుకుంటుంది. అందుకే తన జీవితాన్ని తన చేతుల్లోకి తీసుకుంటుంది. తనకు నచ్చినట్లు నడుచుకుంటుంది. "మమ్మల్ని సేల్స్ అమ్మాయిలుగా, బార్ మైడ్స్ గా, వెయిట్రెస్ గా ఉద్యోగంలో పెట్టుకుని, మా అందాన్ని ఎరగా వేసి వ్యాపారం చేసే మగవాళ్ళకి అనుగుణంగా నడుచుకోవడానికి మేమేమయినా పిచ్చివాళ్ళమనుకున్నావా? అది కూడా, మా మీద మేమే వ్యాపారం చేసి అన్ని లాభాలు మేమే తీసుకోగలిగినప్పుడు ఆకలితో ఎందుకు మాడి చావాలి?... ఈ గౌరవనీయ అమ్మాయిని అయినా ఎందుకు పెంచుతారు? ఒక డబ్బున్నవాడ్ని ఆకట్టుకుని, పెళ్లి చేసుకుని, వాడి డబ్బుతో జల్సా చెయ్యడానికే కదా? పెళ్లి అన్నది మాత్రమే ఇది సరైందా కదా అని చెప్పలేదు కదా! ఈ ప్రపంచపు కపటత్వం చూస్తే నాకు విసుగొస్తుంది....అలాంటి మనుషులంటే నాకు అసహ్యం. వ్యక్తిత్వం లేని వాళ్ళు. ఆడవాళ్ళలో నేను అసహ్యించుకునే గుణమేదయినా ఉందంటే అది వ్యక్తిత్వం లేకపోవడం", అంటుంది మిసెస్ వారెన్. బెర్నార్డ్ షా మిసెస్ వారెన్ ను పొగడడు, తెగడడు. కానీ, బ్రిటిష్ సమాజాన్ని తప్పు పడతాడు. "మిసెస్ వారెన్ వృత్తికి సంబంధించిన అపరాధాన్ని మిసెస్ వారెన్ మీదనే తోసెయ్యడం మన పవిత్రమయిన బ్రిటిష్ సమాజానికి అత్యంత సంతోషాన్నిస్తుంది. కానీ, నా నాటకం ఆదేశం ఏమిటంటే, ఆ అపరాధాన్ని బ్రిటిష్ ప్రజల మీదే తోసెయ్యడం".

గురజాడ నాటకం కన్యాశుల్కంలో లాగానే, ఇక్కడ కూడా తమ లాభం కోసం ఆడవాళ్లను ఎరగా వేసే మగవాళ్ళు చాలామందే కనిపిస్తారు.

గురజాడ నాటకం కన్యాశుల్కంలో లాగానే, ఇక్కడ కూడా తమ లాభం కోసం ఆడవాళ్లను ఎరగా వేసే మగవాళ్ళు చాలామందే కనిపిస్తారు. గురజాడలాగానే షా కూడా వాళ్ళందరి నిజ స్వరూపాలను స్పష్టంగా మన ముందుకు తీసుకుని వస్తారు. వివీతో ప్రేమలో ఉన్న ఫ్రాంక్ మాటి మాటికీ తల్లి కూతుర్లను పోలుస్తూ మిసెస్ వారెన్ ను కించపరుస్తూ ఉంటాడు. మిసెస్ వారెన్ వ్యాపారంలో భాగస్వామి అయిన ఒక వ్యక్తి వివీని పెళ్లి చేసుకుంటానంటాడు. ఆమెను ఒప్పించడానికి ఆమె

తల్లిని ఆమె ముందు చెడుగా చిత్రిస్తాడు. ఇంకో వ్యక్తి వివిఎన్ పుట్టుక గురించే ఫ్రాంక్ లో అనుమానాలు రేకెత్తిస్తాడు. ఆమె బహుశా మీ నాన్నకే పుట్టి ఉండొచ్చు, ఎలా పెళ్లి చేసుకుంటావని వెనక్కు లాగుతాడు. ఈ ఇద్దరు పెద్ద మనుషులు మిసెస్ వారెన్ వ్యాపారంలో భాగస్వాములే, ఒకప్పుడు ఆమెతో సంబంధం పెట్టుకున్నవాళ్ళే. కానీ, ఆమె కూతురితో కూడా సంబంధం పెట్టుకోవడానికి వెనుకాడరు. ఆమెను ఒప్పించడానికి తల్లి కూతుర్ల మధ్య విభేదాలను పెంచడానికి కూడా సిద్ధమవుతారు.

> మధురవాణి కి తనదైన కుటుంబం లేదు, దాన్ని గురించి ఆమె ఆలోచించదు కూడా. తనతో తాను, తనలో తాను, ఆమె సంతోషంగానే ఉంటుంది.

తులనాత్మక అధ్యయనమంటే కేవలం పోలికలను మాత్రమే చర్చించడం కాదు, తేడాలను కూడా చర్చలోకి తీసుకురావడం. మధురవాణి కి, మిసెస్ వారెన్ కి చాలా పోలికలు ఉండొచ్చు. కానీ, అంతే వ్యత్యాసం కూడా ఉంది. మధురవాణి కి తనదైన కుటుంబం లేదు, దాన్ని గురించి ఆమె ఆలోచించదు కూడా. తనతో తాను, తనలో తాను, ఆమె సంతోషంగానే ఉంటుంది. మిసెస్ వారెన్ కు ఆమె కూతురే అన్నీ. తన కూతురితోనే లండన్లో ఎప్పుడు ఉండకపోవచ్చు. మిగతా యూరోపియన్ దేశాలకు తన వ్యాపారం మీద తిరుగుతూ ఉండొచ్చు. కానీ, ఆమె మనసంతా తన కూతురి మీదే. మధురవాణి జీవితం, వృత్తి ఆమె ఎంచుకున్నవి కాదు. తరతరాలుగా సమాజం పాటిస్తున్న సంప్రదాయాల్లో భాగంగానే ఆమె తన జీవితాన్ని గడపాల్సి వస్తుంది. ఆ పాత్ర గొప్పతనం ఆమెకు ఇతరుల పట్ల ఉన్న సహానుభూతిలో కనిపిస్తుంది. ఎవరికయినా సరే సహాయం చెయ్యడానికి ఏ మాత్రం వెనుకాడడు. తన వృత్తి పట్ల పశ్చాత్తాపమో అపరాధ భావనో పెద్దగా కనపడదు కానీ ఏదో ఒక సందర్భంలో వేశ్యావృత్తిలో విలువల గురించి మరో కులంలో పుట్టడం గురించి ప్రస్తావిస్తుంది. అలాగని తన వృత్తిని సమర్థిస్తూ కూడా మాట్లాడదు. దానికి పూర్తిగా వ్యతిరేకం మిసెస్ వారెన్. ఆమె ఎంచుకున్న మార్గం ఆమె వృత్తి. ఏ కర్మాగారంలోనో, ఇరుకు ఇంటిలోనే, వేశ్యాగృహంలోనో

చాకిరీ చేస్తూ దోపిడీకి గురవుతూ రోగాలపాలై నశించిపోవడం ఆమెకు అసలు నచ్చని విషయం. నా జీవితం, నా ఇష్టం, నా నిర్ణయం అంటూ ఎలుగెత్తి చాటుతుంది. ఆ విషయంలో తాను ఎంతగానో ప్రేమించే కూతురితో వాదించడానికి కూడా వెనుకాడదు. ఆమె ఎంచుకున్న వృత్తి ఆమె కనిపెట్టిందేమి కాదు. సమాజంలో కొనసాగుతున్నది. కానీ, ఆ వృత్తిని ఆమె తన చేతిలోకి తీసుకుని తన జీవితాన్ని తనకు నచ్చినట్లుగా సాగిస్తుంది.

> ఈ ఇద్దరు స్త్రీ పాత్రలు కూడా ఆయా సమాజాల్లోని మారుతున్న పరిస్థితులకు అద్దం పడతారు. మార్పులో వాళ్ళు కూడా భాగమే.

పూర్తిగా ఒప్పుకోకపోయినా, అభ్యంతరాలు సందేహాలు ఉన్నా, మధురవాణి సంస్కరణ ఉద్యమాన్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తుంది, మార్పుకు కోసం ముందడుగు వేస్తుంది. కానీ, మిసెస్ వారెన్ తన నిర్ణయాన్ని సమర్థించుకోవడానికి చాలా బలమయిన వాదనను నిర్మించుకుంటుంది. మధురవాణి కుల వ్యవస్థ, పితృస్వామ్యం కలిసి అదే ఆటలో పావయితే, మిసెస్ వారెన్ పితృస్వామ్య భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా తన జీవితాన్నే తన సమాధానం చేసుకుంటుంది. రెండుచోట్ల మనకు కనిపించేది స్త్రీలను వ్యాపార వస్తువులుగా వాడుకుంటున్న ఆధిపత్య సమాజాలే.

ఈ ఇద్దరు స్త్రీ పాత్రలు కూడా ఆయా సమాజాల్లోని మారుతున్న పరిస్థితులకు అద్దం పడతారు. మార్పులో వాళ్ళు కూడా భాగమే. అందుకనే, ఈ రెండు నాటకాల్లోనూ ఈ రెండు ప్రధాన పత్రాలు రెండు రకాలుగా ముగింపు పలుకుతాయి. మార్పును ఆహ్వానించడమే తప్ప మధురవాణిలో తన పట్ల తనకు ఏ ద్వేషం, చులకన భావం కనిపించవు. ఏ ఆత్మగౌరవంతో అయితే ఆమె మనకు పరిచయమవుతుందో అదే ఆత్మగౌరవంతో పాఠకులకు వీడ్కోలు కూడా పలుకుతుంది. నిజానికి సంస్కర్తలమని చెప్పుకుని ఇతరులు మారాలని ఘోషించే పాత్రల్లో అయినా కొంత ద్వైదీభావం కనిపిస్తుందేమో కానీ మధురవాణిలో ఆ ఊగిసలాట కనిపించదు. తాను నమ్మిందే చేస్తుంది. మారాల్సి వచ్చినప్పుడు తన నమ్మకాలను విమర్శనాత్మకంగా పరిశీలించుకుని మార్చుకోవడానికి కూడా

సందేహించదు.

మిసెస్ వారెన్ మాత్రం తన వాదనను ఏ మాత్రం మార్చుకోడు. కూతురు దూరమవుతుందని ఒక వైపు విలపిస్తూనే, తాను చేసింది ఏ మాత్రం తప్పు కాదని మరోవైపు వాదిస్తుంది. అలాగే, వివిఎన్ కూడా తాను నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడుతుంది. అందర్నీ వదులుకుని మరీ తాను సరైందనుకున్న దారిలో ముందుకు వెళుతుంది. మిసెస్ వారెన్ కు కూతురు కావాలి. ఫ్రాంక్ కి వివిఎన్ భార్యగా కావాలి. కానీ, వివిఎన్కు మాత్రం ఎవరు అవసరం లేదు, ఆ ఇద్దరు అవసరం లేదు.

మిసెస్ వారెన్ నిర్ణయం మనకు నళిని జమీలా ఆత్మకథను గుర్తుకు తెస్తుంది[8]. ఒక సెక్స్ వర్కర్ గా తన జీవితం గురించి, తాను ఎదుర్కున్న సవాళ్ల గురించి, తాను తీసుకున్న నిర్ణయాల గురించి, తన అనుభవాల గురించి చర్చించే నళిని జమీలా తన ఆత్మ కథలో ఎక్కడ కూడా పశ్చాత్తాపాన్ని, విచారాన్ని ప్రకటించదు. ఇంకో లాగా జీవించి ఉంటె బాగుండేదని కూడా అనదు. తన బతుకుతెరువు కోసం, జీవితం కోసం, కూతురు కోసం ఎన్నో జీవనోపాధి మార్గాలను వెతుక్కుంటుంది, పెళ్లి–విడాకుల మధ్య సతమతమవుతుంది[9].

ఈ రెండు నాటకాలు, అందులోని స్త్రీ పాత్రలు చక్కటి విమర్శనాత్మక తులనాత్మక అధ్యాయనానికి వస్తువుగా పరిశోధకులు పరిశీలించవచ్చు. ఈ వ్యాసం కేవలం అటు వైపు ఒక సూచన మాత్రమే. మరింత విస్తృతమయిన చర్చ, పరిశోధన జరగాల్సి ఉంది, జరగాల్సిన అవసరం కూడా ఉంది.

---

[8] Jameela, Nalini. The Autobiography of a Sex Worker. Westland Books, 2010.

[9] Devika, J. "Housewife, Sex Worker and Reformer: Controversies over Women Writing Their Lives in Kerala." Economic and Political Weekly, vol. 41, no. 17, 2006, pp. 1675–83. JSTOR, http://www.jstor.org/stable/4418146. Accessed 18 Nov. 2023.
https://feminisminindia.com/2020/09/21/nalini-jameela-sex-work-activism-life/

# సంధ్యామేని



డా.బాలాజీ దీక్షితులు పి.వి
88853 91722

వెన్నెల కలువను నేనై
వెలుగుల రేడువు నువ్వై
మదినల్లుకుంటున్నట్లు

నీలిమబ్బు నేనై
ఇంద్రధనువు నీవై
గగనశిగన తారలా
ఎదనపూస్తున్నట్లు

ఇసుక తిన్నెల్లో
అడుగులో అడుగేస్తూ
మలయ మారుతాన
రాగ సమీరం ఆస్వాదిస్తూ
ఆనంద సంగమంలో
అలసిపోని అమృత ప్రేమతో
నీ భావాలు
మళ్ళీ మళ్ళీ నెమరేసుకొంటూ

కళ్ళ ముందు
చిత్రాలను చిత్రీకరించుకుంటున్నా
నువ్వు ఎంతదూరాన ఉన్నా
సంధ్యామేనిలో
వెన్నెల చందమామవై
ప్రియంగిలా
పున్నమి నాటికి వస్తావని
ఎదురుచూస్తూ

## పద్య ప్రకాశిక

# తెలుగు సాహిత్య సౌరభం- పద్య పరిమళం



డా. NCh. చక్రవర్తి
✆ 91822 76862

పూర్వకవులు అవకాశం ఉన్నచోట ఏదో ఒక అలంకారం, శ్లేష మొదలైనవి పండించేవారు. ఆ అలంకారం వలన లేదా శ్లేష వలన కవిత్వానికి శోభ కలిగేది. భావం మెరిసేది. కావ్యాలు, ప్రబంధాల్లో కొల్లలుగా ఉన్న ఇలాంటి పద్యాలలో కొన్ని మనం స్పృశిస్తూ చెప్పుకుంటున్నాం.

చేమకూర వేంకటకవి సృజించిన ఒక అద్భుత ప్రబంధం విజయవిలాసం. ఇందులో ప్రతిపద్యము ఏదో ఒక చమత్కృతితో ఉంటుంది. యమకాలంకార చక్రవర్తిగా పేరొందిన వేంకటకవి పద్యాన్ని పరిశీలిద్దాం. అర్జునుడు తీర్థ యాత్రాచణుడై గంగా తీరంలో ఉండగా అతడిని చూచి, ముగ్ధురాలైన నాగకన్య మోహించి, ధ్యానముద్రలో ఉన్న అర్జునుని ఉన్నపళాన తన నాగలోకానికి తీసుకువెళుతుంది. అక్కడకు వెళ్ళాక అర్జునుడు నెమ్మదిగా కళ్ళు తెరచి, చుట్టూ చూచి, అబ్బురపడతాడు. ఉలూచికి, అర్జునునకు సంభాషణ సాగుతుంది. తాను ఒక వ్రతినై గంగాతీరంలో ఉన్నానని అర్జునుడు చెప్తాడు. తన మోహాన్ని ఉలూచి వ్యక్తం చేసిన సందర్భంలోనిది ఈ పద్యం .

ఉత్పల. (1)

నాయమె నీకు మేల్వడిన నాతినలంచుట? యంత్ర మత్స్యమున్
మాయగఁజేసి మున్ ద్రుపదనందన నేలవె? యంగభూ పతా
కాయత యంత్ర మత్స్యమిపుడల్లనఁద్రెళ్ళగనేసి యేలుకో
తీయగఁబంచదార వెనుతీయగఁ బల్కి ననున్ ద్వితీయగన్

మేల్వడిన నాతిన్ = వలచిన కాంతను, అలంచుట = బాధపెట్టడం,

నీకు న్యాయమే = నీకు న్యాయమా? మున్ = మున్ను, యంత్రమత్స్యమున్= మత్స్యయంత్రాన్ని, మాయగఁజేసి = మాయముచేసి(పడగొట్టి), ద్రుపదనందనన్ = ద్రౌపదిని, ఏలవె = ఏలుకోలేదా? ఇప్పుడు = అలాగే ఇప్పుడు, అంగభూ = మన్మథుని, పతాకాయత యంత్రమత్స్యము = పతాకమై గొప్ప సాధనమైన చేపను, అల్లనన్ = వెంటనే, త్రెళ్ళగవేసి = తెగేసి, పంచదార వెనుతీయగ = పంచదార వెనుకబడేటట్టుగా, తీయగన్ పల్కి= తీయగా మాట్లాడి, ననున్ ద్వితీయగన్ = నన్ను భార్యగా, ఏలుకో = ఏలుకో.

అని అర్థం.

ఆనాడు మత్స్యయంత్రమును ఛేదించి ద్రౌపదిని చేపట్టినట్టుగానే మన్మథుని జెండా అయిన చేపను కొట్టి నన్ను ఏలుకో అంటుంది.

ఇక్కడ ఒక అద్భుత శ్లేష ఉంది.

పంచదార వెనుదీయగ = పంచదార వెనుకబడేటట్లుగా... తీయగా మాట్లాడి అని ఒక అర్థం.

పంచ దార అంటే అయిదుగురికి భార్య అని. అంటే ద్రోవది. పంచదార వెనుతీయగ అంటే ద్రోవది వెనుకబడేట్టుగా నాకు తీయగా వినపడే మాటలు మాట్లాడి అని ఒక అర్థం.

ఇక్కడ పంచదార(చక్కెర) అని ఒక అర్థం లోనూ, అయిదుగురి భార్య అయిన ద్రౌపది అని ఒక అర్థంలోనూ వాడి అందమైన శ్లేషను సృష్టించాడు కవి. మత్స్య యంత్రం అన్నచోట కూడా ఒక మనోహర చమత్కారాన్ని సృష్టించాడు కవి.

★★★★

ఆధునిక కవుల్లో ఒకరైన జంధ్యాల పాపయ్య శాస్త్రి గారు రసార్ద్ర కవిత్వాన్ని వెలయించారు. కరుణశ్రీ గా ప్రసిద్ధులు. కరుణశ్రీ అనగానే పుష్పవిలాపం గుర్తువస్తుంది. పూవు హృదయాన్ని సున్నితంగా సుకుమారంగా ఆవిష్కరించారు ఆ పద్యాల్లో. నిజానికి అది కవి ఆత్మ. కవి భావనలో జాలువారిన కవితా స్రవంతి. పుష్పవిలాపం ఖండిక లోని ఒక పద్యం.

ఉత్పల:(2)

మా వెలలేని ముగ్ధసుకుమార సుగంధమరంద మాధురీ
జీవితమెల్ల మీ కయి త్యజించి కృశించి నశించిపోయె, మా
యౌవనమెల్ల కొల్లగొని, యా పయి చీపురుతోడ చిమ్మి మ
మ్మావల పారబోతురుకదా! నరజాతికి నీతియున్నదా?

మానవుడు మిక్కిలి స్వార్థజీవి. తన ఆనందాన్ని మాత్రమే చూసుకుంటాడు.. ఇతరుల శ్రమను, ఆవేదనను పట్టించుకోడు. ఈ తత్త్వాన్ని ఈ పద్యంలో ఎత్తిచూపారు కవి. పువ్వు తన గోడును ఇలా చెప్పుకుంటున్నది

మా వెలలేని=అమూల్యమైన, ముగ్ధ సుకుమార సుగంధ మరంద మాధురీ జీవిత మెల్ల=అందమైన సున్నితమైన గంధాలుచిమ్మే తేనెలు జాలువారే చక్కని జీవితం అంతా కూడా , మీకయి త్యజించి కృశించి నశించి పోయెన్=మీకోసం(మానవుల కోసం) వదిలేసుకొని చిక్కి నాశనం అయిపోయింది. ఆపయి=అంతా అయ్యాక, చీపురుతోడ చిమ్మి=చీపురుతో ఊడ్చి, మమ్ము=మమ్మల్ని, ఆవల పారబోతురు కదా!=అవతల పడేస్తారు కదా!నరజాతికి నీతి ఉన్నదా?=మనుష్యజాతికి నీతి ఉందా? అని.

పూవు అడిగినట్టుగా కవి మానవసమాజాన్ని నిలదీస్తున్నాడు. మానవుని అసలు స్వరూపాన్ని తన కవిత్వం ద్వారా లోకానికి వెల్లడిస్తున్నాడు. పూలను వివిధ రూపాలలో వాడేసుకొని, ఆపై వాటిని ఊడ్చి, చెత్తలో పోస్తాడు. ఎంత దారుణం?? ఈ మాటలు పూలకే కాకుండా సుమ శరీరలై సుకుమార దేహలైన అభాగ్య వనితలు అందరికీ వర్తిస్తుంది. కాకపోతే ఇక్కడ పురుషులు తమ ఆనందం కొరకు స్వార్థులు కాగా పూల విషయంలో స్త్రీలు కూడా క్రూరతలో పాలు పంచుకుంటారు.

కవిత్వంలో ఒక సందేశం ఉండాలి. ఒక తాత్త్వికత ఉండాలి. కవి సందేశం ద్వారా మానవ సమాజం తనను తాను నిగ్గుదేల్చుకొని, సంస్కరణ మార్గంలో పోవాలి. అదే కవిత్వానికి అసలైన లక్ష్యం.

★★★★

ఇంక శతకాల విషయానికి వస్తే లోకాన్ని పరిశీలించి చెప్పిన భాస్కరశతకం లోని ఒక పద్యం చూద్దాం.

చంపక.(3)

అతిగుణ హీనలోభికి పదార్థము గల్గిన లేకయుండినన్
మితముగఁగాని కల్మిగల మీదటనైన భుజింపడింపుగా
సతమని నమ్మదేహమును సంపద నేఱులు నిండిపాఱినన్
గతుకగఁజూచుఁగుక్క తన కట్టడ మీఱక యెందు భాస్కరా!

అతిగుణ హీనలోభికిన్=మంచి గుణాలు లేని లోభికి, పదార్థము కల్గినన్=సంపద ఉన్నా, లేకయుండినన్=లేకపోయినా,కల్మి గల మీదటనైనన్ = సంపద కలిగినప్పుడు అయినా, మితముగ కాని=మితంగానే తప్ప,ఇంపుగా భుజింపడు=ఇష్టంగా కడుపునిండా తినడు.దేహమును, సంపదన్=ఈ శరీరాన్నీ ఆస్తులనూ, సతమని నమ్మన్=శాశ్వతం అనుకుంటాడు. ఎలాగంటే

ఏరులు నిండి పారినన్=ఏరు పొంగి పొర్లుతున్నా ,కుక్క =కుక్క, తన కట్టడ మీరక=తన అలవాటు మానుకోక, కతుకగన్ చూచున్=నాలుకతోనే నాకుతుంది కదా!

ఇది లోకంలో పిసినారి వ్యవహారం. ఇలాంటివి చదివిన తరువాతనైనా తనను కుక్కతో పోలుస్తున్నారు అని మారతాడా?? మారడు. డబ్బు ముందు అన్నీ దిగదుడుపే. తిట్టుకుంటే ఏమీ?? పట్టించుకోడు. ఇదే లోకరీతి.

★★★★

ఆధునిక శతకాలలో మాట మన్నించలేర శతకం ఒకటి. పాలపర్తి హవీలా ఈ శతక కవయిత్రి..ఆధునిక కవయిత్రులలో గొప్ప కవయిత్రిగా పేరు పొందింది. ఆమె తన పరిశీలనలను లోక రీతులను 107 పద్యాలలోవర్ణించింది.

తేగీ.(4)

ప్రస్తుతించిన వలదనువాడునైన
“వీరు పొగడితన్ బొంగని వారలన్న”
సన్నుతికి నిట్టెయగును బ్రసన్నుడనిన
నెనరుతో నవ్వి మాట మన్నించలేర?

ప్రస్తుతించినన్=తనను పొగడినప్పుడు,
వలదను వాడునైన=వద్దు వద్దు అనేవాడు సైతం,
వీరు ప్రస్తుతికిన్ బొంగని వారలన్న=వీరు పొగడ్తలు ఇష్టపడరు అనే ,
సన్నుతికి =పొగడ్తలకు ,
ఇట్టె ప్రసన్నుడగును= ఇట్టే పొంగిపోతాడు, అన్నన్ =అని చెప్తే,
నెనరుతో =నాపై ప్రేమతో
నవ్వి =నవ్వుతూ(సహృదయంతో)
మాట మన్నించలేర?=ఈ మాటను మన్నించలేరా??

అని కవయిత్రి అడుగుతుంది.

"ఫలానా వారు పొగడ్తలకు లొంగరు" అనేది ఒక పొగడ్త. ఆ పొగడ్త ఒక అగడ్త.అలా అనిపించుకోడం కూడా ఒక పొగడ్త కనుక అందులో పడి, పొంగిపోతారు కొందరు. ఇది ఒక బలహీనత కాదా!! ఇలాటి సున్నితమైన విమర్శలను సహృదయంతో తీసుకొమ్మని కోరుతుంది రచయిత్రి.

ఈ ధోరణులు లోకంలో మనం అందరం చూస్తూనే ఉంటాం.

అందుకే లోకంలో ఉన్నదే కవిత్వంలో ఉంటుంది. కవిత్వంలో లోకాన్ని సునిశితంగా ఎత్తి చూపడమే కవిత్వలక్ష్యం.

మరొకమారు మరికొన్ని విషయాలు చెప్పుకుందాం.

సూచనలు:

(1) చేమకూర వేంకట కవి విజయవిలాసం ప్రథమాశ్వాసం. 159 పద్యం. ప్రచురణ: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.

(2) కరుణశ్రీ గారి ఉదయశ్రీ లో పుష్పవిలాపం లోని పద్యం. సేకరణ: కరుణశ్రీ గారి సాహిత్య సర్వస్వం నుండి.

(3) మారదవెంకయ్య రచన భాస్కర శతకం 69వ పద్యం. ప్రచురణ : ముద్రా బుక్స్. విజయవాడ.

(4) పాలపర్తి హవీలా మాటమన్నించలేర శతకం. ప్రచురణ: భావనాప్రియ సాహిత్య బృందం ప్రచురణ, శ్రీనగర్ కాలనీ 2వ లైన్, ఖమ్మం. తెలంగాణా రాష్ట్రం.

శాస్త్ర ప్రకాశిక

# వైద్యవిభాగంలో 2015 సంవత్సరపు నోబెల్ ని అందుకొన్న మహిళ - తు యోయో



డాక్టర్ చాగంటి కృష్ణ కుమారి
✆ 98851 63304

చైనా దేశానికి చెందిన తు యోయో 2015 సంవత్సరపు నోబెల్ ని వైద్యరంగ విభాగంలో అందుకొంది. 2015 సంవత్సరం వైద్యరంగ పరిశోధనల నోబెల్ పురస్కారాన్ని ముగ్గురు పంచుకొన్నారు. ½ వంతు తు యోయో మలేరియా వ్యాధికి కనుగొన్న నూతన చికిత్సావిధానానికి పొందగా, మిగిలిన రెండు 1/4 వంతు భాగాలని ఎలికపాములు / నట్టలు (roundworms) వల్ల సంక్రమించే వ్యాధికి చికిత్సావిధానాన్ని కనుగొన్నందుకు జపాన్ కి చెందిన జీవరసాయనికుడు సతోషి ఓమ్రు (Satoshi Omura), ఐరిష్ జీవశాస్త్రజ్ఞుడు విలియం.సి. కామ్ బెల్ (William C. Campbell) చెరో భాగాన్ని పొందారు.

తు యోయో (Tu Youyou) చైనాలోని రేవు పట్టణం నింగ్ బౌవ్ (Ningbo) లో 1930 డిశెంబర్ 30 న పుట్టింది. తండ్రి తు యోయో అన్న పేరును చైనీస్ బుక్ ఆఫ్ ఓడ్స్ నుండి గ్రహించాడు. ఒకానొక అడవి జాతి మొక్క ను తింటున్నప్పుడు జింక అరిచే శబ్దమైన 'యోఓవ్ యోఓవ్' తీసికొని కూతురికి పేరు పెట్టాడు. వారి కుటుంబ నామం 'తు' (Tu). జింక తిన్న ఆ మొక్క నుండే యోయో మలేరియాకి మందైన ఆర్టిమిసినిన్ (Artemisinin) క్రియాశీల పదార్థాన్ని వేరుపరచడం ఒక యాదృచ్ఛికము.



[ My [first] name, Youyou, was given by

my father, who adapted it from the sentence '呦呦鹿鸣，食野之蒿' translated as 'Deer bleat "youyou" while they are eating the wild Hao' in the Chinese Book of Odes. How this links my whole life with qinghao will probably remain an interesting coincidence forever——Tu Youyou, when interviewed in 2011 after being awarded the 2011 Lasker-DeBakey Clinical Medical Research Award]

నలుగురు అన్నదమ్ములకు ఒక్కగానొక్క సోదరి యోయో. చదువుకు ప్రాధన్యతనిచ్చే కుటుంబంలో పుట్టింది. అందువల్ల బాగా చదువుకొంది. మిడిల్ స్కూల్ చదువు తరువాత ఆమెకు టి.బి. రావడంవల్ల రెండు సంవత్సరాలు చదువు ఆగిపోయింది. కానీ అదే ఆమె వైద్య పరిశోధన వైపుకి మళ్లేలా ప్రేరణ కలిగించింది. పెకింగ్ మెడికల్ స్కూల్లోనూ, బీజింగ్ మెడికల్ కాలేజీలోను చదువుకొంది. 1955లో బీజింగ్ మెడికల్ స్కూల్ ఆఫ్ ఫార్మసి నుండి గ్రాడ్యుయేట్ అయ్యింది. చైనా అకాడమి ఆఫ్ చైనీస్ మెడికల్ సైన్సెస్ లో చైనీస్ హెర్బల్ మెడిసిన్ పై పరిశోధనను కొనసాగించింది

సిస్టి సోమైసిస్ (Schistosomiasis) జబ్బు చికిత్సలో సూచించే చైనా వారి సాంప్రదాయ మందు (Lobelia chinensis) పైన పరిశోధనతో తు యోయో పరిశోధనా జీవితాన్ని మొదలుపెట్టింది. ఈ వ్యాధి బల్ల పరుపు పురుగులు (flat worms) అనే పరాన్న జీవుల (parasite) వల్ల సంక్రమిస్తుంది. కానీ, తొలిసారిగా ప్రచురితమైన ఆమె పరిశోధనా పత్రంలో బెలియా చైనెన్సిస్ మొక్క (Lobelia chinensis) పైన జరిపిన ఔషధ వృక్ష శాస్త్రీయ(pharmacognostical) అధ్యయానాలు, 1958 లో రోడిక్స్ స్టెల్లారె (Radix Stellariae) మొక్కపై ఔషధ వృక్ష శాస్త్రీయ అధ్యనాలను పూర్తి చేసింది. 1959 నుండి 1962 దాకా మినిస్ట్రి ఆఫ్ హెల్త్ ఫర్ ప్రొఫెషనల్స్ విత్ వెస్ట్రన్(మోడ్రన్) మెడికల్ బాక్ గ్రౌండ్ (Ministry of Health for professionals with a Western (modern) medical background) వారు నిర్వహించిన చైనీస్ మెడికల్ థియరీ అండ్ ప్రాక్టీస్ ప్రోగ్రామ్ (Chinese medical theory and practice) లో శిక్షణ పొందింది. ఈ శిక్షణ ద్వారా చైనీయుల సాంప్రదాయ మందులపై, ఆధునిక మందులతో పాటుగా చాలా లోతైన పరిజ్ఞానాన్ని పొందింది.

నోబెల్ ను తెచ్చిపెట్టిన మలేరియా చికిత్సకు నూతన మందు కొరకై చేసిన పరిశోధన

దోమకాటుతో వచ్చే మలేరియా ప్రాణాంతకమైన అంటు వ్యాధి. దానిని క్లోరోక్విన్, క్వినోలిన్ లతో చికిత్స చేయగా అదుపులోకి వచ్చేది. ఆ తరువాత కొంతకాలానికి ఈ మందులని నిరోధించుకోగల ప్లాస్మోడియం ఫాల్సిపరమ్ (plasmodium falciparum) ఏక కణ జీవులు వృద్ధి చెందాయి. ఇవి మలేరియా కారకాలు. 1960 లలో మలేరియాని నిర్మూలించేందుకు చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. మలేరియా దోమలు పునరుత్పత్తితో విజృంభిస్తూనే వున్నాయి. ప్రపంచవ్యాప్తంగా మలేరియా వల్ల చనిపోతున్నవారి సంఖ్య గణనీయంగా పెరుగుతూ వుంది. యావత్ప్రపంచానికి అది ఒక సవాలుగా నిలిచింది. 1960లలో వాషింగ్టన్ డి.సి.లో గల వాల్టర్ రీడ్ ఆర్మి ఇన్స్టిట్యూట్ ఆఫ్ రీసెర్చ్ (Walter Reed Army Institute of Research–WRAIR) సరికొత్త మలేరియా మందుల తయారీకై పరిశోధనలు చేయడానికి ప్రోగ్రాముగు తలపెట్టింది. ముఖ్యంగా ఆగ్నేయ ఆసియాలోనున్న వారి సైనికులకు రక్షణనివ్వాలని దీనిని మొదలు పెట్టింది. అప్పుడు యు.ఎస్.వారి సైనిక దళాలు వియత్నామ్ యుద్ధంలో పనిచేస్తున్నవి. వీరిలో చాలా మందికి మలేరియా సోకింది. మృతుల సంఖ్య భయంకరంగా వుంది. 1972 నాటికి 214,000 రసాయనాలను పరిశోధకులు మలేరియా చికిత్సకు పరీక్షించి చూసారు. ఒక్కటి కూడా ఫలితాన్ని ఇవ్వలేదు.

వియత్నాం యుద్ధ సైనికులు మలేరియావ్యాధిన పడి ఎక్కువగా చనిపోతూ వుండడంతో అప్పట్లో వాడుకలోనున్న క్లోరోక్విన్ మందు పనిచేయడం లేదు కనక నార్త్ వియత్నాం చైనాని మలేరియా చికిత్సకి పనికివచ్చే కొత్త మందు తయారీకి సహాయాన్ని కోరింది. 1967 మే మాసంలో చైనా కమ్యూనిస్ట్ పార్టీ చైర్మన్ మావో జెడాంగ్ (Mao Zedong). క్లోరోక్విన్ నిరోధక మలేరియా వ్యాధికి కొత్త మందు కనుగొనాలంటూ ప్రోజెక్ట్ 523 ని ప్రవేశపెట్టాడు. అప్పుడు టు యోయో (Tu Youyou) వయసు 39 ఏళ్లు. ఇద్దరాడపిల్లల తల్లి. ఆమెను 523 ప్రోజెక్ట్ కి అధిపతిగా నియమించారు. ముఖ్యంగా ఆమె మలేరియా పరాన్న జీవులు వృద్ధి చెందుతున్న ప్రదేశాలను సందర్శిస్తూ ప్రాదేశికంగా పరిశోధన నిర్వహించాలి. అది ఆమెకు వారు అప్పచెప్పిన పని. అందువల్ల చిన్న కూతుర్ని తన తల్లి దగ్గర, ఐదేళ్ల కూతురిని నర్సరిలో టీచర్ కి పూర్తి బాధ్యతలు తీసుకొనే విధంగా అప్పచెప్పాల్సి వచ్చింది. "పరిశోధనకి ఎక్కువ ప్రాధాన్యతనివ్వాలనుకొని నా వ్యక్తిగత జీవితాన్ని త్యాగం చేయాలనుకొన్నాను. నాభర్త ట్రైనింగ్ కాంపస్ కి వెళ్ళి మాకు దూరంగా వున్నాడు. మూడు సంవత్సరాల తరువాత నేను బీజింగ్ తిరిగివచ్చినప్పుడు నా

చిన్నకూతురు నన్ను పోల్చుకోలేదు. పెద్దదాన్ని దగ్గరకు తీసుకోబోగా టీచర్ వెనక నక్కి నన్ను చూస్తూ వుండిపోయింది." అని తు యోయో చెప్పింది.

తు యోయో దక్షిణ చైనాలోని హీనన్ లంక (Hainan Island)లో పర్యటించింది. అప్పుడు అక్కడ మలేరియా బాగా వ్యాప్తిలో వుంది. అక్కడి వాన అడవుల్లో పర్యటించినప్పుడు మలేరియా జనాలను విపరీతంగా పీడిస్తున్న వైనాన్నీ, అక్కడి జనాల దీన స్థితిని స్వయంగా చూసింది.



gambiae mosquito is a known vector for the parasitic disease, malaria, caused by organisms that are members of the genus Plasmodium, 2014 © CDC Public Health Image Library

బీజింగ్ చేరుతూనే ఆమె పరిశోధక బృందం పూర్వీకులు మలేరియాను ఎలా ఎదుర్కొన్నారో తెలుసుకోవాలని చైనా ప్రాచీన వైద్య పుస్తకాలను సమీక్షించారు. జావ్ (Zhou), చింగ్ (Qing), హెన్ రాజవంశాల (Han Dynasties) వైద్య పుస్తకాలను తు యోయో శోధించింది. అప్పటికే రెండు వందల నలభై వేల రసాయన పదార్థాలను మలేరియాను అరికట్టడానికి పరీక్షించి చూసారు. అవి ఏవీ పనిచేయలేదు. అడపాదడపా జ్వరం వస్తూ పోతూ వున్నప్పుడు 400 AD లోనే చైనీయులు మాచిపత్రి (sweet wormwood) ని వాడిన సంగతి తెలియవచ్చింది. అడపాదడపా జ్వరం వస్తూ పోతూ వుండడమన్నది మలేరియాలో కనిపించే లక్షణం.

Artemisia is a large, diverse genus of plants belonging to the daisy family Asteraceae, with between 200 and 400 species. Common names for various species in the genus include mugwort, wormwood, and sagebrush.



అందువల్ల తు యోయో శాస్త్రవేత్తల బృందం 1971లో మాచిపత్రిలో నున్న ఒక క్రియాశీల సమ్మేళనాన్ని (active compound) వేరుపరచారు. అది మలేరియా పరాన్న జీవులపై దాడి చేయగలదని భావించారు. వారు మాచిపత్రి నుండి నిష్కరించిన ఆ (extract) పదార్థంతో పరీక్షించి చూసారు. ప్రయోజనం కనిపించలేదు. తు యోయో మళ్లీ ప్రాచీన గ్రంధాలను తిరగవేసి చూసింది. వారు తొలుత క్రియాశీల పదార్థాన్ని వేరు చేయడానికి మాచిపత్రాలను నీటితో మరిగించారు. అనగా నీటిని ద్రావణిగా (solvent) వాడారు. అలా నీటితో మరిగించి నప్పుడు క్రియాశీల పదార్థం దెబ్బతిని వుండవచ్చునని తు యోయో అనుకొంది. ఈసారి నీటికి బదులు ఈథర్ – ఆధారిత ద్రావణి వాడి చూడ దలచింది. ఈ ద్రావణి తక్కువ ఉష్ణోగ్రత దగ్గరే మరుగుతుంది, కనక క్రియాశీల పదార్థం దెబ్బతినక పోవొచ్చు. ఈ విధంగా తయారు చేసిన క్రియాశీల పదార్థాన్ని కోతుల మీద, ఎలుకల మీద ప్రయోగించి చూసింది. ఆ




పరీక్షలు నూరు శాతం విజయవంతం అయ్యాయి. తు యోయో, మరో ఇద్దరు సహ పరిశోధకులు తమ మీద తాము పరీక్షించి చూసారు. ఆ తరువాత హీనన్ లంక వాసులలో 21 మంది రోగులకు వాడి చూసారు. వారంతా మలేరియా నుండి స్వస్థత పొందారు. ఆమరుసటి సంవత్సరానికి మాచి పత్రిలో గల మలేరియాకి మందుగా పనికి వచ్చే క్రియాశీల పదార్థాన్ని స్వేదనం ద్వారా (distillation) పొంది అది ఆర్టిమిసినిన్ (Artemisinin) గా గుర్తించారు. దీని Molecular Formula C15H22O5. అణు నిర్మాణమును పటంలో చూడవచ్చు. తు యోయో శాస్త్రవేత్తల బృందం తమ ఫలితాలను వెల్లడించారు. కానీ ఈ పరిశోధన 1979 వరకూ ఇంగ్లీషులో ప్రచురించబడలేదు. 1981లో WHO, World Bank, UN సంస్థలు తు యోయో ని అంతర్జాతీయ వేదికపై ఆమె ఫలితాలపై ఉపన్యసించమని ఆహ్వానించాయి.

మొదట చైనా ప్రభుత్వం తు యోయో ని తన పరిశోధనాఫలితాలను ప్రచురించడానికి అంగీకరించలేదు. కానీ 1980లకి ఆమె మలేరియాపై చేసిన ప్రయోగ ఫలితాలు అంతర్జాతీయ ప్రేక్షకులకు చేరాయి. 2000 సంవత్సరంలో డబల్యు హెచ్ ఓ ( World Health Organization) మలేరియా చికిత్సకి

ఆర్టిమిసినిన్ వాడాలని సిఫార్సు చేసింది. తు యోయో ఆర్టిమిసినిన్ పై పరిశోధనను కొనసాగించింది. రెండవ మలేరియా నిరోధక మందును డై హైడ్రో ఆర్టిమిసినిన్ (Dihydroartemisinin) అభివృద్ధి చేసింది. 2011లో Lasker-DeBakey Clinical Medical Research Award పొందింది. ప్రస్తుతం తు యోయో చైనా అకాడమి ఆఫ్ చైనీస్ మెడికల్ సైన్సెస్ లో ప్రధాన ఆచార్య పదవిలో వున్నది.

Tu, credited with the discovery of artemisinin to treat malaria, became the first female scientist to win China's top science and technology award



Tu Youyou, winner of the 2015 Nobel Prize in physiology or medicine, receives her 2016 national Science & Technology Award from President Xi Jinping on Monday in the Great Hall of the People in Beijing. Photo: Li Xueren / Xinhua News Agency

★★★

## References for further reading

1. Tu, Youyou (11 October 2011). "The discovery of artemisinin (qinghaosu) and gifts from Chinese medicine". Nature Medicine. Nature. 17 (10): 1217–1220.
2. https://www.nobelprize.org/prizes/medicine/2015/tu/facts/

ISSN 2766-0168
అంతర్జాల త్రైమాస పత్రిక
వ్యవస్థాపక సంపాదకులు
కీ.శే. గురజాడ వేంకట అప్పారావు
www.prakasika.org

# ప్రకాశిక

సమగ్ర సాహిత్య, సామాజిక పత్రిక
సంపుటి 3 | సంచిక 4 అక్టోబర్-డిసెంబర్ 2023

మమత-సమత-మానవత
www.gurajada.org

## ధన్యోస్మి



అక్టోబర్ – డిసెంబర్ 2023 సంచికలో ప్రచురణ కోసం మంచి వ్యాసాలు, కవితలు ప్రత్యేకంగా రాసి పంపిన వ్యాసకర్తలకి శతకోటి నమస్సులు. ఈ సంచిక మూడవ వార్షిక సంచిక.
ఈ మూడు సంవత్సరాలలో ప్రకాశిక లో వ్యాసాలు, కథలు, కవితలు ప్రచురించినవారందరికీ పేరు పేరునా ధన్యవాదాలు. పత్రిక నడపడంలో సహకరించిన, సహకరిస్తున్న వారందరికీ కృతజ్ఞతలు.
ఈ సంచిక వెలువరించడంలో ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ సహకరించిన వారందరో, వారందరికీ వందనములు.

ప్రచురణ కోసం కథలు, కవితలు, పరిశోధనా వ్యాసాలు పంపమని రచయితలను కోరుతున్నాము.

ఎప్పటిలాగే పాఠకులు ఈ సంచికను కూడా చదివి ఆనందిస్తారని ఆశిస్తాను.

చదవండి, చదివించండి

భవదీయుడు
ఆచార్య కొవ్వలి గోపాలకృష్ణ
ప్రధాన సంపాదకులు

ISSN 2766-0168
అంతర్జాల త్రైమాస పత్రిక
వ్యవస్థాపక సంపాదకులు
కీ.శే. గురజాడ వేంకట అప్పారావు
www.prakasika.org

# ప్రకాశిక

సమగ్ర సాహిత్య, సామాజిక పత్రిక

సంపుటి 3 | సంచిక 4 అక్టోబర్-డిసెంబర్ 2023

మమత-సమత-మానవత
www.gurajada.org



## గురజాడ భావస్ఫూర్తి

1. దేశమంటే మనుషులు - తోటి మనుషులను ప్రేమించు.
2. వట్టి మాటలు కట్టిపెట్టి మేలైన పని తలపెట్టు.
3. సోమరితనం అభివృద్ధికి ప్రతికూలం - సోమరితనం వదిలి చురుకుగా ముందుకు సాగు.
4. వ్యర్థమైన కలహాలు పెంచుకోకు, వైర వైఖరిని విడిచిపెట్టు.
5. సొంత లాభం కొంత మానుకుని పొరుగు వారికి తోడుపడు.
6. అన్నదమ్ముల్లా మెలిగే వివక్ష రహిత సమాజానికి కృషి చేయి.
7. దేశాభిమానమంటే వట్టి గొప్పలు చెప్పడం కాదు - యేదైనా సమాజానికి మేలుకూర్చే మంచి కార్యక్రమం చేసట్టు.
8. కలిసి పనిచేసే తత్వం పెంపొందించుకో - సాటి ప్రజల ఉన్నతికి ఆనందించు.
9. నీరస సమాజం దేశప్రగతికి ప్రతిబంధకం - ఆరోగ్యకరమైన తిండితో శారీరక శక్తి పెంచుకో.
10. గతమెంతో గొప్పదని మురిసిపోకు, ఉజ్వల భవిష్యత్‌కి చురుగ్గా శ్రమించు.